తెలంగాణ

తెలుగు జాతీయ దినపత్రిక

# తెలుగు-వెలుగు

ప్రతిక్షణం ప్రజల పక్షం




సంపుటి :02, సంచిక : 298 హైదరాబాద్: సంపాదకులు: గున్నాల అనిల్ రెడ్డి, బుధవారం ఫిబ్రవరి 05, 2025, పేజీలు -12, వెల -5/-

Published from: Hyderabad, Rangareddy, Nizamabad, Adilabad, And Bhadradri Kothagudem, Vijayavada, Vishakapatnam, Kurnool, Anantapur

## కులగణన సర్వేపై సభలో
# వాడీవేడి చర్చ

- బిసిలకు పథకాల్లో లబ్ది చేకూర్చాలన్నదే లక్ష్యం
- పార్టీ పరంగా స్థానిక ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తాం
- విపక్ష పార్టీలు ఇందుకు సిద్దంగా ఉన్నాయా చెప్పాలి
- దేశంలోనే తొలిసారిగా కులగణన సర్వే చేపట్టాం
- నివేదికను అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన సిఎం రేవంత్ రెడ్డి
- కులగణన సర్వేపై రాజకీయాలు చేయొద్దన్న మంత్రి పొన్నం



**హైదరాబాద్,04(తెలంగాణ తెలుగు):** బిసి కులగణన సర్వేపై తెలంగాణ అసెంబ్లీలో వాడీ వేడి చర్చ జరిగింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలను సీఎం రేవంత్‌రెడ్డి తిప్పికొట్టారు. భారాస నేతలు సర్వేలో ఎందుకు పాల్గొనలేదని నిలదీశారు. ఇలా పాల్గొనని నేతలకు సభలో మాట్లాడే అర్హత లేదన్నారు. వారికి మైక్ ఇవ్వొద్దని స్పీకర్‌ను కోరారు. 'కులగణన సర్వే 50 రోజులు

వివరాలు 2లో

# ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన


- వర్గీకరణ అమలుకు కట్టుబడి ఉన్నట్లు వెల్లడి
- కమిషన్ నివేదిక మేరకు రిజర్వేషన్ల అమలు
- తనజీవితంలో చరిత్రలో నిలిచిపోయే రోజు
- అసెంబ్లీలో ప్రకటన చేసిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,04(తెలంగాణ తెలుగు):** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పు అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కోర్టు తీర్పు అమలు కోసం ఏకసభ్య కమిషన్ వేశామని తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటన చేశారు. వర్గీకరణ చేయాలని ఏకసభ్య కమిషన్ సిఫారసు చేసింది. కమిషన్ పలు జిల్లాల్లో పర్యటించి సమగ్ర నివేదిక రూపొందించింది. నేరుగా ప్రజలను కలుసుకుని విజ్ఞప్తులు సేకరించింది. మరికొందరు కమిషన్‌కు

వివరాలు 2లో

## వికసిత భారత్ తమ
# ధృడ సంకల్పం



- ఆ లక్ష్యం దిశగా పయనిస్తున్నాం
- రాష్ట్రపతి ప్రసంగంలో ఇదే స్పష్టం చేశాం
- రాబోయే 25 ఏళ్ల కాలానికి ప్రజల్లో విశ్వాసం పాదుకొల్పాం
- తప్పుడు హామీలతో ప్రజలను మోసం చేయడం లేదు
- కొందరు సెల్ఫీలు దిగుతూ..అద్దాల మేడల్లో ఉంటారు
- ప్రతి రూపాయి గ్రామానికి చేరుకునేలా చూస్తున్నాం
- రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి మోడీ సమాధానం

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** రాష్ట్రపతి ప్రసంగం 'వికసిత్ భారత్' లక్ష్యంపై దేశ దృఢసంకల్పాన్ని పునరుద్ఘాటించిందని ప్రధాని మోడీ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగం తమలో ఆత్మవిశ్వాసం నింపిందని, మరోసారి తమ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నందుకు ప్రజలకు కృతజ్ఞతలని చెప్పారు. రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి పద్నాలుగు సార్లు సమాధానం ఇచ్చే అదృష్టాన్ని దేశ ప్రజలు తనకు ఇచ్చారని, ఇందుకు తాను ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పార్లమెంటులో రాష్ట్రపతి చేసిన ప్రసంగంపై ధన్యవాద తీర్మానానికి లోక్‌సభలో ప్రధాని సమాధానమిస్తూ, 'మనం 2025లో ఉన్నారు. ఒకరకంగా 21వ శతాబ్దంలో 25 శాతం ముగిసిపోయింది. 20వ శతాబ్దంలో స్వాతంత్ర్యం తరువాత, 21వ శతాబ్దంలో 25 ఏళ్లలో ఏం జరిగిందనేది కాలమే చెబుతుంది. రాష్ట్రపతి ప్రసంగాన్ని జాగ్రత్తగా గమనిస్తే, రాబోయే 25 ఏళ్లలో, వికసిత్ భారత్ దిశగా ప్రజల్లో విశ్వాసం పాదుకొలపే దిశగా పనిచేయనున్నాం. వికసిత్ భారత్

వివరాలు 2లో

# యధాతథంగా పాతపన్ను విధానం

- రద్దు చేసే ఆలోచన లేదన్ననిర్మలా సీతారామన్



## ఐటి కార్యాలయానికి చేరుకున్న దిల్ రాజు



## నేడు ఢిల్లీ అసెంబ్లీ
# ఎన్నికలు

- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన ఎన్నికల సంఘం
- హ్యాట్రిక్ విజయం సాధించాలని ఆప్ పోరాటం



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** బుధవారం ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 70 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. ఢిల్లీ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు బుధవారం తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. ఢిల్లీలోని 70 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లు రేపు తమ ఓటు హక్కును వినియోగించుకో నున్నారు. బుధవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. ఫిబ్రవరి 8న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. మొత్తం ఎన్నికల ప్రక్రియ ఫిబ్రవరి 10 తో ముగియనుంది. ఢిల్లీలోని 70 నియోజకవర్గాల్లో 58 జనరల్ సీట్లు కాగా.. మరో 12 ఎస్సీ రిజర్వ్‌డ్ సీట్లు. మొత్తం 1.56 కోట్ల మంది ఓటర్లలో 83.49 లక్షల మంది పురుష ఓటర్లు కాగా.. 71.74 లక్షల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వారిలో 20 నుంచి 29 ఏళ్ల వయస్సు గల యువ ఓటర్ల సంఖ్య 25.89 లక్షలుగా ఉంది. 18 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల తొలిసారి ఓటేసే వారి సంఖ్య 2.08 లక్షలు. ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక అవసరాలు ఉన్న వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు ప్రకటించారు. పీడబ్ల్యూడీ వర్గం నుంచి 79,430

వివరాలు 2లో



## ఫిరాయింపుదారులకు
# షాక్

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నోటీసులు

## చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వంతో రిటైర్మెంట్
# ఉద్యోగులకు ఇబ్బందులు

- కనీసం హాస్పిటల్‌కు వెళ్దామన్న డబ్బుల్లేని పరిస్థితి : హరీశ్‌రావు

**హైదరాబాద్,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ప్రతి ఒక్కరు ఇబ్బందులు పడుతున్నారని, దీనిలో భాగంగానే రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులూ తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు విమర్శించారు. ఈ పోలీస్ అధికారి ఆవేదన చూస్తే హృదయం కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. 30 ఏళ్లకు పైగా ప్రభుత్వ ఉద్యోగిగా సేవలందించిన



ఠాగూర్ నారాయణ సింగ్ ఇలాంటి పరిస్థితుల్లో ఉండటం చాలా బాధాకరమని హరీష్‌రావు వాపోయారు. ఒకవైపు ఆ అధికారి రెండు కిడ్నీలు చెడిపోయి తీవ్రమైన

వివరాలు 2లో

## మా ఇంట్లో
# రేవంత్‌రెడ్డి ఫొటో లేదు

- ఇంకా కేసీఆర్ ఫొటోనే ఉంది
- హైడ్రా తీరుపై మరోసారి మండిపడ్డ దానం నాగేందర్



**హైదరాబాద్,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రాపై పలు సందర్భాల్లో నోరువిప్పారు. హైడ్రా వల్ల పేదల జీవితాలు ఆగం అవుతున్నాయని, పిల్లల పుస్తకాలు, సామగ్రి బయటపడేయడంతో బాధకలుగుతుందని అప్పట్లో ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తాజాగా మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. "నేను పోలీసులతో, హైడ్రా విషయంలో కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదు. మా ఏరియాకు వస్తే ఊరుకునేది లేదని రంగనాథ్‌కు చెప్పిన. పేదల ఇండ్లను కూలుస్తాం అంటే ఊరుకోను. అవసరమైతే జైలుకు పోతా కానీ కాంప్రమైజ్ కాను. నా ఇంట్లో వైఎస్, కేసీఆర్ ఫొటోలు ఉన్నాయి. రేవంత్ రెడ్డి ఫోటో ఇంకా రాలేదు" అంటూ దానం నాగేందర్ వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడీ వ్యాఖ్యలు సొంత

వివరాలు 2లో

## నేడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

మంది ఓటర్లు ఉన్నారు. ఇక 100 సంవత్సరాలు దాటిన ఓటర్ల సంఖ్య 830గా ఉంది. 85 ఏళ్ల వయస్సు దాటిన ఓటర్లు 1.09 లక్షల మంది ఉన్నారు. ఢిల్లీలో ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య 1,261గా ఉంది.ఈ ఎన్నికల్లో మరోమారు అధికారం దక్కించుకుని హ్యాట్రిక్ కొట్టాలని ఆప్ భావిస్తోంది. బిజెపి దీటుగా ప్రచారం నిర్వహించింది. కాంగ్రెస్ కూడా ఒంటరి పోరాటం చేస్తోంది.తృణమూల్,సమాజ్‌వాదిపార్టీలు ఆప్‌కు మద్దతుగా నిలిచాయి.

## యధాతథంగా పాతపన్ను విధానం

**- రద్దు చేసే ఆలోచన లేదన్న నిర్మలా సీతారామన్**



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** యధాతథంగా పాతపన్ను విధానం ఉంటుందని, దానిని రద్దు చేసే ఆలోచన లేదని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నేపథ్యంలో పాత పన్ను విధానాన్ని రద్దు చేస్తారన్న ప్రచారం నేపథ్యంలో దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. పాత పన్ను విధానం రద్దు చేసే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఇండియాటుడే– బిజినెస్‌టుడే నిర్వహించిన 2025 రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా దీనిపై మాట్లాడారు. 'పన్ను చెల్లింపుదారులందరూ కొత్త పన్ను విధానంలోకి మారాలని మీరు భావిస్తున్నారా?' అంటూ ఎదురైన ప్రశ్నకు నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. పాత పన్ను విధానం రద్దు చేయాలన్న ప్రతిపాదన తమ వద్ద లేదన్నారు. పన్ను ఫైలింగ్ విధానం సరళంగా ఉండాలనే ఉద్దేశంతో కొత్త పన్ను విధానం తీసుకొచ్చినట్లు చెప్పారు. కొత్తగా తీసుకురాబోయే ఆదాయపు పన్ను చట్టం గురించి కూడా ఈ సందర్భంగా ప్రస్తావన వచ్చింది. 1961లో తీసుకొచ్చిన పాత ఆదాయపు పన్ను చట్టం స్థానంలో అనేక మార్పులు, చేర్పులతో కొత్త ఆదాయపు పన్ను చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్టు వెల్లడించారు. మరికొద్ది రోజుల్లో ప్రవేశపెట్టబోయే ఈ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందుతుందని భావిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వంతో రిటైర్మెంట్ ఉద్యోగులకు ఇబ్బందులు

(మొదటి పేజీ తరువాయి)

ఆరోగ్య సమస్యలు, మరోవైపు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఆర్థిక సమస్యలు చుట్టుముట్టి ఆందోళన చెందు తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరోగ్య భద్రత కార్డుతో చికిత్స చేయించుకుందామని ఆస్పత్రికి వెళ్తే ఆ కార్డు చెల్లదని పంపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం ఈ విశ్రాంత పోలీసు ఉద్యోగికి శాపంగా మారిందని హరీష్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఒక నారాయణ సింగ్ సమస్య కాదని.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రిటైర్డ్ అయిన 8000 మంది ప్రభుత్వ ఉద్యోగుల జీవన్మరణ సమస్య అని చెప్పారు. రేవంత్ రెడ్డికి ఉద్యోగుల పట్ల ఏమాత్రం ప్రేమ ఉన్న వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. వైద్యసేవలు పొందడంలో అంతరాయం కలగకుండా ఈహెచ్‌ఎస్, పోలీస్ ఆరోగ్య భద్రత కార్డులు ఆస్పత్రుల్లో పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## ఐటి కార్యాలయానికి చేరుకున్న దిల్ రాజు

**హైదరాబాద్,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ఎఫ్ డిసి చైర్మెన్, నిర్మాత దిల్ రాజు ఐటి కార్యాలయానికి వెళ్లారు. గత వారం దిల్ రాజు ఇంట్లో నాలుగు రోజుల పాటు ఐటి అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల అనంతరం వ్యాపారాలకు సంబంధించిన వివరాలు తీసుకరావాలని దిల్ రాజుకు నోటీసులు పంపారు. సినిమాల నిర్మాణం, ఎగ్జిబిషన్ లాభాల వ్యవహారంపై ఐటి అధికారుల ఆరా తీశారు. జనవరి 21న శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్, మైత్రి మూవీ మేకర్స్, మ్యాంగో మీడియా సంస్థల్లో ఐటి అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఐటి సోదాలు అనేది కామన్.. అకౌంట్ బుక్స్ చెక్ చేసి స్టేట్‌మెంట్ తీసుకున్నారని, మా ఇంట్లో రూ.20 లక్షల లోపే డబ్బులు ఉన్నాయని టాలీవుడ్ ప్రముఖ నిర్మాత దిల్ రాజు గతంలో తెలిపిన విషయం విధితమే.



## కులగణన సర్వేపై సభలో వాడీవేడి చర్చ

(మొదటి పేజీ తరువాయి)

జరిగితే .. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పద్మారావు, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ భాజపా ఎంపీ డీకే అరుణ సర్వేలో పాల్గొనలేదు. సర్వేలో భూమి వివరాలు చెప్పాలని ఫామ్‌లో ఒక కాలమ్ ఉంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ఎవరూ సమాచారం ఇవ్వలేదు. 3.54 కోట్ల మంది సర్వేలో పాల్గొంటే.. ఎమ్మెల్యేలు, ఎంపీలు అందరూ భూముల వివరాలు ఇచ్చారు. కానీ, భూముల వివరాలు అడగ్గానే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు భయపడి సర్వేలో పాల్గొనలేదు' అని అన్నారు. గత ప్రభుత్వం సమగ్రసర్వే నివేదికను ఎందుకు బయటపెట్టలేదో చెప్పాలన్నారు. దానిని పబ్లిక్డొమైన్‌లో ఎందుకు పెట్టలేదన్నారు. ఆనాడు అధికారికంగా అసెంబ్లో ఎందుకు పెట్టలేదని బిఆర్‌ఎస్‌ను నిలదీసారు. ఇదే సందర్భంలో రిజర్వేషన్లకు రాజ్యాంగ సవరణ అవసరం కనుక అసెంబ్లీలో తీర్మానం చేసినా లాభం లేదన్నారు. అందుకే పార్టీ పరంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పక్షాన బీసీలకు 42శాతం సీట్లు ఇస్తాం అని ప్రకటించారు. అన్ని పార్టీలు దీనికి కట్టుబడి ఉంటాయా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో బీసీలకు మేం 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తాం. ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడి నుంచి మాట తీసుకున్నా. అన్ని పార్టీలు బీసీలకు 42శాతం సీట్లు ఇవ్వాలి. కులగణన సర్వే డేటాను సంక్షేమ పథకాల విధానాల తయారీకి వాడతాం. 1931 నుంచి ప్రతి పదేళ్లకు ఓసారి జనగణన చేపట్టారు. 2014లో నరేంద్రమోదీ ప్రధాని అయిన తర్వాత ఇప్పటివరకు జనగణన జరగలేదు. 2021 నుంచి ఇప్పటి వరకు సర్వే చేయకుండా వదిలేశారు. దీనిపై బిజెపి నేతలు ప్రధాని మోడీపై ఎందుకు ఒత్తిడి చేయడం లేదన్నారు. బలహీనవర్గాలకు వారి హక్కులు ఇవ్వడం భాజపాకు ఇష్టం లేదు. ప్రధాని మోదీ .. బలహీనవర్గాలకు ఏదైనా సాయం చేయాలనుకుంటే 2021లో లెక్కించాల్సిన జనాభాను ఇంతవరకు ఎందుకు చేయలేదని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్య, రాజకీయ, కులగణన సర్వే నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నివేదికలోని అంశాలను సీఎం వివరించారు. 'రాష్ట్రంలో సమగ్ర ఇంటింటి కులగణన సర్వే చేయాలని ఫిబ్రవరి 2024లో నిర్ణయం తీసుకున్నాం. కర్ణాటక, బిహార్ సహా వివిధ రాష్ట్రాల్లో జరిగిన సర్వేలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాం. సర్వే నిర్వహించే విధానాలపై వివిధ సంఘాలు, మేధావుల అభిప్రాయాలు తీసుకున్నాం. దాదాపు 50 రోజుల పాటు సర్వే జరిగింది. గ్రామాల్లో 66.39 లక్షల కుటుంబాలు, పట్టణాల్లో 45.15 లక్షల కుటుంబాల్లో సర్వే నిర్వహించాం. రాష్ట్రంలో మొత్తంగా 1.12 కోట్ల కుటుంబాల వివరాలు సర్వే చేశాం. సర్వే ప్రకారం ఎస్సీలు 61,84,319 (17.43 శాతం), బీసీలు (ముస్లిం మైనారిటీ మినహా) 1,64,09,179 (46.25 శాతం), ఎస్టీలు 37,05,929 (10.45 శాతం), ముస్లిం మైనారిటీలు 44,57,012 (12.56 శాతం) మంది ఉన్నారు. ఈ నివేదికను సంక్షేమ విధానాల తయారీకి వినియోగిస్తాం.జనగణన కంటే పకడ్బందీగా కులగణన చేశాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటించాం. ఒక ఎన్యుమరేటర్ రోజుకు 10 ఇళ్లకంటే ఎక్కువ ఇళ్లలో సర్వే చేయలేదు. 8 పేజీలతో ఉన్న ప్రశ్నపత్రంలో సమగ్ర వివరాలు నమోదు చేశాం. 76 వేల మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు 36 రోజుల పాటు పనిచేసి డేటా క్రోడీకరించారు. మొత్తంగా రూ. 125 కోట్లు ఖర్చు చేసి సర్వే ద్వారా సమగ్ర వివరాలు సేకరించాం. మేం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సర్వే చేయించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. సర్వే ఆధారంగా ఆయా కులాల వారికి న్యాయం చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ సర్వే దేశానికే దిక్సూచిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. 'భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలకు ఈ సర్వే రోడ్‌మ్యాప్‌లా పనిచేస్తుంది. భావితరాలకు న్యాయం చేయడానికి సమగ్రంగా వివరాలు సేకరించాం. బలహీనవర్గాలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి ఉంది. బీసీలకు న్యాయం చేసేందుకు చేపట్టాల్సిన పథకాలపై విపక్షాలు సూచనలు చేయాలి' అని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. అంతకుముందు సమగ్ర కులగణన, ఎస్సీ వర్గీకరణ నివేదికలకు తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన అసెంబ్లీ హాల్లో సుమారు 2 గంటలపాటు క్యాబినెట్ భేటీ కొనసాగింది. ఈ నివేదికలను మధ్యాహ్నం 2 గంటలకు అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. క్యాబినెట్ భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'దేశంలో మొదటిసారి కులగణన చేసి చరిత్ర సృష్టించాం. పకడ్బందీగా సర్వేచేసి సమాచారం సేకరించాం. కులగణన, ఎస్సీ వర్గీకరణకు రోడ్ మ్యాప్ తెలంగాణ నుంచి ఇస్తున్నాం. కులగణన విషయంలో ప్రధాని పైనా ఒత్తిడి పెరుగుతుంది. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుతో పాటు మంత్రివర్గ ఉప సంఘం, ఏకసభ్య కమిషన్ సిఫార్సుల ప్రకారం ముందుకెళ్తాం. ప్రతిపక్ష నేత సభకు రావాలి కదా! ప్రధాన ప్రతిపక్షానికి బాధ్యత, చిత్తశుద్ధి లేదని వ్యాఖ్యానించారు.

## ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

ఆన్‌లైన్ ద్వారా విజ్ఞప్తులు అందించారు. 82 రోజుల్లో కమిషన్ తన నివేదికను అందించింది. 15 శాతం ఎస్సీ రిజర్వేషన్లను 3 గ్రూపులకు పంచుతూ కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీల్లో మొత్తం 59 ఉప కులాలను గ్రూప్–1, 2, 3గా వర్గీకరించాలని కమిషన్ సిఫారసు చేసింది.గ్రూప్–1లోని 15 ఉపకులాలకు 1 శాతం రిజర్వేషన్ (జనాభా 3.288 శాతం), గ్రూప్–2లోని 18 ఎస్సీ ఉపకులాలకు 9శాతం రిజర్వేషన్ (జనాభా 62.74 శాతం), గ్రూప్–3లోని 26 ఉప కులాలకు 5శాతం రిజర్వేషన్ (జనాభా 33.963శాతం) కల్పించాలని వర్గీకరణ కమిషన్ తన నివేదికలో పేర్కొంది. ఎస్సీ కులాల గ్రూప్‌లకు రోస్టర్ పాయింట్లు, క్రిమీలేయర్ విధానాన్ని కూడా అమలు చేయాలని కమిషన్ సిఫారసు చేసింది. ఎస్సీ వర్గీకరణ, కులగణన.. నా రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన అంశాలు. నా రాజకీయ జీవితంలో ప్రత్యేకంగా గుర్తుండి పోతుందని సిఎం రేవంత్ అన్నారు. ఎందరో ముఖ్యమంత్రులకు రాని అవకాశం నాకు వచ్చింది. చాలా రాజకీయ పార్టీలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా చూశాయి తప్ప.. ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే ప్రయత్నం చేయలేదు. అందుకే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం ద్వారా సమాజంలో తరతరాలుగా నిర్లక్ష్యానికి, దోపిడీకి గురైన వారికి న్యాయం చేయాలని సంకల్పించాం. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరుతున్నా అని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. 30, 40 ఏళ్ల నాటి ఆకాంక్ష నేడు సాకారం అవుతోందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎస్సీ వర్గీకరణ వల్ల కొందరిలో భయం, అభద్రతాభావం కలుగుతోంది. వర్గీకరణ వల్ల ఎవరి ప్రయోజనాలకు విఘాతం కలగదు. అంటరానితనం అనేది ప్రపంచం అంతటా ఉంది. ఎంత చదువుకున్నా.. ఎంత ఎదిగినా.. ఎక్కడో ఒకచోట వివక్ష ఎదుర్కోవాల్సి వస్తుంది. గాంధీజీ, అంబేద్కర్ వంటి మహనీయులకు కూడా వివక్ష తప్పలేదు. సామాజిక న్యాయం ఎక్కువగా కల్పించింది కాంగ్రెస్ పార్టీయే. 50 ఏళ్ల క్రితమే దళితనేత దామోదరం సంజీవయ్యను ఉమ్మడి రాష్ట్రానికి సీఎంను చేసింది కాంగ్రెస్ పార్టీ. జగ్జీవన్‌రామ్, దామోదరం సంజీవయ్య వంటి వారికి ఉన్నత పదవులు ఇచ్చింది. సామాజిక ఫలాలు అందరికీ అందాలనేది కాంగ్రెస్ పార్టీ తపన. ఎస్సీ వర్గీకరణ నిర్ణయం రాజకీయ కారణాలతో తీసుకోలేదు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అధ్యయనం చేసి తీసుకున్న నిర్ణయం ఇది. ప్రభుత్వానికి సంబంధం లేకుడా కమిషన్ అధ్యయనం చేసి నివేదిక ఇచ్చింది. ఎస్సీ వర్గీకరణకు మద్దతు ఉంటుందని ఏఐసీసీ ఎప్పుడో చెప్పిందని పేర్కొన్నారు. 30 ఏండ్ల ఉద్యమానికి ఈ రోజు పరిష్కారం దొరికిందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఎస్సీ వర్గీకరణ రిపోర్ట్ పై అసెంబ్లీలో తీర్మానం సందర్భంగా మాట్లాడిన ఆయన.. వర్గీకరణ ఏ వర్గానికి వ్యతిరేకం కాదన్నారు. సామాజిక న్యాయం అంబేద్కర్ కల అని చెప్పారు. ఇది మా ఏండ్ల నాటి కల అని అన్నారు. దేశంలో ఎస్సీలను ఏనాడు మనుషులుగా చూడలేదన్నారు. ఓ దళితున్ని పార్టీ అధ్యక్షుడిగా చేసింది కాంగ్రెస్ పార్టీనే అని కొనియాడారు.

## వికసిత భారత్ తమ దృఢ సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)

లక్ష్యాన్ని రాష్ట్రపతి ప్రసంగం ప్రతిబింబించింది. సరికొత్త ధీమాను కల్పిస్తూ, సామాన్య ప్రజానీకానికి స్ఫూర్తిగా నిలిచిందని మోదీ అన్నారు. 'గరీబీ హటోవా' నినాదంపై మాట్లాడుతూ. ప్రభుత్వం తప్పుడు హామీలు ఇవ్వదని, ప్రజలకు నిజమైన అభివృద్ధిని అందిస్తుందని ప్రధాని అన్నారు. ఇంతవరకూ పేదలుకు 4 లక్షల గృహాలు ఇచ్చామని, గతంలో మహిళలు బహిర్భూమి సిస్టమ్ లేక అవస్థలు పడవారని, ఎవరైతే అన్ని సౌకర్యాలు ఉన్నారో వారికి ఇలాంటి అవసరాలు అర్థం కావని పరోక్షంగా ప్రతిపక్ష కాంగ్రెస్‌కు చురకలు వేశారు. పేదల కోసం 12 కోట్లకు పైగా మరుగుదొడ్లు నిర్మించామని అన్నారు. గత ఐదు దశాబ్దాలుగా 2కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. అంకితభావంతో పథకాలు అమలు చేసినప్పుడే ఇలాంటి మార్పు సంభవమని అన్నారు. పేదల గురించి ఉత్తుత్తి హామీలు తాము ఇవ్వమని, అభివృద్ధి చేసి చూపిస్తామని చెప్పారు. పేదలు, సామాన్య ప్రజలు, మధ్యతరగతి సవాళ్లను అవగాహన చేసుకుని, వాటిని అధిగమించేలా చేసేందుకు కట్టుబడి ఉంటామని చెప్పారు. 'ప్రజల సొమ్ము ప్రజల చేతికే' అనేది మా నినాదం. డిజిటల్ సాంకేతికత ద్వారా పారదర్శకత పెంచాం. పది కోట్ల నకిలీ ఖాతాలను గుర్తించి తొలగించాం. ఇథనాల్ బ్లెండింగ్ ద్వారా విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదా చేశాం. గతంలో తరచూ రూ.లక్షల కోట్ల అవినీతిపై రోజూ వార్తలు వచ్చేవి. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలే లేవు. మా హయాంలో మౌలిక వసతుల కల్పనపై భారీగా వెచ్చించాం. కేంద్రంలో పదేళ్లుగా అవినీతి లేకపోవడంతో జనం లాభపడ్డారు. ఆయుష్మాన్ భారత్, జన్ ఔషధి కేంద్రాల ఏర్పాటుతో రోగులకు ఎంతో మేలు జరిగిందన్నారు. మా హయాంలో ప్రతి రూపాయిని ప్రజల కోసమే ఖర్చు చేస్తున్నాం. ప్రజల డబ్బును మేం అద్దాల మేడలు నిర్మించడానికి ఉపయోగించలేదు.. దేశాభివృద్ధికి వినియోగించాం. ప్రపంచ గేమింగ్ రాజధానిగా భారత్ తయారవుతోంది. మే అధికారంలోకి రాకముందు ఎల్‌ఈడీ బల్బు ధర రూ.400 ఉండేది. మా ప్రభుత్వం రాగానే ఎల్‌ఈడీ బల్బును రూ.40కే పంపిణీ చేశాం. దీని ద్వారా దేశ ప్రజలకు రూ.20వేల కోట్లు ఆదా అయింది. మా పాలన బాగుండటం వల్లే మళ్లీ గెలుస్తున్నాం. హరియాణాలో మూడోసారి అధికారంలోకి వచ్చాం. మహారాష్ట్రలోనూ తిరిగి అధికారంలోకి వచ్చాం'అని ప్రధాని వివరించారు. అలాగే ప్రధాని తన ప్రసంగంలో రాహుల్ గాంధీ, కేజ్రీవాల్‌పై పరోక్ష విమర్శలు గుప్పించారు. రాష్ట్రపతి ప్రసంగం బోరింగ్‌గా ఉందంటూ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను పరోక్షను ప్రస్తావిస్తూ, పేదల గుడిసెల్లో ఫోటో సెషన్లతో సరదాగా గడిపేవారికి పార్లమెంటులో పేదల గురించి మాట్లాడుతూ చేసే ప్రసంగాలు బోర్‌గానే ఉంటాయని అన్నారు. కొందరు నాయకులు విలాసవంతమైన షవర్లు కోరుకుంటారని, తమ ప్రభుత్వం మాత్రం ప్రతి ఇంటికి నీళ్లు ఇవ్వడంపై దృష్టిసారిస్తుందని కేజ్రీవాల్ విలాసవంతమైన శీష్ మహల్ పై పరోక్ష విమర్శలు గుప్పించారు. ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామలకు 16 పైసలే చేరుతోందని గతంలో ఒక ప్రధాని వాపోయారని, ఢిల్లీ నుంచి గల్లీ వరకూ అప్పట్లో అదే పరిస్థితి ఉండేదని ప్రధాని అన్నారు. అయితే ఇప్పుడు ఢిల్లీ నుంచి రూపాయి పంపితే గ్రామానికి రూపాయి అందుతోందని, నగదు బదిలీతో నేరుగా ప్రజలకే సొమ్ము అందుతోందని వివరించారు. ప్రధాని ప్రసంగిస్తున్నంత సేపు అధికారపక్షం సభ్యులు చప్పట్లతో అభినందించారు.

## ఫిరాయింపుదారులకు షాక్

**• సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నోటీసులు**



**హైదరాబాద్,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** పా ర్టీ మారిన ఎమ్మెల్యేకు షాక్ తగి లింది. సుప్రీంకోర్టు ఆదేశాలతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ అయ్యాయి. బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన 10 మంది ఎమ్మెల్యేలకు అసెంబ్లీ కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. పార్టీ ఫిరాయింపులపై లిఖిత పూర్వక సమాధానం చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును బీఆర్‌ఎస్ ఆశ్రయించిన విషయం తెలిసిందే. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని గతంలోనే తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. అయినప్పటికీ ఎలాంటి పురోగతి లేకపోవడంతో బీఆర్‌ఎస్ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరిపై అనర్హత వేటు వేయాలంటూ ఇప్పటికే బీఆర్‌ఎస్ పార్టీ హైకోర్టులో పిటిషన్ వేసింది. ఎమ్మెల్యేలపై నాలుగు నెలల్లో చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినప్పటికీ ఈ వ్యవహారం ముందుకు జరగలేదు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ సుప్రీంలో పిటిషన్ వేసింది. మొదట తెల్లం వెంకట్రావు, కడియం శ్రీహరి, దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేయాలని బీఆర్‌ఎస్ పిటిషన్ వేసింది. ఆ తరువాత మరొక ఏడుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించింది బీఆర్‌ఎస్. అయితే వీటన్నింటినీ కలిపి ఒకేసారి విచారణ చేస్తామంటూ.. ఈ కేసు విచారణను సుప్రీం కోర్టు ఈనెల 10కి వాయిదా వేసింది. ఓ వైపు కోర్టులో విచారణ జరుగుతుండగానే.. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కూడా కోరింది బీఆర్‌ఎస్. దీనిపై స్పందించిన స్పీకర్.. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చారు. లిఖితపూర్వకంగా సమాధానాలు చెప్పాలంటూ నోటీసుల్లో పేర్కొన్నారు.

## మా ఇంట్లో రేవంత్‌రెడ్డి ఫొటో లేదు

(మొదటి పేజీ తరువాయి)

పార్టీలో పెను సంచలనంగా మారాయి. అధికార పార్టీలో ఉండి ప్రభుత్వానికి వ్యతిరేకంగా దానం వ్యవహరిస్తున్న తీరుపై పార్టీ నేతలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చింతల్ బస్తీ కూల్చివేతలకు సంబంధించి దానం వ్యవహారతీరును పరిశీలిస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్ తెలిపారు. తాజాగా మరోసారి అధికారులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలతో పాటు రేవంత్ రెడ్డి ఫోటో విషయంలో ఆయన తీరుపై కాంగ్రెస్ పెద్దల నుంచి రియాక్షన్ ఎలా ఉంటుందో చూడాలి. కాగా.. ఆపరేషన్ రోప్‌లో భాగంగా ఇటీవలకాలంలో చింతల్‌బస్తీలో అక్రమ నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు గుర్తించి కూల్చివేతలు చేపట్టారు. స్థానికుల సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే.. అధికారులపై విరుచుకుపడ్డారు. నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడి నుంచి ఇక్కడికి బతకాడానికి వచ్చి.. ఇక్కడే ఉన్న మమ్మల్ని బతకనివ్వరా అంటూ ప్రశ్నించారు. వెంటనే కూల్చివేతలను నిలిపివేయాలంటూ ఎమ్మెల్యే దానం నాగేందర్ హెచ్చరించడంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. కానీ దానం చేసిన మాస్ వార్నింగ్ సంచలనం రేపింది.



తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
బుధవారం,
05 ఫిబ్రవరి 2025



## రథోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే దంపతులు



**తెలుగు – వెలుగు, తూ. గో.జిల్లా బ్యూరో (అనపర్తి):** రథసప్తమి పురస్కరించుకుని ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిన కాకినాడ జిల్లా పెదపూడి మండలం గొల్లల మామిడాడ సూర్య నారాయణమూర్తిని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మహాలక్ష్మి దంపతులు, నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి దర్శించుకుని అనంతరం రథోత్సవాన్ని ప్రారంభించారు.కాగా ఈ దేవాలయం 1920 లో గొల్లల మామిడాడ జమిందార్ కొవ్వూరి బసివిరెడ్డి ఆలయం నిర్మించారు.ఈ కార్యక్రమంలో పలువురు ఎన్ డి ఏ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిరంజీవి వర్ధ్య సరస్వతి విద్యార్థికి జన్మదిన శుభాకాంక్షలు



**శంకర్పల్లి తెలుగు వెలుగు ఫిబ్రవరి 4:** ఈరోజు స్కూల్లో విద్యార్థి మధ్యలో నా పుట్టిన రోజు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అనడం జరిగింది ఈసందర్భంగా ప్రాథమిక పాఠశాల మోకిలా తాండలోని విద్యార్థులందరికీ వారి కుటుంబ సభ్యులు భోజనం అందించటం జరిగింది. వారి మంచి మనసుకు.. భగవంతుడు వారిని, వారి కుటుంబాన్ని చల్లగా దీవించాలని కోరుకుంటు.. పుట్టినరోజు సందర్భంగా శుభాశీస్సులు అందజేయడం జరిగింది

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభను గుర్తించాలి: మాజీ చైర్ పర్సన్



**శంకర్పల్లి మున్సిపల్ తెలుగు వెలుగు ఫిబ్రవరి 4:** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల ప్రతిభను ప్రతి ఒక్కరూ గుర్తించాలని శంకర్పల్లి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ అన్నారు. ఈరోజు శంకరపల్లి పాదమిక పాఠశాల బాలుర, బాలికల పాఠశాలలో మరియు పట్టణ పరిధి 15వ వార్డు అయ్యప్ప రెడ్డిగూడ పాఠశాలలో చదివే 50 మంది విద్యార్థులకు సాత అరుణాదేవి ట్రస్ట్ ద్వారా వస్తు సామాగ్రిని అందజేశారు. అరుణాదేవి ట్రస్ట్ ద్వారా పేదలకు మరెన్నో సహాయ సహకారాలు అందిస్తానని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి గోవిందమ్మ గోపాల్ రెడ్డి మాజీ కౌన్సిలర్ శ్వేత పాండురంగ రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌ను సన్మానించిన మాజీ మున్సిపల్ చైర్ పర్సన్

**శంకరపల్లి, తెలుగు వెలుగు ఫిబ్రవరి 4:** శంకర్‌పల్లి నూతన మున్సిపల్ కమిషనర్ యోగేష్ నాయక్ ను ఈరోజు ఆయన కార్యాలయంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడపాలని కమిషనర్ ను కోరారు. మాజీ కౌన్సిలర్ శ్వేత పాండురంగారెడ్డి ఉన్నారు.



## కూకట్పల్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుపడుతుంది



**కూకట్పల్లి:** కూకట్పల్లిలో అభివృద్ధి కార్యక్రమాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుపడుతుంది అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసినటువంటి వ్యాఖ్యలను కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షులు డాక్టర్ .పట్లోళ్ల .నాగిరెడ్డి గారు ఖండించారు .నాగిరెడ్డి గారు మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు నాయకులకు అభివృద్ధి అంటే అర్థం తెలియదని గతంలో కూడా తన వ్యాఖ్యానించారు అని గుర్తు చేశారు. వారి అభివృద్ధి ఎప్పుడూ కూడా పార్కుల చుట్టూ చెరువుల చుట్టూ స్మశానాల చుట్టూ తిరుగుతూ ఉంటుంది అని అన్నారు. గత పది సంవత్సరాల కాలంగా నిన్న వారు సందర్శించినటువంటి స్మశానాలలో ముఖ ద్వారం లేకపోవడం ,మరుగుదొడ్లు లేకపోవడం వారికి తెలియదా దానికి ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏమి సంబంధం అప్పుడు మీ కళ్ళు ఎక్కడ పెట్టుకున్నారు అని నాగిరెడ్డి గారు ఘాటుగా స్పందించారు గత పది సంవత్సరాల కాలంలో స్మశానాలలో తమ ఇష్టారాజ్యంగా డబ్బులు వసూలు చేసి సమాధులకు అనుమతులు ఇచ్చి,, ఇప్పుడు నిర్యాణం చెందిన వారికి కనీసం స్మశానంలో పూడ్చి పెట్టేందుకు కూడా స్థలం లేనటువంటి పరిస్థితులు కల్పించినటువంటి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కి కాంగ్రెస్ ప్రభుత్వం గురించి మాట్లాడే అర్హత లేదు అన్నారు. మీరు మీ సొంత మీడియాని వెంట పెట్టుకుని బయటకు వచ్చి తిరుగుతున్న ప్రతిసారి కాంగ్రెస్ పార్టీ మీద తప్పుడు ఆరోపణలు చేసే ముందు మీ నైతికతను పరిశీలించుకోవాలని , నాగిరెడ్డి గారు అన్నారు.

## క్యాన్సర్‌ను అరికడదాం ర్యాలీ ప్రారంభించిన డాక్టర్ రామగురెడ్డి





**తెలుగు – వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** క్యాన్సర్ ను గుర్తించడం, అవగాహన కల్పించడంలో అందరూ ఏకం కావలనే నినాదంతో క్యాన్సర్ పై పోరు సాగించి క్యాన్సర్ ను అరికట్టేందుకు కృషి చేద్దామని అనపర్తి ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి అన్నారు. మంగళవారం ది పియంపి అసోసి యేషన్ అనపర్తి, బిక్కవోలు మండలాల ఆద్వర్యంలో ప్రపంచ కేన్సర్ అవగాహన దినోత్సవం పురస్కరించుకుని అనపర్తి ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి నుండి మెయిన్ రోడ్ మీదుగా దేవీచౌక్ వరకు మండల అధ్యక్షులు వాసంశెట్టి నాగేశ్వరరావు సారధ్యంలో ఎమ్ ఎన్ ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు,పీఎంపీ సభ్యులు కలిసి 'అందరం ఏకమవుదాం క్యాన్సర్ ను అరికడదాం' అని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగుర్రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. డాక్టర్ గుర్రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు అందరూ చేయించుకునే విధంగా ప్రజల్లో మమేకమై ఉండే పీ ఎం పీ లు అవగాహన కల్పించాలని,ప్రస్తుత జీవనశైలి, వాతావరణ కాలుష్యం, మద్యపానం, ధూమపానం వంటి అలవాట్లతో క్యాన్సర్ బారినపడు తున్నారని తెలిపారు.నేడు ముఖ్యంగా ప్లాస్టిక్ వినియోగం చాలా ప్రమాదకరమైన స్థితికి తీసుకుని వెళ్తుందని అన్నారు.బళ్ళా శ్రీనివాసరావు ,ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి దేవానంద్,మండల కార్యదర్శి డి సాయి రామారెడ్డి,కోశాధికారి నీలంశెట్టి శ్రీనివాస్, ఎన్ఎస్ చలం,పి బాలసుబ్రహ్మణ్యం, పీటీఎల్ నారాయణ, కేవీజీవీకే రెడ్డి, కే రామలింగం,కేవీవీ సత్యప్రసాద్,కేతా సురేష్, ఐ తిరుపతి రావు, ఎస్ శిలార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్పల్లి అట్టగుట్ట సొసైటీలో రస ఫుడ్ కోర్టు ఏర్పాటు...

- ప్రముఖ సినీ హీరో బెల్లంకొండ సాయి శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి మారుతి సాగర్లచే ప్రారంభం...

**కూకట్పల్లి ప్రతినిధి:** కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల అడ్డగుట్ట సొసైటీలో నూతనంగా ఏర్పాటు చేసిన రస ఫుడ్ కోర్ట్ ను సినీ హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్,టి యూ డబ్లూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అస్కాని మారుతీ సాగర్ లు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల అభిరుచులకు అనుగుణంగా రుచికరమైన వంటకాలను అందించే దిశగా ఫుడ్ కోర్ట్ లు వెలియడం, వాటిని ప్రస్తుతం యువత ఉపాధి మార్గంగా ఎంచుకొని ప్రారంభించడం గొప్ప విషయం అన్నారు. మంచి వంటకాలను అందించే ఏ హెూటల్ కైనా ఆదరణ ఉంటుందని, శుచి శుభ్రత పాటించే విషయంలో నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఫుడ్ కోర్టు యజమాని ఫిరోజ్ ఖాన్, అహ్మదుల్లా ఖాన్, మధు కోక తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో మహిళా ఎస్సై మృతి

- ఎస్సై శ్వేత మృతి భాధాకరం: జిల్లా ఎస్పీ అశోక్ కుమార్





**తెలుగు వెలుగు, జగిత్యాల ఆర్సి:** జగిత్యాల జిల్లా డీసిఆర్బీ లో పనిచేస్తున్న ఎస్సై శ్వేత మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాధంలో దుర్మరణం చెందారు.గొల్లపల్లి మండలం చిల్వాకోదూరు వద్ద కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో జగిత్యాల జిల్లా పోలీస్ డీసీఆర్బీలో పని చేస్తున్న ఎస్ఐ శ్వేతతో పాటు ద్విచక్రవాహనంపై ఉన్న బ్యాంక్ ఉద్యోగి మల్యాల నరేష్ లు మృతి చెందగా జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్ట్ మార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు.ఎస్సై శ్వేత స్వగ్రామం చొప్పదండి మండలం ఆర్నకొండ కాగా ఉదయం జగిత్యాలలో విధులకు హాజరయ్యేందుకు ధర్మారం నుంచి జగిత్యాలకు వస్తున్న ఎస్ఐ శ్వేత గొల్లపల్లి మండలం చిల్వాకోదూరు వద్దకు రాగానే ముందుగా వస్తున్న ద్విచక్రవాహనం రెండు ఢీకొన్నాయి.ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు.ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.డీసీఆర్బీ జగిత్యాలలో పని చేస్తున్న ఎస్ఐ శ్వేతగతంలో కోరుట్ల, వెల్గటూరు,జగిత్యాల టౌన్,కథలాపూర్, పెగడపల్లి పోలీసు స్టేషన్లలో ఎస్ఐగా పని చేశారు.జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ హాస్పిటల్ కు వచ్చి ఎస్సై మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.జిల్లాలోని జగిత్యాల, మెట్పల్లి డీ ఎస్పీ లు రఘు చందర్,రంగారెడ్డి,రాములు సిఐ లు వేణుగోపాల్, కృష్ణారెడ్డి, రాం నర్సింహారెడ్డి, నీలం రవి, ఆరిఫ్ అలీఖాన్,ఆర్ఐ లు కిరణ్ కుమార్, వేణు,ఎస్సైలు సధాకర్, గీత, శ్రీధర్ రెడ్డి, ధత్తాద్రి, నరేష్, కుమారస్వామి, మహేష్,

## సంత్ శ్రీ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతిని విజయవంతం చేయండి

- పూజ్య శ్రీ సంగ్రామ్ మహరాజ్ అఖిల్ భారతీయ సాధుసంత్ ప్రతినిధి
- బిఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కర్ర రమేష్ చౌహన్



**తెలుగు వెలుగు, నాగల్ గిద్ద ప్రతినిధి ఫిబ్రవరి 04:** నారాయణఖేడ్ కొండాపూర్ హనుమాన్ మందిర్ ఆశ్రమంలో సంగ్రామ్ మహారాజ్ రమేష్ చౌహాన్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ నియోజకవర్గంలో ఉన్న తాండాల పూజారులు నాయక్ కారోబారీల సమావేశం నిర్వహించడం జరిగిందని వారు పత్రిక ప్రకటనలు తెలిపినారు సమావేశంలో బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షులు కర్ర రమేష్ చౌహాన్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన జరిగే సంత్ శ్రీ సేవలాల్ మారాజ్ జయంతిని విజయవంతం చేయాలని పిలుపు ఇవ్వడం జరిగిందని అన్నారు సేవాలాల్ మహరాజ్ జయంతి 15న ఉన్నందున ప్రతి వారి వారి తండాల్లో భోగ్ బండార్ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నందున అందుకు బంజారలకు సమయం సరిపోక సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు 14న నిర్వహించాలని సంగ్రామ్ మహారాజ్ ఆధ్వర్యంలో నిర్ణయించడం జరిగింది వారు తెలియజేసినారు అదేవిధంగా సంగ్రామ్ మహారాజ్ మాట్లాడుతు సేవాలాల్ మహారాజ్ మన బంజారా సమాజంలో పుట్టడం మన అదృష్టంగా భావించి మన యొక్క శక్తిని మన యొక్క భక్తిని నిరూపించుకునే సమయం ఆసన్నమైందని కావున ఈనెల జరిగే 14 తేదీన సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు నిర్వహించుటకు నిర్ణయించికున్నామని ప్రతి ఒక్క గిరిజన తండాల నుండి అధిక సంఖ్యలో ర్యాలీ బోగ్ భండార్ అన్నదాన కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయగలరని వారు కోరినారు అదేవిధంగా మీ మీ తాండాలలో సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ యొక్క జయంతి ఫిబ్రవరి 15న గొప్పగా నిర్వహించాలి అదేవిధంగా ప్రతి ఒక్కరూ తమ తమ మందిరాల దగ్గర పచ్చని తోరణాలతో శ్రీ జగదాంబ భవాని మాత సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ యొక్క విగ్రహాలను అలంకరణ చేసి మందిరాలను శుభ్రపరిచి ప్రతి ఒక్కరు తాండాలలో అలుకు పూత నిర్వహించి సామూహికంగా భజన కార్యక్రమం నిర్వహించి అన్నదాన కార్యక్రమలు తాండాలో నిర్వహించుకోవాలని పూజారులు నాయక్ కార్భారీలు తదితరులు పాల్గొన్నారు

## కేంద్ర బడ్జెట్లో తెలంగాణకి జరిగిన అన్యాయంపై కూకట్పల్లిలో కాంగ్రెస్ శ్రేణుల ఆందోళన....

**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కేంద్ర బడ్జెట్లో తెలంగాణకి జరిగిన అన్యాయంపై కాంగ్రెస్ పార్టీ నిరసనలు కొనసాగుతున్నాయి. టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ పిలుపుమేరకు కూకట్పల్లి నియోజకవర్గంలో సోమవారం రోజున సాయంత్రం మూసాపేట చౌరస్తా వద్ద కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఆందోళన,రాస్తారోకో నిర్వహించారు.కేంద్రానికి బిజెపికి నిర్మల సీతారామన్కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తు నినాదాలు చేశారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున ఫ్ల కార్డులు ప్రదర్శించారు. కేంద్ర బడ్జెట్ వల్ల తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని రాష్ట్రం నుంచి 8 మంది ఎంపీలను గెలిపిస్తే కనీస కృతజ్ఞత లేకుండా రాష్ట్రానికి మొండి చేయి చూపించారని బండిరమేష్ ఈ సందర్భంగా ధ్వజమెత్తారు. బడ్జెట్ కేటాయింపులపై ప్రతి వేదిక మీద బిజెపి తీరని లోటని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పనితీరును ఎండగడతామన్నారు. బడ్జెట్లో రాష్ట్రానికి కేంద్రం పెద్ద గుండు సున్నా ఇచ్చిందని తెలంగాణ ప్రజలు కూడా రానున్న ప్రతి ఎన్నికల్లో బిజెపికి అంతే స్థాయిలో తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల ఆత్మాభిమానాన్ని తక్కువ అంచనా వేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మార్కెటింగ్ కమిటీ మెంబెర్స్, టెంపుల్ కమిటీ మెంబర్స్ ,బ్లాక్ అద్యక్షులు, బ్లాక్ మహిళా అధ్యక్షురాలు, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మైనారిటీ నాయకులు, సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## హలో మాదిగ ఛలో హైదరాబాద్ విజయవంతం చేయండి



**తెలుగు వెలుగు జగిత్యాల ఆర్సి:** రాయికల్ మండలం పరిధిలోని ధర్మాజిపేట గ్రామం మంగళవారం ఎమ్మార్పీఎస్ రాయికల్ మండల అధ్యక్షులు దొబ్బల వేణుగోపాల్ గ్రామ ఎమ్మార్పీఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల ఫిబ్రవరి 7 న జరిగే వేల గొంతులు లక్షల డప్పుల మహా ప్రదర్శన కు రాయికల్ మండలం లోని ప్రతి గ్రామం నుండి భారీగా తరలి వచ్చి మహా ప్రదర్శన ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## దుండిగల్ మున్సిపల్ కమిషనర్ కలిసిన మాచర్ల



**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి కుత్బుల్లాపూర్:** దుండిగల్ మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన ఎన్వి నాయక్ ను బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు, రంగారెడ్డి జిల్లా గ్రామ అభివృద్ధి శాఖ డైరెక్టర్ మాచర్ల భద్రయ్య కమిషనర్ ను మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు శాలువతో సత్కరించారు. దుండిగల్ మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన మున్సిపల్ కమిషనర్కి విజ్ఞప్తి చేశారు కాలనీలలో నెలకొన్న సమస్యలను తరితగతిన పరిష్కరించాలని కోరారు పార్టీలకు అతీతంగా కాలనీ అభివృద్ధి మురికివాడల ప్రజల సంక్షేమ దేంగా చూడాలని కమిషనర్ కు మొరపెట్టుకున్నారు కమిషనర్ను కలిసిన వారిలో బండ మహేందర్ తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు

## లక్ష్మీ నరసింహా స్వామి - సూర్యప్రభ వాహన

**- కైంకర్యపరులుగా గంజి రవీంద్రనాథ్, గంజి చిరంజీవి**



**మంగళగిరి ,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** మంగళగిరిలో కొలువైన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థా?నంలో ఈ రోజు రథ సప్తమ సందర్భంగా స్వామి వారు ఏడు వాహనాల పై దర్శనమిస్తారు. అందులో మొదటిగా సూర్యప్రభ వాహనము పై భక్తులకు దర్శనం ఇస్తారు. ఆ సూర్యప్రభ వాహన కైంకర్య పరులు గా గంజి రవీంద్రనాథ్, గంజి చిరంజీవి స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంజి చిరంజీవి మాట్లాడుతూ, నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, స్వామి వారి ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు.

## అన్నదానం మహా పుణ్యకార్యం

**- జోన్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్**

**రామాపురం ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారి ఆధ్వర్యంలో రాయచోటి వాస్తవ్యులు పి.మనోహర్,పి. మనస్వి దంపతుల కుమారుడు పి.రెడ్డి దార్షిక్ 3 వ పుట్టినరోజు సందర్భంగా ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని జోన్ చైర్మన్ లయన్ షేక్.మహమ్మద్ తెలిపారు.అనంతరం దాతలు పి.మనోహర్,పి.మనస్వి దంపతులు మాట్లాడుతూ ఈరోజు మా కుమారుడు పి.రెడ్డి దార్షిక్ 3 వ పుట్టినరోజు పురస్కరించుకొని మా వంతు గా ప్రజలకు ఉపయోగపడే సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈరోజు ప్రేమాలయం వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేయడం జరిగిందని అలాగే రాబోయే రోజులలో ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేయడానికి మా వంతు సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైర్మన్ లయన్ వి.హరీష్ చంద్ర(బబ్లూ), దాత కుటుంబ సభ్యులు ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.

## కుల గణన పై తప్పుడు లెక్కలు చెబుతున్న అధికార ప్రభుత్వం...

- ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు చేదురు మళ్ళీ శ్రీనివాస్ గౌడ్



**తెలుగు వెలుగు ప్రతినిధి కూకట్పల్లి:** కుల గణన జనాభా లెక్కల పై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెబుతుందని కామారెడ్డి డిక్లరేషన్కు కట్టుబడి ప్రస్తుతం జనాభా లెక్కలు ప్రకారం రిజర్వేషన్లు కల్పించి స్థానిక సంస్థల ఎలక్షన్లను నిర్వహించాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకుడు చేదురుమల్లె శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఓసిల జనాభా పెరిగినట్టు చూపుతూ మరి బీసీల జనాభా తగ్గించి చూపడం ఏమిటని ప్రశ్నించారు. తెలంగాణ వ్యాప్తంగా పెద్ద మొత్తంలో బీసీలు ఉండగా రాష్ట్ర ప్రభుత్వం బీసీల జనాభాను తక్కువ చూపుతూ బీసీలను మోసం చేస్తుందని అన్నారు. బీసీలను సామాజికంగా రాజకీయంగా అణిచివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్ర అని ఆరోపించారు. గత 2014 లో 51 శాతం ఉన్న బీసీలు2024 లో 46 శాతానికి ఎలా తగ్గారని ప్రశ్నించారు. ఇది కేవలం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కాపాడుకోవడం కోసం జరుగుతున్న కుట్రగా భావిస్తున్నామనీ చేదురు మల్లి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు.

## తెలంగాణలో ఉప ఎన్నికలు రాబోతున్నాయి ...!?

- టిఆర్ఎస్ నాయకులు వాళ్ల హరీష్
- ఎప్పుడైనా ఎన్నికల నోటిఫికేషన్ రావచ్చు
- ఫిరాయింపు ఎమ్మెల్యేలకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ



**తెలంగాణ తెలుగు వెలుగు ప్రతినిధి శేరిలింగంపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో ఉప ఎన్నికలు రాబోతున్నాయని బి ఆర్ ఎస్ రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులు కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు శేరిలింగంపల్లి నియోజకవర్గం లో టిఆర్ఎస్ ( బి.ఆర్.ఎస్) పార్టీ కార్యకర్తలు నాయకులు ఏకతాటి పైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ పార్టీ సీనియర్ నాయకులు వాళ్ళ హరీష్ రావు పిలుపునిచ్చారు శేరిలింగంపల్లి నియోజకవర్గం లో టిఆర్ఎస్ కార్యకర్తల నాయకుల సత్తా ఏమిటో ఈ ఉప ఎన్నికల్లో చూపించబోతున్నామని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రాబోయే ఉప ఎన్నికల్లో ఫిరాయింపు ఎమ్మెల్యేలకు తగిన గుణపాఠం తప్పదని ఈ సందర్భంగా తెలుగు వెలుగు పత్రిక ప్రతినిధితో ఇష్టం గోష్టిగా చర్చించారు పార్టీ టికెట్లపై గెలవడం అధికార ఏ పార్టీ ఉంటే ఆ పార్టీలో జంపవడం కొందరికి పరిపాటిగా మారిందని సమాధానం ఇచ్చారు అలాంటి వారికి రాబోయే ఉప ఎన్నికలు ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని ఎక్కడ చూసినా వ్యతిరేక పవనాలు ఇస్తున్నాయని ఈ సందర్భంగా కొన్ని యాడారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానమే ఫిరాయింపు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎప్పుడైనా ఏ క్షణమైనా ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రతి టిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు సిద్ధంగా ఉండవలసిన అవసరం ఎంతైనా ఉందని కార్యకర్తలకు నాయకులకు విజ్ఞప్తి చేశారు

## రాజధాని పంటపోలాలో ఉల్లిపాయ బస్తాలు దొంగిలించిన దొంగలు

- రూటు మార్చిన దొంగలు
- ఉల్లి చేసిన మేలు తల్లి చేయదు అంటారు పెద్దలు
- అలాంటి రైతు పండించిన పంట దొంగల పాలు. రైతులు కన్నీటి పాలు

**తాడేపల్లి ఫిబ్రవరి 04 (తెలంగాణ తెలుగు):**తాడేపల్లి మండలం పెనుమాక గ్రామంలో కృష్ణారెడ్డి అనే రైతు పండించిన పంట ను దొంగలు దోచుకెళ్లారు.రాజధాని పంటపోలాలో ఉల్లిపాయ బస్తాలు దొంగిలించిన దొంగలుఅరుగాలాల పాటు కష్టపడి పంటపండించిన రైతు పంటను రాత్రి బస్తాలలో నింపి ఉదయాన్నే మార్కెట్ కు తరలించే టయానికి 50 కేజీ ల ఉల్లిపాయ బస్తాలు 19 టిక్కి లు గుట్టు చప్పుడు కాకుండా రాత్రి ఆటో లో తరలించుకు పోయారు,బాధిత రైతు కృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసు స్టేషన్లో కేసు నమోదు చేశారు.రాజధాని ప్రాంత పంటపోలలో రాత్రిలు గంజయ్ బ్యాచ్ తిరగటం పొలాల్లో మందు తాగటం పంటనుదోచుకు పోతున్నారు.గంజాయి మద్యం బ్యాచ్ దెబ్బకు రైతులు రాత్రులు పొలాల్లో కాపలా ఉండేదుకు భయపడు తున్నారని.గతంలో పొలాల్లో మోటార్లు దోచుకొని పోయారు అప్పడప్పుడూ ఒకటి అర బస్తా లు పంటను తీసుకు పోయేవారని ఇప్పుడు ఏకంగా ఆటో లలో తరులించుకు పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.






## క్యాన్సర్ రోగుల ఇళ్లకే వెళ్లి చికిత్సలు అందించనున్న అమోర్ ఆస్పత్రి....

- ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా నిర్ణయం...
- అవగాహన నడకలో వెల్లడించిన డాక్టర్ కిశోర్ బి. రెడ్డి






**కూకట్పల్లి ప్రతినిధి:** క్యాన్సర్ రోగులు ఆస్పత్రికి రావాలన్నా కూడా కొన్నిసార్లు ఇబ్బంది పడతారని, అందుకని తాము నేరుగా వారి ఇళ్లకే వెళ్లి కొన్ని రకాల చికిత్సలు అందిస్తామని అమోరా ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కిశోర్ బి. రెడ్డి తెలిపారు. లాస్ట్ మైల్ సర్వీస్ అనే ఈ సేవా కార్యక్రమాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా నిర్వహించిన నడక కార్యక్రమంలో ఆయన ప్రకటించారు. తగిన అవగాహన, వీలైనంత త్వరగా గుర్తించడం ద్వారా క్యాన్సర్ను జయించగలమని అలాగే మంచి ఆహారపు అలవాట్లు, చురుకైన జీవనశైలి ద్వారా క్యాన్సర్ రాకుండా కూడా నివారించగలమని, మహిళలు పరిశుభ్రత పాటించడం, ఎప్పటికప్పుడు రొమ్ము క్యాన్సర్ విషయంలో సొంత పరీక్షలు చేసుకోవడం ద్వారా కొన్ని రకాల క్యాన్సర్లు దరిచేరకుండా ఉంటాయని డాక్టర్ కిశోర్ బి. రెడ్డి ఈ సందర్భంగా వివరించారు. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ అనేది వైద్యపరంగా అతిపెద్ద సవాలు. కానీ, అవగాహన, త్వరగా గుర్తించడం, ముందస్తు నివారణ చర్యలతో చాలావరకు దాని ప్రభావాన్ని తగ్గించగలం అన్నారు. అమోర్ ఆస్పత్రిలో అన్నిరకాల క్యాన్సర్లకు చికిత్స లభిస్తుందనీ దాంతోపాటు ప్రజలకు దీని గురించిన వివరాలన్నీ తెలిపి, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకునేలా వారిని ప్రోత్సహిస్తున్నాం అన్నారు. సమాజం మొత్తం సమగ్ర ఆరోగ్యంతో ఉండే దిశగా ఈ నడక అనేది ఒక మంచి ముందడుగు కావాలని ఆశిస్తున్నాం అని డాక్టర్ కిశోర్ బి. రెడ్డి చెప్పారు. అవగాహన నడక కార్యక్రమంలో సుమారు వంద మందికి పైగా పాల్గొన్నారు. వారిలో వైద్యులు, వైద్యవృత్తిలోని ఇతర సిబ్బంది, రోగులు, చుట్టుపక్కల కాలనీలవాళ్లు ఉన్నారు. అమోర్ ఆస్పత్రి వద్ద ప్రారంభమైన ఈ మూడు కిలోమీటర్ల నడక చుట్టుపక్కల ప్రాంతాలన్నింటిలోనూ కొనసాగింది. నడిచినవారంతా ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకుని క్యాన్సర్పై అవగాహన కల్పించారు. అలాగే పలు ప్రాంతాల్లో చర్చలు నిర్వహించారు. త్వరగా గుర్తించడం, సమయానికి చికిత్స చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలితో క్యాన్సర్ ముప్పు తగ్గుతుందని అందరికీ తెలిపారు.

## తూర్పు,పశ్చిమ జిల్లాల పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం



**తెలుగు - వెలుగు, తూ. గో. జిల్లా బ్యూరో (అనపర్తి):** రాబోయే పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంను మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు.అనపర్తి మండలం రామవరంలో జరిగిన “ఉమ్మడి గోదావరి జిల్లాల పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల” సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, తూర్పు,పశ్చిమ గోదావరి జిల్లాల పట్టుభద్రుల చేసి ఎమ్మెల్సీ ఎన్నికల అనపర్తి నియోజకవర్గ పరిశీలకులు,రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చింతల రామకృష్ణ,అనపర్తి నియోజకవర్గం టిడిపి పరిశీలకులు మోకా ఆనంద్ సాగర్ పాల్గొన్నారు.అలాగే రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రతీ ఒక్కరూ సమయాత్తంగా ఉండాలని, అదే విధంగా గ్రామాలలో ప్రతి ఒక్క పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లను కలసి మొదటి ప్రాధాన్యత ఓటు ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరంకి వేయించి అఖండ మెజారిటీతో గెలిపించే విధంగా ఎమ్మెల్యే నల్లమిల్లి దిశా నిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో అనపర్తి నియోజకవర్గం ఎన్ డి ఏ నేతలు,ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి తైక్వాండోలో మెడల్స్ సాధించిన శ్రీ షిరిడి సాయి స్కూల్ విద్యార్థులు




**మైదుకూరు,ఫిబ్రవరి 04 (తెలంగాణ తెలుగు):** జనవరి 31 వ తేదీ నుండి ఫిబ్రవరి 2 వ తేదీ వరకు కాకినాడ పట్టణంలోని జేఎన్టీయూ ఇండోర్ స్టేడియంలో జరిగిన 2025 ఏపి రాష్ట్ర స్థాయి మోదటి ఎన్టీఆర్ మెమోరియల్ తైక్వాండో చాంపియన్ సిప్ లో కడపజిల్లా, మైదుకూరు నియోజకవర్గం దువ్వూరుకు చెందిన శ్రీ షిర్డి సాయి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏడు పతకాలు సాధించినట్టు విన్ తైక్వాండో అకాడమీ కోచ్, మాస్టర్ మారుగాని. సుధీర్ కుమార్ తెలిపారు, సబ్ జూనియర్ బాలికల విభాగంలో పీ. హరితశ్రీ రజత పతకం, కే. సంజీవ లహరి కాంస్య పతకం, క్యాడెట్ బాలికల విభాగంలో సీ. వీరకార్తిక కాంస్య పతకం, సబ్ జూనియర్ బాలుర విభాగంలో జీ. నాగశ్రీచరణ్ కాంస్య పతకం, క్యాడెట్ బాలుర విభాగంలో జీవి సాయి గిరీష్ కాంస్య పతకం, పీ. హేమంత్ కుమార్ కాంస్య పతకం, సీ. శివ గోవర్ధన్ కాంస్య పతకాలు సాధించగా వీ. నవీన్, జే. విజయ్ కుమార్ లు ఐదవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శ్రీ షిర్డీ సాయి హైస్కూల్ పాఠశాల కరస్పాండెంట్ సీ ఎల్ ఎన్. లోకేష్, హెడ్ మాస్టర్ ఎమ్. మస్తాన్, ఏవో బీవి నరేష్, పాఠశాల ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు, క్రీడల పట్ల విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహిస్తే మెరుగైన ప్రతిభ చూపగలరని ఈ సందర్భంగా మాస్టర్ సుధీర్ కుమార్ తెలిపారు.

# ఈ బడ్జెట్ దేశ అభివృద్ధికి ఒక మైలురాయి: రవికుమార్ యాదవ్




**శేరిలింగంపల్లి ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా, ప్రజారంజక బడ్జెట్ ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి ,నరేంద్ర మోదీ కి కృతజ్ఞతలు తెలియజేస్తూ లింగంపల్లి డివిజన్, మసీద్ బండ చౌరస్తాలో మోదీ గ చిత్ర పటానికి రాష్ట్ర నాయకులు , జిల్లా నాయకులు, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలసి పాలాభిషేకం చేసిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, శేరిలింగంపల్లి కంటేస్టెడ్ ఎమ్మెల్యే , ఇంఛార్జి రవికుమార్ యాదవ్, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత 2025-2026 మోదీ ప్రభుత్వ 12వ పూర్తిస్థాయి బడ్జెట్ అని, 2014 నుంచి ఎన్నో సంస్కరణలు, ఎన్నో కీలక నిర్ణయాలు తీసుకున్నారని వాటి ఫలితాలు ఇవాళ స్పష్టంగా కనబడుతున్నాయన్నారు,విద్య, వైద్యం, మౌలికవసతుల రంగంలో ఫలాలు కనబడుతున్నాయన్నారు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 95% పథకాలు తెలంగాణకు లబ్ధి చేకూరుస్తున్నాయి. రాష్ట్రం అభివృద్ధికి కేటాయింపులు పెంచడం గర్వించదగ్గ విషయమన్నారు. పేద మధ్య తరగతి వారి కోసం రూ. 12 లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు, పీఎం ఆరోగ్య యోజన కింద గిగ్ వర్కర్ల కోసం హెల్త్ కార్డులు,అన్ని జిల్లాల్లో డే కేర్ క్యాన్సర్ సెంటర్లు,వృద్ధి కేంద్రాలుగా పట్టణాల అభివృద్ధికి రూ. లక్ష కోట్లతో ప్రత్యేక మిషన్‌కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా తెలంగాణకులబ్ధి చేకూరుతుందని తెలుపుతూ. అంతేకాకుండా మోడీ ప్రత్యేక దృష్టి పెట్టి రాష్ట్రాల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ,రాష్ట్రాల వాటా పన్నుల మొత్తాన్ని రూ.27 వేల కోట్ల నుండి రూ.30 వేల కోట్లకు పెంపుకు కృషి చేశారు, హైదరాబాద్‌కు ప్రత్యేక నిధులు అందిస్తూఅర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ.10వేల కోట్లు అమృత్ పథకానికి రూ.10 వేల కోట్లు,125 కోట్లు అర్బన్ లోకల్ బాడీస్ అందించింది అన్నారు , ఆయుష్మాన్ భారత్ నిధుల పెంపు70ఏళ్లు పైబడిన వారికి ఆర్థిక స్తోమత సంబంధం లేకుండా వైద్యం అందించడంలోనూ ప్రత్యేక దృష్టి సాధించడమే కాకుండామహిళా సాధికారతకు ప్రత్యేక నిధులు,రహదారులు ,రైల్వే మార్గాల కొరకు ప్రత్యేక నిధులు భద్రాచలం,మేడారం సమ్మక్క సారక్క ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయింపు బోనాలు,బతుకమ్మ పండుగలకు,కేంద్ర ప్రభుత్వ నిధులు ఇలా మోదీ పాలనలో దేశ అభివృద్ధికి బలమైన పునాది అని అన్నారు, ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగుల గౌడ్, ఎల్లేష్, ఆంజనేయులు సాగర్, కిషోర్, ఆకుల లక్ష్మణ్ , మాణిక్ రావు ,రమణయ్య ,సత్యనారాయణ, శ్రీశైలం కురుమ ,వెంకటస్వామి రెడ్డి,రమేష్ ,శ్రీనివాస్ యాదవ్, రవి నాయక్ ,రాజు ,గణేష్ ముదిరాజ్, శివారెడ్డి, బాబు ముదిరాజ్, ప్రేమ్, శ్రీనివాస్ యాదవ్, కుమార్ యాదవ్, రాయల్, మొదలగు వారు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు అంధకారం

- యువతపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి: డిఎస్పీ పి.భావన




**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** మత్తు పదార్థాల వల్ల భవిష్యత్తు అంధకారం అవుతుందని డిఎస్పీ భావన తెలిపారు. మంగళవారం మండలంలోని లింగాపురం గ్రామంలో వున్న సాయి రాజేశ్వరి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకుయాంటి డ్రగ్స్ అవేర్ నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ యువతపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. యువత మత్తుకు అలవాటు పడి భవిష్యత్తును విచ్ఛిన్నం చేసుకోవద్దని, ప్రతి ఒక్కరూ తమ భవిష్యత్తుకు బంగారు బాటలు సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారని, అంతేగాక చిన్న చిన్న పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, కూలీలు వీటికి అలవాటు పడి కుటుంబాలు కూడా చిన్నాభిన్నం అయ్యే పరిస్థితులు దాపరిస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు ఎంతో బాధ్యతగా తమ పిల్లలు ఉన్నతమైన స్థాయిలో ఉంటారని కలలుగన్న వారి కలలను కల్లలుగా చేస్తున్నారని, మత్తు పదార్థాల సేవనం వల్ల మైండ్ తో పాటు, విచక్షణా శక్తిని కోల్పోతున్నారని, సామాజిక, మానసిక, శారీరక, అనారోగ్యాలు, ప్రాణాంతక వ్యాధుల బారిన పడుతూ సమాజం నుండి దూరమవుతున్నారన్నారు. పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు హత్యలకు సైతం పాల్పడుతూ, మంచి భవిష్యత్తును కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశం అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా యువత కీలకమని, ఎవరూ మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హెూం మంత్రి అనిత డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయాలన్న సంకల్పంతో ఉన్నారని, మనమందరం సమష్టిగా మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దే విధంగా ముందుకెళ్లాలన్నారు. కళాశాల సమీప ప్రాంతాలలో కానీ చుట్టుపక్కల ప్రాంతాలలో కానీ ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా కూడా ఉంచుతామన్నారు. పోలీసు యంత్రాంగం గంజాయి ఏ మూల విక్రయించినా దాడులు నిర్వహిస్తు, రూపుమాపేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని, గంజాయి ఎక్కడెక్కడ ఉందో వాటి మూలాలకు వెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి కేసులో విచారణ జరిపి కారకులైన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సమాజాన్ని కాపాడాల్సిన యువత బంగారు భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. ప్రాణాంతకమైన మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు 'నో' చెప్పి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకొని తల్లిదండ్రులు కన్న కలలను నిజం చేస్తూ ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం కళాశాల విద్యార్థిని విద్యార్థులతో తమ వంతు సామాజిక బాధ్యతగా మత్తు పదార్థాల నిర్మూలనకు సమష్టిగా కృషి చేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు రూరల్ సి.ఐ బాలమద్దిలేటి, ఫ్యాక్షన్ జోన్ ఇన్స్పెక్టర్ రమణారెడ్డి, అధ్యాపకులు, ఇంజనీరింగ్ విద్యార్థులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించాలి: మంత్రి సవిత



**కడప ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** విద్యార్థులు చదువు, క్రీడలతోపాటు అన్ని అంశాల్లో రాణించాల్సిన విషయాన్ని గుర్తించి అందుకు అనుగుణంగా ముందుకుసాగాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవిత తెలిపారు.కడప నగర పరిధిలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్ 37వ స్పోర్ట్స్ డే కార్యక్రమానికి మంత్రి సవిత ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ముఖ్యంగా పాఠశాల విద్యార్థుల క్రమశిక్షణను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. క్రీడాపోటీల్లో గెలుపోటములు సహజమన్న విషయాన్ని గుర్తిస్తూ ప్రతికూల అంశాలను సానుకూలంగా స్వీకరించాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులన్న విషయాన్ని తెలుసుకుని భవిష్యత్తులో తమ తల్లిదండ్రులతోపాటు చదువుకున్న పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు లభించేందుకు కృషి చేయాలన్నారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తూ విద్యాభివృద్ధికి అన్ని విధాల తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ ప్రోత్సహాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, పాఠశాల డైరెక్టర్ వివేకానందరెడ్డి తమ సందేశంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును కాక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు

- మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకుందాం..
- వేంపల్లి వైకాపా మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి.
- వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం



**వేంపల్లె ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని,వైయస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెవైయస్సార్డ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకుందామని వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ చంద్ర ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు.మంగళవారం గండి రోడ్డులోని వైయస్సార్సీపీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్సిపి పార్టీలో ఉన్న 47 మంది క్రియాశీలక సభ్యులతో మండల నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.పదవులు అలంకరించిన వారందరూ పార్టీ కోసం సమిష్టిగా కృషి చేయాలన్నారు.పదవులు అనేటివి చిన్నవి పెద్దవి అని తేడా లేకుండా కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మండల ఉపాధ్యక్షులు మునీర్ భాష,రవిశంకర్ గౌడ్ తదితర మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మందుబాబుల ఆగడాలు ఇబ్బంది పడుతున్న రోగులు, వైద్య సిబ్బంది






**పులివెందుల టౌన్ ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):**మందుబాబులు ఆగడాలు ఎక్కువ అవుతున్నాడంతో రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లి గ్రామంలో ఉండే ప్రాథమిక వైద్యశాల పరిసర ప్రాంతాలలో మద్యం తాగి సీసాలు వేస్తూ , ఆస్పత్రి ఫర్నిచర్ ధ్వంసం చేస్తుండడంతో ఆసుపత్రికి వెళ్లాలంటే వైద్య సిబ్బందికి రోగాలకు చాలా ఇబ్బందిగా ఉంది అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నల్లపురెడ్డి పల్లె లో మద్యం షాపు రావడం తో మద్యం తాగే వారి సంఖ్య పెరగడంతో పాటు, ఎక్కడపడితే అక్కడ మద్యం సేవించి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఫలితం లేదని వైద్య సిబ్బంది వాపోతున్నారు. ప్రాథమిక వైద్యశాల లో మౌలిక వసతులు అన్నీ ఉన్న మహిళలం విధులు నిర్వర్తించలేకపోతున్నామని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సేవిస్తూ పిహెచ్సి కేంద్రానికి సంబంధించిన ఫర్నిచర్ ను ధ్వంసం చేస్తున్నారని తద్వారా సిబ్బందితోపాటు కేంద్రానికి వచ్చే రోగులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు ఇక్కడ ఒక వాచ్మెన్ ను కేటాయించి తమకు రక్షణ కల్పించాలని మహిళా సిబ్బంది కోరుతున్నారు ప్రజలకు సేవలు చేస్తున్న తమకు ఇలాంటి చర్యలు తమ బాధిస్తున్నాయని తక్షణమే ఉన్నతాధికారులు, పోలీస్ అధికారులు స్పందించి రక్షణ కల్పించాలని తద్వారా మేము కూడా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలు ఉంటుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.



## పారిశుధ్యం విషయంలో సిబ్బంది అలసత్వం వీడాలి

**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** పారిశుధ్యం విషయంలో సిబ్బంది అలసత్వం వీడాలని కమిషనర్ వి మల్లికార్జున తెలిపారు. పట్టణ పర్యటనలో భాగంగా మంగళ వారం స్థానిక బాలాజీ నగర్ 1 నందు మురికి నీరు బయటికి వస్తున్నందున స్థానిక ప్రజలు సమస్య తెలపగా అక్కడ పర్యటించి ఇందూ ట్రావెల్స్ వద్ద ఉన్న కాలువ యందు పేరుకుపోయిన సిల్ట్ ను పారిశుద్ధ్య కార్మికులచే తొలగించి సమస్య పరిష్కారం కొరకు తగు ప్రణాళికలు రూపొందించవలసిందిగా సంబంధించిన ఇంజనీరింగ్ విభాగం వారికి మరియు పారిశుద్ధ్య విభాగం అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ ఇంజనీర్ ఎస్ దస్తగిరి, సానిటరీ ఇన్స్పెక్టర్ ఏం గోవింద్ రెడ్డి పాల్గొన్నారు.

## మహానాడు స్థల పరిశీలన



**కడప ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** నగరంలోని మే నెలలో 27,28,29 వ తేదీలలో జరగబోయే మహానాడు స్థలం పరిశీలన కార్యక్రమంలోకడప జిల్లా ఇన్చార్జి మంత్రి సబితమ్మ తో .కలిసి పాల్గొనిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి ఎస్ అమీర్ బాబు తెలుగుదేశం పార్టీ కడప జిల్లా అధ్యక్షులు తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్ప గారి శ్రీనివాస్ రెడ్డికమలాపురం నియోజకవర్గ శాసనసభ్యులు పుత్ర కృష్ణ చైతన్య రెడ్డి ఎమ్మెల్సీ రామ్ గోపాల్ రెడ్డి జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ యువ నాయకులు భూపేష్ రెడ్డి మహానాడు విజయవంతం చేసేందుకు ప్రణాళికలు రూపొందించడం జరిగింది. కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## ఆశ్రమ వాసులకు అన్నదానం




**పులివెందుల రూరల్ ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** నియోజకవర్గం లింగాల పంచాయతీ పరిధిలోని దీనబంధు ట్రస్ట్( మానసిక వికలాంగుల ఆశ్రమం)లో మంగళవారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పులివెందుల వాసవి క్లబ్ సభ్యులు మిట్టా రామ్మోహన్ రావు మిట్టా లక్ష్మీదేవి దంపతుల కుమార్తె పూజిత వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవి, రామ్మోహన్ రావు లు మాట్లాడుతూ తమ కుమార్తె వర్ధంతి రోజున దీనబంధు ఆశ్రమంలో సామాజిక కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజనల్ చైర్ పర్సన్ దిండుకుర్తి నాగభూషణం, ప్రెసిడెంట్ రొట్టెల వినోద్ కుమార్, కార్యదర్శి మిట్ట మహేశ్వర గుప్తా, కోశాధికారి హరికిషన్, లోకేష్, లక్ష్మీ, శిరీష, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు

## టి20 మ్యాచ్‌లో రెవెన్యూ వీఆర్వో టీం గెలుపు

**పత్తికొండ ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** వీరబ్రహ్మేంద్ర స్వామి తిరుణాల సందర్భంగా, కేఈ మాదన్న స్మారక టి20 క్రికెట్ మ్యాచ్ లో సచిన్ లెవెన్ జట్టుపై రెవెన్యూ విఆర్ఓ సంఘం గెలుపొందింది.మంగళవారం జరిగిన ఈ మ్యాచ్లో రెవెన్యూ విఆర్ఓ సంఘం 10 ఓవర్లలో 141, స్కోర్ చేయగా, సచిన్ లెవెన్ టీం 10 ఓవర్లలో 87 పరుగులు సాధించి ఓటమి చెందారు. దీంతో రెవెన్యూ విఆర్ఓ సంఘం గెలుపొందింది. ఈ మ్యాచ్ లో వీఆర్వో మల్లికార్జున 49 పరుగులు సాధించారు. ఈ సందర్భంగా గెలుపొందన టీం సభ్యులకు ఉద్యోగులు అభినందించారు. ఈ మ్యాచ్ లో వీఆర్వో సాగర్ రెడ్డి, రవి, నవీన్ కుమార్, భార్గవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# మగ్దూం నేటి తరానికి ఆదర్శం

● ప్రధానోపాధ్యాయులు బండి సుధాకర్ రెడ్డి



**పులివెందుల అర్బన్ ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** స్వాతంత్ర్య సమరయోధులు, ఉద్యమాలకు ఆద్యులు గా, అభ్యుదయ రచయితలుగా,కవిగా, నటులు గా, నిస్సహాయుల ఆశా జ్యోతిగా వారు ప్రజలను చైతన్యవంతం చేసిన యోధుడని కొనియాడారు.. జిల్లా పరిషత్తు ఉర్దూ ఉన్నత పాఠశాల, ఇస్లాంపురం, పులివెందుల నదు మగ్దూం మొహియుద్దీన్' 117 వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భం ఆయన చిత్రపటానికి పూలమాలలతో నివాళులు అర్పించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు బండి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ " మగ్దూం మొహియుద్దీన్ 4 ఫిబ్రవరి 1908 న జన్మించారని,తను స్వాతంత్ర్య సమరయోధుడిగా, మహాకవిగా, కార్మిక నాయకుడిగా,నటులులుగా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలలో ఒకరిగా , శాసనసభ,మండి సభ్యులు గాను, ఎన్నో కార్మిక, కర్షక , ఉద్యోగ సంఘాల ఏర్పాటు కు ఆద్యుడై వారి హక్కుల సాధన కోసం పోరాడిన పోరాట యోధుడని, అలా స్థాపించిన ఉపాధ్యాయ సంఘమే నేటి ఎస్టియూ సంఘమని కొనియాడారు. "నిజాం నిరంకుశత్వానికి ఎదురొడ్డి పోరాడిన గొప్ప పోరాట యోధుడుని,తను నిరుపేద కుటుంబంలో జన్మించి బతకడానికి పెయింటింగ్స్, సినిమా తారల ఫొటోలు అమ్మాడు. ట్యూషన్లు చెప్పాడని, పత్రికల్లో పనిచేశాడని, కవిగా,నాటక రచయితగా, నటుడిగా ప్రసిద్ధుడయ్యారని 1934లో బెర్నార్డ్ షా నాటకానికి 'హెూష్ కె నా ఖూన్' అనే ఉర్దూ అనుసరణ వ్రాసి రవీంద్రనాథ్ ఠాగూర్ సమక్షంలో ప్రదర్శించారు. "రైతుకు రొట్టె నివ్వని పొలమెందుకు, కాల్చేయండి ప్రతి గోధుమ కంకిని..!" అనే ఇక్బాల్ కవితను నినదించి ఉద్యమించేవారని పేర్కొన్నారు. మగ్దూం మొహియుద్దీన్ గారి పోరాట జీవితాన్ని నేటి యువతరం ఆదర్శంగా తీసుకొని పోవాలని, కులాల, మతాల,వర్గాల కు అతీతంగా.. కార్మిక కర్షక,ఉద్యోగ, ఉపాధ్యాయ, బడుగు బలహీనల,మహిళల హక్కుల కై ఉద్యమించాలని వారి ఆశయ సాధనకై కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అబ్దుల్ లతీఫ్, సనావుల్లా, యూయూనస్, ఇక్బాల్, నరసింహాలు విద్యార్థులు..పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాలలో నివారణ చర్యలు



**ఉరవకొండ ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఇచ్చిన ఆదేశాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు.ప్రతి ఒక్క ఇంటికి సిబ్బంది సందర్శించి అవసరమైన వారికి జ్వర పీడితులకు ఇంటి వద్దనే రక్తపు నమూనాలు సేకరించి వెంటనే ల్యాబ్ కు అందజేయాలన్నారు ఈ సమావేశంలో పాల్గొన్న వైద్యాధికారి డాక్టర్ సర్దార్ హెూలీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వము వైద్య రంగానికి పెద్ద పీట వేసి అనేక రకాలైన మందులను చికిత్సల నిమిత్తమై వజ్రకరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపడం జరిగిందని కావున ఆశ ఆరోగ్య కార్యకర్తలు ఏఎన్ఎంలు గ్రామాలలో ప్రతిరోజు పర్యటిస్తూ అవసరమైన సమాచారం తమకు అందజేస్తూ వారికి మెరుగైన చికిత్స చేయాలన్నారు ఈ సమావేశంలో మండల ఆరోగ్య విస్తరణ అధికారి గురు ప్రసాద్ హెల్త్ సూపర్వైజర్లు నాగ శంకర్ భారతి మండలంలోని వైద్యారోగ్య సిబ్బంది ఆశ ఆరోగ్య కార్యకర్తలు ఏఎన్ఎంలు సిహెచ్ఓ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మంచిని చేకూర్చే బడ్జెట్

● థాంక్యూ పిఎం,నరేంద్ర మోదికి ధన్యవాదాలు




**ఉరవకొండ ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** దేశ ప్రజలు గర్వించదగ్గ 2025వ బడ్జెట్ను ప్రవేశపెట్టిన శ్రీ నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వ నికి ధన్యవాదాలు తెలియజేస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం నాడు అనంతపురం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలోని విద్యార్థులు మరియు యువతతో కలిసి పోస్టు కార్డులు పంపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కురుగుంట మనోహర్, దామోదర్, నాయకులు శ్రీనాథ్,కేశవ, మోహన్, హాజరై మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు 2025వ బడ్జెట్ ఎంతో లబ్ధి చేకూర్చే విధంగా ఉందని పేర్కొన్నారు, మధ్యతరగతి కుటుంబ ప్రజలకు 12 లక్షల రూపాయల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం ఎంతో ఊరటనిచ్చిందన్నారు, అనేక మంది యువతకు ఉద్యోగమే కాకుండా స్వయం ఉపాధి కల్పనకు అనేకమైన రుణాలు కల్పించే విధంగా వాటికి ప్రత్యేక నిధులు కేటాయించడం యువతకు ప్రోత్సాహన్ని అందించడంలో నరేంద్ర మోడీ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు, మహిళలు రైతులు అన్ని వర్గాల ప్రజలకు మంచిని చేకూర్చే విధంగా బడ్జెట్ను అందించిన భారత దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బీజేవైఎం ఆధ్వర్యంలో యువతతో కలిసి ప్రత్యేకమైన ధన్యవాదాలు పేర్కొన్నారు,ఈ కార్యక్రమంలో నాయకులు వీరేష్, అర్జున్, విద్యార్థులు యువత తదితరులు పాల్గొన్నారు

# బాపట్ల నియోజకవర్గంలో నరేంద్ర వర్మతో మాట్లాడుతున్న కూడా చైర్మన్ రూపనంద రెడ్డి

**ఓబులవారిపల్లి, 04(తెలంగాణ తెలుగు):** రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకించి కృష్ణ గుంటూరు జిల్లాలలో సంబంధించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా రైల్వేకోడూరు నియోజకవర్గంలో టిడిపి ఇన్చార్జి కడప కూడా చైర్మన్ ముక్కారూపానంద రెడ్డి బాపట్ల నియోజకవర్గంలో పర్యటించి కూటమి నాయకులు నరేంద్ర వర్మతో ఆయన నివాసంలో మాటామంతి జరిపి ఎన్నికల ప్రణాళిక గురించి చర్చించడం జరిగిందని తెలిపారు అంతేకాకుండా ఎన్నికల సందర్భంగా ఎక్కడెక్కడ ఎవరెవరిని విద్యావేత్తలను కలవాలని ఎన్ని ఓట్లు ఉన్నాయి ఎన్నికల గురించి పరిశీలించడం పరి చర్చలు పోయిన చర్చించడం జరిగిందని తెలిపారు. బాపట్ల నియోజకవర్గ కోటమి నాయకులు పాల్గొన్నారు



# జనవరిలో జరిగిన కౌన్సిల్ సమావేశాన్ని రద్దు చేయాలి



**ప్రొద్దుటూరు ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** జనవరిలో జరిగిన కౌన్సిల్ సమావేశాన్ని రద్దు చేయాలని మున్సిపల్ ఛైర్ పర్సన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజు, వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ ఛైర్మన్ ఛాంబర్ లో వారు ఈ విషయమై విలేఖరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ జనవరి 31వ తేదీన మున్సిపల్ సాధారణ సమావేశం, బడ్జెట్ సమావేశం నిర్వహించాల్సి వుండగా అజెండా లో పొందుపరిచిన బొల్లవరం ప్లాట్ల విక్రయం విషయంలో, దొరసానిపల్లె రోడ్డు, శ్రీరాములపేట, ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, కోనేటి కాల్వ వీధి, కొర్రపాడు రోడ్డు, మదూరు రోడ్డు విస్తరణ అంశం, ప్రొద్దుటూరు ను కార్పోరేషన్ చేయాలనే అంశాలపై పలువురు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఛైర్మన్ జనవరి 30వ తేదీన సమావేశం వాయిదా అని తెలిపారని గుర్తు చేశారు. కాగా రోడ్డు విస్తరణకు గానూ నష్టపరిహారం చెల్లించేందుకు సరైన నగదు వుందా, బొల్లవరం ప్లాట్ల విక్రయం విషయంలో గతంలో ఆదాయం ఏమైందని ప్రశ్నించారు. కాగా సమావేశం నిర్వహణ విషయంలో ఛైర్మన్ వాయిదా వేస్తే ఆ సమావేశం మళ్లీ నిర్వహించే అధికారం నిబంధనల ప్రకారం ఎవరికీ లేదని వివరించారు. కేవలం ఛైర్మన్ ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరైతేనే సమావేశాన్ని వైస్ ఛైర్మన్లు కానీ, ప్యానల్ కమిటీ ప్రకారం కానీ నిర్వహించే అవకాశం ఉందని తెలిపారు. కావున ఈ సమావేశానికి చట్టబద్ధత లేదని, ఈ సమావేశం రద్దు చేయాలని కలెక్టర్, ఉన్నతాధికారులను లేఖ ద్వారా కోరామని, లేని పక్షంలో న్యాయ పోరాటం చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సి.ఎస్.ఖాజామోహిద్దీన్, కౌన్సిలర్లు వరికూటి ఓబుళరెడ్డి, జయంతి, సత్యం, పిట్టా బాబాజీ, సుబ్బారెడ్డి, పాతకోట మునివంశీధర్ రెడ్డి, వైసీపీ పట్టణాధ్యక్షులు, 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా రథసప్తమి వేడుకలు





**ఉరవకొండ ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ఉరవకొండ మండల పరిధిలోని బూదగవి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం, ఆమిద్యాల సూర్యాలయంలో, పెన్నహెూబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున రథసప్తమి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు.రథసప్తమి సూర్య భగవానుని జన్మదినం. మాఘ మాసంలోని ఏడవ రోజు అంటే మాఘ శుక్ల సప్తమి నాడు రథసప్తమి వస్తోంది. రథం అంటే గమనం అని అర్థం. సూర్యగమనం ఈ తిథి నుండి మారుతుంది. ఉత్తరాయణం పుణ్యకాలంలో శిషర ఋతువు సమాప్తమై వసంతం వచ్చిన సందర్భంలో సూర్య భగవానుని కాంతి వేడిమి భూమిపై ఎక్కువగా ప్రసరిస్తుంది. రథసప్తమి, సూర్య జయంతి, భాను సప్తమి, మిత్రసప్తమి, జయసప్తమి, మహా సప్తమి, భీష్మ సప్తమి అని ఎన్నో పేర్లు ఉన్నాయి. రథసప్తమి రోజున సూర్యభగవానునికి సత్రజిత్తుడికి శమంతకమణి ప్రసాదించాడు. ఏడు కిరణాలుగా సప్తవర్ణాలతో ప్రతిబింబిస్తూ కదిలే సూర్యుని అశ్వాలు కిరణాలు ఈ రోజున ఒకే తెల్లని కాంతిగా మారుతాయి అందుకే ఈరోజు నీ రథసప్తమి అంటారు. భూతగవి సూర్య దేవస్థానం, పెన్నహెూబిలం దేవస్థానం, ఆమిద్యాల సూర్య దేవస్థానాలలో భక్తులు పోటెత్తారు. భూత గవిలో ఉదయం స్వామివారికి చీర పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పక్కనే ఉన్న శివాలయంలో భక్తులు అభిషేక పూజలు చేశారు. భక్తులు సూర్యనారాయణ స్వామి హెూమా నామజపాలతో పరవశించిపోయారు. దేవస్థాన ఆవరణంలో శ్రీ సూర్యనారాయణ నికి ఉషాదేవి ఛాయాదేవులతో జరిపిన కళ్యాణోత్సవంలో భక్తులు పాల్గొనగా, పెన్నహెూబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీవారికి ఇరువురు దేవేరులతో నిర్వహించిన పూజల్లో, కళ్యాణోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆమిద్యాల సూర్య ఆలయంలో సైతం జరిగిన రథసప్తమి వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సూర్య నమస్కారాలు ఆసనాలు భక్తులు చేశారు. భక్తుల నిలువు దోపిడీ. బూదగవి సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో దర్శనానికి 50 రూపాయలు చొప్పున వసూలు చేసి భక్తులను నిలువు దోపిడీకి పాల్పడ్డారు.

# 8న జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం

**కడప ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 8న (శనివారం) నిర్వహించడం జరుగుతుందని జడ్పి సీఈవో ఓబులమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7న జరగవలసిన జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న కారణంగా 8వ తేదీకి వాయిదా వేయడం జరిగిందని ఆమె ఆ ప్రకటనలో తెలిపారు.

# రంగాపురంలో పంట కోత ప్రయోగం





**బేతంచెర్ల,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** బేతంచెర్ల మండలం ఆర్ ఎస్ రంగాపురం గ్రామం లో శెనగ పంట లో పంట కోత ప్రయోగం మంగళవారం నిర్వహించడం జరిగింది. ఈ పంట కోత ప్రయోగంకు డోన్ ADA అశోక్ వర్ధన్ రెడ్డిగ supervision చేశారు .తరువాత అంబాపురం గ్రామం లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది.రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు,సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కిరణ్ కుమార్ AEOలు మహమ్మద్,బెన్నీ రాజు , అగ్రికల్చర్ అసిస్టెంట్ లు భారతి , సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పింఛను బదిలీ ఆప్షన్ ఓపెన్ అయింది


- ఎంపీడీవో శివ మల్లేశ్వరప్ప



**సిరివెళ్ల,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఒకే మండలంలోని ఒక సచివాల యం నుండి మరొక సచివాలయానికి, ఒకే జిల్లాలోని ఒక మండలం నుండి మరో మండలానికి, రాష్ట్రంలో ఒక జిల్లా నుండి మరో జిల్లాకు పింఛను ట్రాన్స్ఫర్ పెన్షన్ బదిలీ చేసుకోవడానికి ఆప్షన్ ఇప్పుడు ఓపెన్ అయిందని దళఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప అన్నారు.ఎవరైనా పింఛను దారులు పెన్షన్ ట్రాన్స్ఫర్ చేసుకోవాలి అంటే ఎక్కడికి ట్రాన్స్ఫర్ చేసుకోవాలో ఆ సచివాలయం పేరు, సచివా లయం కోడు , సచివాలయం మండలం, జిల్లాను ప్రస్తుతం పెన్షన్ తీసుకుంటున్న సచివాలయంలో ఉన్నటువంటి వెల్ఫేర్ అధికారులకు తెలియజేసినట్లయితే పింఛను ట్రాన్స్ఫర్ కొరకు దరఖాస్తు మొబైల్ యాప్ లో పెడతారునీ ఎంపీడీవో తెలిపారు.

# సీడ్స్ సబ్సిడీ నిధులు మంజూరు చేయండి సీఎంను కోరిన ధర్మవరం

**డోన్,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** అమరావతిలో మన ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు గారిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఏపి సీడ్స్ కార్పొరేషన్ సబ్సిడీ నిధులు మంజూరు చేయాలని, తెలుగుదేశంపార్టీ లో మొదటి నుండి పార్టీ సేవలు అందించే వారికి గత మూడు సంవత్సరాలలో వైసిపి ప్రభుత్వాన్ని ఎదుర్కొని కష్టపడిన టిడిపి నాయకులకు నామినేటెడ్ పదవుల ఇవ్వాలని విన్నవించారు.అదేవిధంగా పెద్ద పండుగ కార్యక్రమంలో భాగంగా పాఠశాలలకు వెళ్లినపుడు పాఠశాల సిబ్బంది కోరినా వాటికి నిధులు మంజూరు చేయాలని నారా చంద్రబాబు నాయుడు గారిని కోరడం జరిగింది.



తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
బుధవారం,
05 ఫిబ్రవరి 2025







## సమాజసేవకు పేదరికం అడ్డురాదు

**ఆళ్లగడ్డ,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** సమాజ సేవ చేయాలనుకునే వారికి పేదరికం అడ్డురాదని పట్టణ సిఐ చిరంజీవి అన్నారు. ఆళ్లగడ్డలో అహోబిల నరసింహ స్వామి పారువేట ఉత్సవ పల్లకి పూజలు సందర్భంగా పట్టణానికి చెందిన తిరుమల స్టూడియో నిర్వాహకులు సుబ్బరాయుడు అండ్ బ్రదర్స్ 30 మంది పేదలకు మంగళవారం వస్త్రాలు సీఐ చిరంజీవి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ తల్లితండ్రులు మాకు ఏమి ఇచ్చారు అనే వారే గాని తల్లిదండ్రుల జ్ఞాపకార్థం సేవాగుణంతో సమాజ సేవ చేసేవారు తక్కువ అన్నారు. కానీ 30 మందికి వస్త్రాలు పంపిణీ చేసిన తిరుమల సోదరులు ఔదార్యం గొప్పదన్నారు. ప్రతి సంవత్సరము ఈ సేవా కార్యక్రమం నిర్వహించడం తండ్రి మీద వారికున్న అభిమానానికి నిదర్శనం అన్నారు. సమాజ సేవ చేయాలనుకునే వారికి పేదరికం అడ్డు రాదని సుబ్బరాయుడు సోదరులు నిరూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సుబ్బరాయుడు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు నాయుడును కలిసిన టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వహీద్ హుసేన్





**నంద్యాల,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ఏపీ సీఎం నారా చంద్ర బాబు నాయుడును మంగళ వారం టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వహీద్ హుస్సేన్ కలిశారు.

## డిఎస్పిని కలిసిన రజక సంఘం నాయకులు

**ఆళ్లగడ్డ,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ఆళ్లగడ్డ డిఎస్పి ప్రమోద్ కుమార్ ను నంద్యాల జిల్లా రజక సంఘం నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అఖిల భారత రజక సంఘం జిల్లా అధ్యక్షులు సి నాగేంద్ర, ఉపాధ్యక్షులు అమ్మడాల రమణ, ఆళ్లగడ్డ మండలం అధ్యక్షులు సి ఆది నరసింహుడు, ఆళ్లగడ్డ నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు అరికటాముల పెద్ద వెంకటేశ్వర్లు, రజక సంఘం సభ్యులు చంద్రశేఖర్, మహేష్, బాలయ్య పాల్గొన్నారు.



# మెరుగైన వైద్య సేవలు అందించడమే,గురుతర బాధ్యత

**● ఆస్పత్రి అభివృద్ధి సలహా**

**మండలి సభ్యులకు విప్ కాలవ సూచన**

**బొమ్మనహాల్, 04(తెలంగాణ తెలుగు):-** రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ సంతృప్తి పరిచేలా చూడటం గురుతర బాధ్యతని ప్రభుత్వ విప్,రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సూచించారు. రాయదుర్గం ప్రాంతీయ వైద్యశాల అభివృద్ధి సలహా మండలి తొలి సమావేశం మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించారు.ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ హెూదాలో కాలవ పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల నుండి పేదలు ఎక్కువ భాగం వైద్య సేవల కోసం వస్తుంటారన్నారు. ఏ చిన్న సేవలు అవసరమైనా బళ్ళారి, అనంతపురం వెళ్లే అవసరం రాకుండా వైద్య సేవల విస్తరణకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నానన్నారు. తాను మంత్రిగా ఉన్నప్పుడే 30 పడకల ఆస్పత్రిని ఒకేసారి వంద పడకల సామర్థ్యానికి పెంచానన్నారు. అదనపు భవనాల నిర్మాణం పనులు కూడా అప్పుడే ప్రారంభించామన్నారు. 22 మంది వైద్యులు పని చేయాల్సి ఉండగా ప్రస్తుతం ఏడుగురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. భవన నిర్మాణాలు త్వరగా పూర్తిచెసి పూర్తి స్థాయి వైద్య సిబ్బందిని నియమించుకోగలిగితే అన్ని రకాల వైద్య సేవలు ఇక్కడే లభిస్తాయన్నారు. అప్పుడు మెరుగైన వైద్య సేవల కోసం ఏ అనంతపురానికో, బళ్ళారికో వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, వైద్యశాఖ ఉన్నతాధికారులతో ఇదివరకే చేర్చించానన్నారు. త్వరలో భర్తీ చేయనున్న వైద్య పోస్టుల్లో తమ ఆస్పత్రికి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని కోరామన్నారు. వారి నుండి సానుకూల సమాధానం వచ్చిందని తప్పక కొత్త సిబ్బంది త్వరలోనే వస్తారన్నారు. ఆస్పత్రి అభివృద్ధి, అవసరాలపై తాను ప్రత్యేక దృష్టి పెట్టానన్నారు. అభివృద్ధి సలహా మండలి సభ్యులు తరచూ ఆస్పత్రికి వస్తూ వైద్య సేవలపై ఆరా తీస్తుండాలని గుర్తు చేశారు. రోగులు, వారి బంధువులు, వైద్య సిబ్బందితో సమన్వయం చేస్తూ సేవలపై చర్చించాలన్నారు. ఏవైనా పొరపాట్లు జరిగితే అధికారుల దృష్టికి తీసుకెళ్లి చక్కదిద్దాలన్నారు. సిబ్బందితో గౌరవంగా మెలుగుతూ రోగులకు ఏ విధంగా మరింత మెరుగైన సేవలు అందించవచ్చో తగిన సూచనలు చేయాలన్నారు. ఆస్పత్రిని



ప్రజాలు తమ సొంత ఆస్థిగా బావించి వస్తారని వారికి కూడా గౌరవించాలన్నారు. వైద్య సిబ్బంది కూడా తమ విధులపట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అప్రమత్తంగా ఉంటూ పొరపాట్లకు ఆస్కారం లేకుండా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధి నూతన సలహా మండలి సభ్యులచే చైర్మన్ కాలవ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వైద్యాధికారిని జె.జ్ఞానసుధ, కమిటీ సభ్యులు సురేష్, కళ్యాణ్, శ్రీనివాస్, సంపత్ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రవేట్ పాఠశాలను ఆదుకుంటాం: మంత్రి లోకేష్

**● అభినందనలు తెలిపిన ప్రైవేటు పాఠశాల సిబ్బంది**

**పులివెందుల ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ప్రవేట్ పాఠశాలను ఆదుకుంటాం అనిఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐ.టి. మరియు విద్యాశాఖ మంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారాలోకేశ్ పేర్కొన్నారు దీనికి రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల తరపున జె.పి. రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్, విద్యాధరి విద్యాసంస్థల అధినేత డి. భానుప్రకాశ్ ధన్యవాదాలు తెలపడం జరిగింది ఈ సందర్భంగా భాను ప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐ.టి. మరియు విద్యాశాఖ మంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారాలోకేశ్‌తో అమరావతి లోని ఆయన నివాసంలో రాష్ట్రంలో గుర్తింపు పొందిన ప్రయివేట్ విద్యాసంస్థల వివిధ సంఘాల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో బి.జె.పి. రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్, విద్యాధరి విద్యాసంస్థల అధినేత డి. భానుప్రకాశ్ పాల్గొనడం జరిగింది. భానుప్రకాశ్ మంత్రి నారాలోకేశ్ తో జరిగిన సమావేశంలో రాష్ట్రంలోని ప్రస్తుత విద్యా వ్యవస్థతీరు, అమలవుతున్న సంస్కరణలు, ప్రైవేట్ విద్యాసంస్థలకు సంబంధించిన చిన్న చిన్న సమస్యలకు సంబంధించి తమ



అభిప్రాయాలను, విన్నపాలను ఆయనకు తెలియజేసారు. ఈ సంధర్భంగా ప్రైవేట్ పాఠశాలల్లో పనిచేస్తున్న క్వాలిఫైడ్ ఉపాధ్యాయులకు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు బోధనానైపుణ్యాభివృద్ధి శిక్షణలను అందించి వారిని కూడా వృత్తిపరంగా, ఆర్థికంగా ఎదిగే అవకాశాలను కల్పించాలని, అలాగే విధినిర్వహణలో భాగంగా ఎంతో వత్తిడికి లోనౌతున్న ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఉపాధ్యాయులకందరికి శారీరకంగా మానసికంగా ఉల్లాసాన్ని కల్పించేవిధంగా ఏడాదికోసారి అందరికీ సంయుక్తంగా క్రీడాపోటీలను ఒక క్రీడోత్సవ రూపంలో నిర్వహించేవిధంగా రూపకల్పన చేయవలసిందిగా అభ్యర్థించారు. ఈ రెండు విషయాలపై మంత్రి నారా లోకేష్ సానుకూలంగా స్పందించారని భాను ప్రకాష్ తెలియజేసారు. ప్రైవేట్ పాఠశాలలకు ప్రభుత్వ గుర్తింపు రెనీవల్ ను 8 సంవత్సరాల నుండి 10 సంవత్సరాలకు పెంచుతూ మంత్రి నారాలోకేశ్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ భానుప్రకాష్ ప్రత్యేకంగా ఆయనకు తమ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు. ఇంకా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నారాలోకేశ్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యావ్యవస్థలో తీసుకువస్తున్న సంస్కరణలతో, ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ దేశంలోనే ఆదర్శ విద్యావ్యవస్థగా రూపొందబోతోందని తెలియజేసారు. అలాగే భానుప్రకాశ్ మాట్లాడుతూ ఈ సమావేశానికి హాజరు కావడానికి మరియు మంత్రి నారాలోకేశ్ తో మాట్లాడడానికి అవకాశం కల్పించి తనకు వెన్నుతట్టి అండగా నిలిచిన పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల యం.ఎల్.సి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కి తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసారు.

## హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి: ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి



**రామాపురం ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ ధరించి తన విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని రామాపురం ఎస్ఐ వెంకట సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో రామాపురం పోలీస్ స్టేషన్ దగ్గర వాహన తనిఖీ నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి అని మత్తుపదార్థాలు సేవించి వాహనాలు నడపరాదని వాహనదారులకు లైసెన్సు మరియు ఇన్సూరెన్స్ తప్పనిసరి గా ఉండాలని వాహనదార రోడ్డు నియమాలను పాటించి జాగ్రత్తగా వెళ్లాలని అలా లేని పక్షంలో వాహనదారులకు అపరాధ రుసుము తప్పక చెల్లించవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## ఇష్టారాజ్యంగా ఎంపీడీవో విధుల నిర్వహణ

**● పాఠశాలల తనిఖీ ఊసే లేదు**

**● కార్యాలయ ఆవరణంలో ఎంపీడీవో రాక కోసం పడిగాపులు**





**ఉరవకొండ ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ఉరవకొండ మండల ప్రజా పరిషత్ అధికారి ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఎంపీడీవో రాక కోసం మంగళవారం ఆయన కార్యాలయం వద్ద కొందరు పడిగాపులు కాశారు. ఎంపీడీవో వస్తారా రారా అని సిబ్బందిని ప్రశ్నించినప్పటికీ వారి నుంచి సారాయన సమాధానం ఇవ్వటం లేదు. ఎంపీడీవో విధుల నిర్వహణపై ప్రతిపక్ష వామపక్ష పార్టీలు నోరు మెదపటం లేదు. ఏదైనా సమాచారాన్ని ఆయన కొన్ని అనుకూల పత్రికలకు మాత్రమే సమాచారం అందిస్తూ ఒంటెత్తు పోకడలు ప్రదర్శిస్తున్నారు. కార్యాలయ ఆవరణంలో ఇంకుడు గుంత తవ్వించారు రూ 76 వేలపై తెలుగు మంజూరు చేశారు. పని ప్రారంభించిన తేదీ బోర్డుపై ఉంది. అయితే ముగింపు తేదీ పేర్కొనలేదు. ఇంకుడు గుంతను తూతూ మంత్రంగా తవ్వించారు. పారదర్శకత జవాబుదారీతనం ఆయనలో లోపించింది తన ఎవరు ఏమి ప్రశ్నించరులే అనే ధోరణితో ఎంపీడీవో వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలోని మండల ప్రజా పరిషత్ ఉన్నత, ఎలిమెంటరీ పాఠశాలలను ఆయన ఏనాడూ తనిఖీ చేయలేదు. ఎంపీడీవో ఇలా ఉంటే ఎంఈఓ సైతా డు బసవన్న నైజంగా మారింది. ప్రభుత్వం మారిన అధికారుల పనితీరు మారలేదు. మేం మారం మేం ఇంతే అన్న చందంగా వారి తీరు, వ్యవహార శైలితో లబ్ధిదారులు మండల ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. జిల్లా ముఖ్యఅధికారి సమగ్ర విచారణ జరిపి తదుపరిచార్యులు తీసుకోవాలని కోరుతున్నారు.

## పోలీస్ సంక్షేమానికి పెద్దపీట – పోలీస్ అధికారుల సంఘం

**● రాష్ట్ర డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్**



**కడప టౌన్ ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** జిల్లాలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది, వారి కుటుంబాలకు ఎటువంటి ఆపద కలిగినా తాను అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తానని జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలోని మిని కాన్ఫరెన్స్ హాలులో ఆంధ్ర ప్రదేశ్ పోలీస్ అధికారుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర పోలీస్ డైరీ 2025 ను ఆవిష్క రించిన జిల్లా ఎస్.పి ఈ.జి అశోక్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్.పి మాట్లాడుతూ క్షేత్రస్థాయి పోలీసు సిబ్బందికి ఉపయోగపడే ప్రభుత్వ ఉత్తర్వులు, సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ మరియు శాఖాపరమైన సంక్షేమ పథకాలపై సమగ్ర సమాచారాన్ని ఈ డైరీ ద్వారా సిబ్బందికి అందజేయడం పై పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులను అభినందించారు జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గత సంవత్సరం లో జిల్లా పోలీసులు సాధించిన విజయాలను స్ఫూర్తిగా తీసుకొని ఈ నూతన సంవత్సరం లో కూడా సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో విధులు నిర్వర్తించి, ప్రజలకు విలువైన, నాణ్యమైన సేవలు అందించడం ద్వారా పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ(అడ్మిన్) కె. ప్రకాష్ బాబు ఆర్.ఐ లు ఆనంద్, టైటాస్, వీరేష్, శ్రీశైల రెడ్డి, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, ఈసీ మెంబర్ ఏప్రిన్,మరియు సభ్యులు రామస్వామిరాజు,రాచరాయుడు,అంజి, పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ రెడ్డయ్య కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి



**లక్కిరెడ్డిపల్లె ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** గత రెండు రోజుల క్రితం మాజీ ఎంపీపీ రెడ్డయ్య ఇంటిపై జరిగిన దాడి నేపథ్యంలో మంగళవారం లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి జాంద్రపల్లెకు వెళ్లి జడ్పిటిసి రమాదేవి కుటుంబాన్ని పరామర్శించి, దాడి జరిగిన విషయంపై ఆరా తీశారు. వైయ స్సార్సీపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి, వైఎస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ రమేష్ కుమార్ రెడ్డి దాడి జరిగిన విషయం పార్టీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివశంకర్ రెడ్డి,మాజీ సర్పంచ్ లక్ష్మీదేవి,అంబా బత్తిన రమేష్, మైనార్టీ నాయకులు చాన్ బాషా పాల్గొన్నారు

# బీజాపూర్, గంగులూరు ఎన్ కౌంటర్ బూటకం

**● హైదర్ గూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఖండించిన ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు**

**హైదరాబాద్,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ఫిబ్రవరి-1, 2025న చత్తీస్ ఘడ్ రాష్ట్రం, బీజాపూర్ గంగులూరులో జరిగిన ఎన్ కౌంటర్లో 8 మంది మావోయిస్టులు చనిపోయినట్లుగా పోలీసులు ప్రకటించడాన్ని ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక నాయకులు తీవ్రంగా ఖండించారు. ఫిబ్రవరి-1 న జరిగిన చత్తీస్ ఘడ్ రాష్ట్రం బీజాపూర్, గంగులూరు ఎన్ కౌంటర్ పై స్పందిస్తూ 2025, ఫిబ్రవరి-4 న హైదరాబాద్, హైదర్ గూడ ప్రెస్ క్లబ్ లో పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి నారాయణ అధ్యక్షతన మీడియా సమావేశం జరిగింది. కార్పొరేట్లకు సంపదలను అప్పగించటం కోసం, ఆదివాసులను హననం చేస్తున్న ప్రభుత్వ అప్రజాస్వామిక కుట్రలో బాగంగానే అక్కడ స్థానిక ఆదివాసీలను హత్యచేసి, పోలీసులే ఎన్కౌంటర్ కట్టుకథ అల్లుతున్నారని మండిపడ్డారు. ఇదే విషయాన్నిపీపుల్స్ యూనియన్ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) సంస్థ తన నిజనిర్ధారణ ద్వారా ప్రకటించిందని అన్నారు. చనిపోయిన వారందరూ గ్రామస్తులే అని, మావోయిస్టులు కాదని వారంతా కోర్చోలి, తోడ్కా గ్రామస్తులలే అని చెబుతున్నారని పియుసిఎల్ తన నివేదికలో స్పష్టం చేసిందని అన్నారు. గ్రామస్తుల నుండి అందిన సమాచారం ఆధారంగా బిజాపూర్లో జరిగిన ఎన్కౌంటర్ కోర్చోలి, తోడ్కా గ్రామాల మధ్య ఉన్న తోలిమెటా (టోలి కొండలు) వద్ద 2025 ఫిబ్రవరి 1న కూంబింగ్ చేస్తున్న బద్రతా బలగాలు ప్రధానంగా డిఆర్జి, సిఆర్పిఎఫ్, ఎస్టీఎఫ పోలీసు, మిలటరీ బలగాలు గ్రామస్తులను పట్టుకొని కాల్చి చంపి, ఎన్ కౌంటర్గా ప్రకటిస్తున్నారని అక్కడి గ్రామ ప్రజల మనోవేదనను ఆవిష్కరించారు. కోర్చోలి, తోడ్కా గ్రామాల మధ్య ఉన్న తోలిమెట దగ్గర 1 ఫిబ్రవరి 2025న ఉదయం 9.00 గంటల నుండి మా?2.00 గంటల వరకు ఆడపాదడపా కాల్పులు జరిపి, బందీలుగా పట్టుకున్న ఆదివాసీలను కాల్చి చంపినట్లుగా తెలియజేశారు. మొత్తంగా 8 మంది ఆదివాసీలను కాల్చి చంపి మావోయిస్టులుగా ప్రకటించారని, వారి వివరాలు కమలేష్, మంగల్, పోతం లచ్చు, శంకర్, రాజు, విజ్జు, సన్నులుగా ఉన్నట్లుగా పత్రికల ద్వారా తెలిసిందని అన్నారు. వీళ్ళందరిపై 11 లక్షల రివార్డు ప్రకటించిందని అన్నారు. చత్తీస్ ఘడ్ లో ఏడాది



కాలంగా ఆదివాసీలను చంపి, రివార్డులు ప్రకటించుకొని ప్రజల డబ్బును పోలీసులకు రివార్డు రూపంలో అందజేస్తున్నారని ఆరోపించారు. ఇది రాజ్యాంగబద్ధంగా పరిపాలించాల్సిన పాలకులు ఆదివాసీలను వేటాడి, వెంటాడి మావోయిస్టుగా చిత్రీకరిస్తూ 3 నుండి 5 రోజుల పాటు ఎన్ కౌంటర్ జరిగినట్లుగా అబూతకల్పన సృష్టిస్తూ, ఒక భయానక వాతావరణనికి ఆదివాసీలను గురి చేస్తున్నారని ఎత్తిచూపారు. 2005లో సల్వ జుడుం దాడికి, ఆదివాసీ జనజీవనం విధ్వంసానికి గురి కాకుండా పోరాడే ఆదివాసీలకు ఆడవిపై హక్కు ఉంటుందని జల్, జమీన్, జంగల్ పై మాదే హక్కు అని ప్రభుత్వం ఎన్ని రకాల మిలిట్రీ ఆపరేషన్లను పెట్టి మారణకాండను సృష్టించినా, ఆదివాసులు మాత్రం అడవినే నమ్ముకొని జీవిస్తున్నారని గుర్తు చేశారు. అడవిని, కార్పొరేట్లకు అప్పగించడం కోసం ఆదివాసీలను నిర్వాసితులను చేయడం కోసం ఆపరేషన్ కగార్ పేరుతో లక్షలాది బలగాలతో క్యాంపులను నిర్వహిస్తునే వేలాది బలగాలతో కుంబింగ్ చేపడుతూ మారణహెూమాన్ని కొనసాగిస్తున్నదని ఎండగట్టారు. 1 ఫిబ్రవరి 2025న జరిగిన ఎన్ కౌంటర్ ఘటన లాగా అన్నింటిని సృష్టిస్తూ రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. దేశంలో మనకున్న రాజ్యాంగం ప్రకారం మనందరం ముఖ్యంగా హక్కుల సంఘాలన్ని కూడా ఏ ప్రాంతానికైనా వెళ్ళి అక్కడ జరిగిన ఘటనలపై నిజనిర్ధారణ చేసి, ప్రపంచానికి తెలియజేపుతున్న బాధ్యతను ఆర్ధ శతాబ్దంగా పౌర హక్కుల సంఘం, ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ వేదిక కొనసాగిస్తున్నదని వెల్లడించారు. కానీ నేడు డబుల్ ఇంజన్ సర్కార్ ప్రకటించుకున్న బిజెపి ప్రభుత్వం పూర్తి రాజ్యాంగ విరుద్ధంగా ప్రజాస్వామిక పరిపాలనను పక్కన పెట్టేసి కార్పొరేట్లకోసమే పరిపాలన అన్నట్లుగా ఆదివాసుల హననానికి గురి చేస్తున్నదని ఆవేదన చెందారు. ఫిబ్రవరి 1వ జరిగిన గంగులూరు ఎన్ కౌంటర్ ఒక్కటే కాదని, గత ఏడాది కాలంగా జరిగిన ఎన్కౌంటర్లలలో ఇప్పటి వరకు 350 మంది వరకు హత్య గావించబడ్డారని వివరాలు తెలియజేశారు. దేశవ్యాప్తంగా ప్రజాస్వామిక వాదులు, హక్కుల సంఘాలు ఈ హత్యాకాండను నిలువరించాలని, అక్కడ ఒక ప్రజాస్వామిక వాతావరణం కల్పించాలని కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూనే వస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే ఏడాది క్రితం ఆవిర్భవించిన ఆదివాసీ హక్కుల సంఘాల సంఘీభావ వేదిక కూడా ఒకసారి నిజనిర్ధారణకు ప్రయత్నించిందని, దాన్ని ప్రభుత్వం విఫలం చేసిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆపరేషన్ కగార్ హత్యాకాండను ఆపివేయాలని, 1996 పేపా చట్టాన్ని గ్రామసభ తీర్మాణాలను పగడ్బంధీగా అమలు చేయాలని, జల్, జంగల్, జమీన్ లపై ఆదివాసీలకే హక్కు ఉండాలని, అది 1997 సమతా జడ్జిమెంటులో కూడా సుప్రీం కోర్టు పేర్కొందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలియజేస్తూనే చత్తీస్ ఘడ్ లో ఆదివాసీల జీవించే హక్కు కోసం ప్రభుత్వం ప్రజాస్వామిక వాదులతో, హక్కుల సంఘాలతో ఒక కమిటీని ఏర్పాటు చేసి, క్షేత్రస్థాయిలో పర్యటించే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్య రాజ్యాంగ బద్ధ పాలనను అమలు చేయాలని వేదిక తరపున విజ్ఞప్తి చేశారు. అనంతరం చత్తీస్ ఘడ్, బీజాపూర్, గంగులూరు ఎన్కౌంటర్ బూటకం అని దీనిపై వెంటనే విజనిర్ధారణ జరిపి, ఎన్ కౌంటర్లో పాల్గొన్న పోలీసులపై హత్యానేరం కేసు నమోదు చేయాలని,ఆదివాసీ ప్రాంతాల్లో 600 క్యాంపులు, 7 లక్షల బలగాలను వెంటనే తొలగించాలని,ఆదివాసీ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఆదివాసీల హననాన్ని వెంటనే ఆపివేయాలని, 1996 పేసా చట్టం గ్రామ సభ తీర్మాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని, ఇప్పటిదాక జరిగిన అన్ని ఆదివాసీ హత్యలపై సిట్టింగ్ సుప్రీం కోర్టు జడ్డిచే విచారణ జరిపించి, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, రాజ్యాంగబద్ధంగా పరిపాలన కొనసాగించాలని తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కవులు, కళాకారులు, మేదావులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరసమాజం వెంటనే స్పందించాలని, ఆదివాసులకు మద్ధతుగా నిలబడాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, భారత ప్రజా న్యాయవాదుల సంఘం డి.సురేష్, అమరుల బందు మిత్రుల సంఘం పద్మకుమారి, ఐ.ఎఫ్.టి.యు.(శ్రామిక స్పందన) జాతీయ కార్యదర్శి షేక్ షావలి, చైతన్య మహిళా సంఘం వేదిక కన్వీనర్ బి.జ్యోతి, పికెఎం డి.జాన్, పీడిఎం చంద్రమౌళి, టోపీఎఫ్ రాంబాబు తదితరులు పాల్గొన్నవారిలో ఉన్నారు.

# కుల జన గణన చారిత్రాత్మక విజయం

**● సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికారి, యంత్రాంగానికి ప్రభుత్వానికి కృతజ్ఞతలు ● పులి ఆంజనేయులు గౌడ్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ ● సమగ్ర కుటుంబ సర్వేపై ప్రతిపక్ష నేతలు విమర్శలుమాని ప్రభుత్వానికి సహకరించాలి: బోనాల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు కరీంనగర్**

**కరీంనగర్ టౌన్,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ఎన్నికల హామీ మేరకు తెలంగాణ రాష్ట్రంలో జరిపిన సమగ్ర కుటుంబ సర్వే ద్వారా బీసీ కుల జన గణన చేపట్టి కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వం చారిత్రక విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి జిల్లాకు చెందిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి ధన్యవాదాలు తెలియజేస్తూ నేడు కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు



గౌడ్, మరియు నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా చౌక్ వద్ద సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ భారత్ జూడో యాత్రలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ రాష్ట్రంలో బీసీ కులగన చేపడతామని ఇచ్చిన మాట కట్టుబడి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సమగ్ర కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసిన అధికార యంత్రంగానికి, ప్రభుత్వానికి బీసీల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, నేడు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి నివేదికను ప్రవేశపెడుతున్న సందర్భంగా కొంతమంది ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలను తెలంగాణ ప్రజలు పట్టించుకోవడంలేదని, సమగ్ర కుటుంబ సర్వేలో 96% ప్రజలు తమ వివరాలను వెల్లడించడమే ఇందుకు నిదర్శనమని, ఇప్పటికైనా బిజెపి బీఆర్ఎస్ నేతలు సమగ్ర కుటుంబ సర్వే కుల గణనపై తమ వైఖరిని మార్చుకొని ప్రభుత్వానికి సహకరించి సలహాలు సూచనలు అందజేయాలి తప్ప ప్రభుత్వాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తే రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల ఆవేశానికి బలి కాక తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఎండి తాజ్, రహమత్ హుస్సేన్, ముత్యం శంకర్, పురం రాజేశం, బొబ్బిలి విక్టర్, ఎస్ ఏ మోసిన్, లింగంపల్లి బాబు, హైమద్ అలీ, పంజాల స్వామి గౌడ్, రోళ్ల సతీష్, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, సిరిపురం నాగప్రసాద్, మెతుకు కాంతయ్య, రామిడి రాజిరెడ్డి, నెల్లి నరేష్, రామిడి తిరుపతి, మాదాసు శ్రీనివాస్, అజయ్, స్వప్న, శ్రీ కుంభాల రాజకుమార్, అనరాసు కుమార్, తోట ఆంజనేయులు, కలీం, ముల్కలయోన, ఆంజనేయులు, శ్రీనివాస్, తోట ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ భావజాలాన్ని, ఆలోచనా విధానాన్ని ముందుకు తీసుకెళ్లాలి

**● భారత రాజ్యాంగం.అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి , క్షీరాభిషేకం చేసి పూలమాల వేయడం జరిగింది**

**● రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య**

**మొగుళ్లపల్లి,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** గ్రామ గ్రామాన అంబేద్కర్ యువజన సంఘాలను వేస్తూ అంబేద్కర్ ఆశయాలు కొనసాగిస్తూ భావజాలాన్ని ఆలోచన విధానాలను ముందుకు తీసుకెళ్లాలని అలాగే భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున భారత రత్న బాబా సాహెబ్ అంబేద్కర్ గారి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేయడం జరిగిందని తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య తెలిపారు. జయశంకర్ జిల్లా మొగుళ్ళ పల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మంగళపల్లి శ్రీనివాస్ అద్యక్షతన లిముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య మొగుళ్ళపల్లి అంబేద్కర్ గారి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతు కుల మతాలకు అతీతంగా ప్రజలను చైతన్య



వంతులను చేస్తు అంబేద్కర్ సంఘాలతో పాటు ఆశయాలను సిద్ధాంతాలను భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన ముసాయిదా కమిటీ చైర్మన్ గా డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారి నేతృత్వంలో భారత రాజ్యాంగాన్ని 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు రచించి జనవరి 26, 1950న అమలు చేశారని అన్నారు. నాటి నుంచి నేటి వరకు 75 సంవత్సరాలు పూర్తిచేసుకుందని చెప్పారు. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలనను కొనసాగించాయని తెలిపారు. దేశ ప్రజలందరికి సమానంగా రిజర్వేషన్లు కల్పించి , కుల మతాలకు అతీతంగా 18 సంవత్సరాలు నిండిన పౌరులకు ఓటు హక్కు కల్పించిన మహెూన్నతమైన వ్యక్తి బాబా సాహెబ్ అంబేద్కర్ గారని అన్నారు. రాజ్యాంగాన్ని కొందరు మతోన్మాదులు మార్చాలని చూస్తున్నారని తెలిపారు. భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి పై ఉందని అందుకు కుల మతాలకు అతీతంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు అతీతంగా అందరు ఐక్య మత్యంతో రాజ్యాంగాన్ని రక్షించేందుకు రావాలని వారు అన్నారు . ప్రపంచ మేధావి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారు రచించిన భారత రాజ్యాంగం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. లిముఖ్యంగా దళిత బడుగు బలహీన వర్గాలను చైతన్యం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి గుర్రపు రాజేందర్ , భారతీయ జనతా పార్టీ భూపాలపల్లి నియోజకవర్గం కన్వీనర్ మోర్ రవీందర్ రెడ్డి,, అంబేద్కర్ యువ సంఘం జిల్లా నాయకులు బండారి రాజు, బండారి రామస్వామి, కట్కూరి ఐలయ్య, బండారి రవీందర్,ఓనపాకల ప్రసాద్, జీడి సంపత్, బండారి శ్రీనివాస్, బండారి తిరుపతి, తదితరులు పాల్గొన్నారు

# కేంద్ర బడ్జెట్ తెలంగాణ ప్రజలకు వరం లాంటిది

**- బిజెపి మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ గౌడ్**



**చిట్యాల, ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ సర్కార్ ప్రవేశ పెట్టింది పేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్ అని రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు విప్లవాత్మకమని బిజెపి చిట్యాల మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ బడ్జెట్ సందర్భంగా బిజెపి నాయకులు ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బడ్జెట్ తెలంగాణ ప్రజలకు వరమని, దేశంలోని ఒక్కో ఉద్యోగికి రూ. 80 వేలు ఆదా అవుతుందన్నారు. 75 ఏళ్లలో మునుపెన్నడూ లేని విధంగా మధ్యతరగతికి అనుకూలంగా బడ్జెట్ రూపొందించారన్నారు. తెలంగాణలో 50 లక్షల మందికి పైగా రైతులకు రూ. 5 లక్షల వరకు రుణం పొందే ఈ బడ్జెట్ కల్పిస్తుందని బుర్ర వెంకటేష్ గౌడ్ అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు సుద్దాల వెంకన్న మండల మొగిలి గుండ సురేష్ సుధ గాని శ్రీనివాస్ అశోక్ చారి బీజేవైఎం మండల అధ్యక్షుడు మైదామ్ శ్రీకాంత్ ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు అనుపమహేష్ ర్యా కమ్ శ్రావణ్ చిన్నవేని సంపత్ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

# పరకాలలో 41 కేజీల గంజాయి పట్టివేత



**పరకాల, ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** పరకాల పట్టణంలో టాస్క్ ఫోర్స్ ఇన్ఫర్మేషన్ మేరకు పరకాల సిఐ క్రాంతి కుమార్ ఉత్తర్వుల మేరకు పరకాల-హనుమకొండ రహదారిపై ఎస్ఐ శివకృష్ణ, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో.. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అనుమాన స్పదంగా కనిపించడంతో వారి వద్ద నాలుగు బ్యాగులు ఉన్నాయి.. అయితే ఆ బ్యాగులో ఏమున్నాయని ప్రశ్నించగా.., అనుమానంతో భయంతో గంజాయి ఉన్నదని సమాధానం చెప్పినారు వారి వద్ద 41 కేజీల ఎండు గంజాయి ఉన్నది వారు చెప్పడం జరిగిందని, ఎటు వెళుతున్నారని అడగా ఒరిస్సా నుండి ముంబైకి తరలిస్తున్నట్టు వారు చెప్పడం జరిగిందని, వాళ్ల పేర్లు ప్రేమందా దాస్ S/o భరేంద్ర దాస్ వయసు 31 సంవత్సరాలు కులం యాదవ వృత్తి వ్యవసాయం R/o గొలబంద బలేశ్వరం జిల్లా ఒరిస్సా ఇతని బామ్మర్ది అయినా సౌమ్య రంజన్ రౌత్ S/o శరత్ రౌత్ వయసు 22 సం.లు కులము యాదవ వృత్తి స్టూడెంట్ R/o ఆస్టియా పతం భవలేశ్వరం జిల్లా ఒరిస్సా వీరి వద్దనుండి స్వాధీనం చేసిన గంజాయి విలువ రూ. 10,27,250 రూపాయలు వీరిపై కేసు నమోదు చేయడం జరిగిందని సిఐ క్రాంతి కుమార్ తెలిపారు.

# దేశ ఉజ్వల భవిష్యత్‌కు దిక్సూచి కేంద్ర బడ్జెట్

**- మేడ్చల్ ఇంచార్జ్ ఏనుగు సుదర్శన్ రెడ్డి**

**మేడ్చల్ మల్కాజిగిరి,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ఫిబ్రవరి నెల 1 వ తేదీన ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్ పై హర్షాన్ని వ్యక్తం చేస్తూ ఘట్కేసర్ మండల మున్సిపల్ అధ్యక్షులు బస్వరాజు గౌడ్,మహిపాల్ రెడ్డిల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బిజెపి శ్రేణులతో కలిసి ఏనుగు సుదర్శన్ రెడ్డి, మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు సంస్కరణలు మరొకవైపు సంక్షేమ పథకాలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం.ఇంకొకవైపు వేతన జీవుల టాక్స్ దూరం చేసే విధంగా 12 లక్షల వరకు పన్ను రాయితీలను కల్పించడం ద్వారా దేశ ప్రగతి,భవిష్యత్ ను కొత్త పుంతలు తొక్కించే బడ్జెట్ గా దీన్ని ఆయన అభివర్ణించారు. కేంద్ర ప్రభుత్వ నిధులు సహకారంతోనే రాష్ట్రంలో జరిగే అభివృద్ధి సంక్షేమం నడుస్తున్న విషయం ప్రజలందరూ గమనిస్తున్నారు అని ఆయన పేర్కొన్నారు.



తెలంగాణ
తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం
బుధవారం, 05 ఫిబ్రవరి 2025


# ఈటెల రాజేందర్‌పై అసత్యాలు నమ్మద్దు

**మేడ్చల్ నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి**



**మేడ్చల్ మల్కాజిగిరి, ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** ఈటెల రాజేందర్ పై అసత్యాలు నమ్మద్దు అని వై యస్ ఆర్ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు ఈసందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లో ప్రజలకోసం అన్ని సమస్యల పై నిరంతరం పోరాటాలు చేస్తున్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పై కుతంత్ర రాజకీయ ప్రచారాలు చేస్తున్న వారిని హెచ్చరించారు. బిజెపి పార్టీ ఆధ్వర్యంలో ఇలాంటి కుట్రలు చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజ్ పనులను పరిశీలించిన కలెక్టర్



**కోరుట్ల 04(తెలంగాణ తెలుగు):** మంగళవారం జిల్లా కలెక్టర్ బి స త్యప్రసాద్ మెట్ పల్లి శివారు మల్ల న్న గుడి వద్ద మిషన్ భగీరథ పైప్ లైన్ లీకేజ్ పనులను పరిశీలిం చినారు కలెక్టర్ మాట్లాడుతూ మి షన్ భగీరథ పైప్ లైన్ లీకేజ్ పను లను తొందరగా పూర్తి చేసి ప్రజ లకు నీరు అంది ఇవ్వాలని ఆదేశిం చినారు ప్రతి ఇంటికి శుద్ధమైన తా గునీరు అందించడమే లక్ష్యం గా ప్ర భుత్వం కృషి చేస్తుందని కలెక్టర్ అ న్నారు లీకేజ్ మరమ్మ తులను వేగ వంతంగా పూర్తి చేయాలని తెలిపినారు. ఆర్డీవో ఎన్ శ్రీనివాస్ మున్సిపల్ కమిష నర్ టి మోహన్ ఎమ్మార్వో ఆర్ శ్రీ నివాస్ మిషన్ భగీరథ ఈ ఈ శేఖ ర్ రెడ్డి ఏ ఈలు జ్ఞానేశ్వర్ మల్లేష్ మున్సిపల్ ఏఈ తిరుపతి ఇన్చార్జ్ సానిటరీ ఇన్స్పెక్టర్ రత్నాకర్ ముజీ బ్ ఇతర అధికారులు పాల్గొన్నారు

# ఖనిలో పుస్తకాల ఆవిష్కరణ...



**గోదావరిఖని, 04(తెలంగాణ తెలుగు):** గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో బుద్ధుడు నుంచి గద్దర్ వరకు మరియు అస్పృశ్య యోధుడు అనే పుస్తకాలను ముఖ్య అతిథులు ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్, మినిమం వేజ్ బోర్డ్ చైర్మన్ జనక్ ప్రసాద్, రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ లు ఆవిష్కరించారు. బొజ్జ బిక్షమయ్య రామగుండం పారిశ్రామిక ప్రాంత కార్మిక నాయకుడిగా వామపక్ష భావజాలం నుండి బుద్ధిజం, రచయిత వైపు నడిచిన ఆయన జీవిత చరిత్రను వివరించిన తీరును కార్మిక ఉద్యమానికి ఊపిరిలూదిన నాయకుడి తీరును వక్తలు ప్రశంసించారు. బివివి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పుస్తకాల రచయితలు బొజ్జ బిక్షమయ్య, కాలువ మల్లయ్య లు...పుస్తకాల పై సమీక్ష ప్రసంగాలు ఆకట్టుకున్నాయి.అరసం నాయకులు వేల్పుల నారాయణ, సిఐటియు రాజారెడ్డి, ఐఎన్టియుసి నరసింహారెడ్డి, ధర్మపురి, ఏఐటీయూసీ నాయకులు స్వామి సీనియర్ జర్నలిస్ట్ మాదాసు రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో రథసప్తమి వేడుకలు..

**హుస్నాబాద్, 04(తెలంగాణ తెలుగు):** హుస్నాబాద్ పట్టణంలో శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో మంగళవారం రథసప్తమి సందర్భంగా విద్యార్థులచే సూర్య నమస్కారాలు, ఆసనాలు,యోగ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా విభాగ ఉపాధ్యక్షులు చిట్టి దేవేందర్ రెడ్డి, వాసవి క్లబ్ వనిత, సిద్దిపేట జిల్లా గోమాత అధ్యక్షురాలు రాగి కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సృష్టికి ప్రత్యక్ష దైవం సూర్య నారాయణడని,ప్రతి ఒక్కరు తప్పక సూర్య నమస్కారాలు చేయడం వల్ల ఆరోగ్యంగా ఉంటారని, ఆహ్లాదకరంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గట్టు రమాదేవి, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.



# ఇది సంక్షేమ బడ్జెట్- ప్రజల పెన్నిధి నరేంద్ర మోదీ

- **ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రత్యేక ధన్యవాదాలు**
- **దేశ గతినే మార్చే అద్భుతమైన బడ్జెట్: బిజెపి భూపాలపల్లి నియోజకవర్గం మోరే రవీందర్ రెడ్డి మరియు మాజీ మండల అధ్యక్షులు చెవ్వ శేషగిరి**

**మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** భారతీయ జనతా పార్టీ మొగులపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడు మోరే వేణుగోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా బిజెపి భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డి మరియు మాజీ మండలాధ్యక్షుడు చేవ్వా శేషగిరి ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ గారికి పాలాభిషేకం చేసి తదనంతరం వారు మాట్లాడుతూపేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు విప్లవాత్మకంతెలంగాణ ప్రజలకు వరం ఈ బడ్జెట్తెలంగాణ సహా దేశంలోని ఒక్కో ఉద్యోగికి రూ.80 వేల వరకు ఆదాగత 75 ఏళ్లలో మునుపెన్నడూ లేనివిధంగా మధ్యతరగతికి అనుకూలమైన బడ్జెట్ ఇదితెలంగాణలో 50 లక్షల మందికిపైగా రైతులకు రూ.5 లక్షదాకా రుణం పొందే అవకాశంకిసాన్ క్రెడిట్ కార్డుల కోసం రైతులంతా దరఖాస్తు చేసుకోవాలిఅమెరికా, చైనా తరువాత మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించే దిశగా బడ్జెట్ ను ప్రవేశ పెట్టడం గొప్ప కార్యంపత్తి, పప్పు దినుసులు పండించే రైతులకు లాభదాయకమైన బడ్జెట్కేంద్ర బడ్జెట్ అద్భుతంగా ఉంది. పేద, మధ్యతరగతి, రైతులు, చిరు వ్యాపారుల, యువ పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన బడ్జెట్ ఇది. మధ్యతరగతి ఉద్యోగుల, వ్యాపారులకు ఈ బడ్జెట్ ఓ వరం. ఉద్యోగులకు రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం విప్లవాత్మక చర్య. గత 75 ఏళ్లలో మధ్య తరగతి ప్రజల కోసం ఇంత అనుకూలమైన బడ్జెట్ ఎన్నడూ రాలేదు.అట్లాగే ఇది సంస్కరణల బడ్జెట్. 2027నాటికి అమెరికా, చైనా తరువాత భారత్ ను మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరించే ఆ దిశగానే ఈ బడ్జెట్ ను రూపొందించడం గొప్ప విషయం. ప్రియతమ ప్రధానమంత్రి నరేంద్రమోదీగారి ఆధ్వర్యంలో ఇంత గొప్ప బడ్జెట్ ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు.



బీజేపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల పక్షపాతి అనడానికి నిదర్శనమిది. తెలంగాణసహా దేశంలో లక్ష రూపాయల లోపు జీతభత్యాలు పొందే ఉద్యోగులంతా ఇకపై పన్ను కట్టాల్సిన అవసరం లేకపోవడం గొప్ప విషయం. తద్వారా ఒక్కో ఉద్యోగికి సగటున రూ.80 వేలు ఆదా అయ్యే అవకాశముంది. పేద, మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేసే టీవీ, మొబైల్స్, లెదర్ ఉత్పత్తుల ధరలను భారీగా తగ్గబోతున్నాయి. ఎలక్ట్రిక్ వాహనాలపై ధరలు కూడా తగ్గబోతున్నాయి. తద్వారా కాలుష్యం తగ్గే అవకాశముంది. కేన్సర్, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులు వాడుతున్న ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని భారీగా తగ్గించడంవల్ల ఆయా రోగాలకు చికిత్స వ్యయం చాలా వరకు తగ్గే అవకాశముంది. ఆర్థిక వ్యవస్థను స్థిరంగా ఉంచడంతోపాటు వ్యవసాయం, ఉత్పత్తి, సేవా రంగాలను బ్యాలెన్స్ చేసే బడ్జెట్ ఇది. ఈ బడ్జెట్ రైతులకు వరం. 7.7 కోట్ల మంది రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డుల పేరిట రుణాలివ్వడమే లక్ష్యంగా పెట్టుకోవడం గొప్ప విషయం. తెలంగాణలోని దాదాపు 50 లక్షల మంది రైతులకు రూ.5 లక్షల వరకు బ్యాంకుల ద్వారా క్రెడిట్(రుణం) లభించే అవకాశముంది. ప్రైవేట్ వ్యాపారస్తుల, దళారుల వద్ద చేయిచాపే దుస్థితి లేకుండా చేసేందుకు కిసాన్ క్రెడిట్ కార్డులను ప్రవేశపెట్టారు. తక్షణమే తెలంగాణలోని రైతన్నలంతా ఈ కిసాన్ క్రెడిట్ కార్డుల మంజూరు కోసం దరఖాస్తు చేసుకుని లబ్ది పొందాలని కోరుతున్నా.వివిధ రకాల పంట ఉత్పత్తులను పెంచి రైతులను అధిక ఆదాయం తెచ్చేలా చేసేందుకు నూతనగా 'ధన ధాన్య క్రుషి యోజన పథకం'ను ప్రవేశపెట్టడం హర్షణీయం. పప్పు దినుసుల కోసం ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతోపాటు జాతీయ పత్తి కమిషన్ ను ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో తెలంగాణలో పత్తి, పప్పు దినుసులు పండిస్తున్న రైతులకు అధిక ప్రయోజనాలు కలిగే అవకాశం రావడంతోపాటు గిట్టుబాటు ధర పెరిగే అవకాశముంది.ఉపాధి అవకాశాలను పెంచి యువతను వ్యాపార, పారిశ్రామికవేత్తలను చేసేందుకు బడ్జెట్ లో వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులు, ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తలు, వ్యాపారులకు రుణ పరిమితిని పెంచడం ఆహ్వానించదగ్గర పరిణామం. ఎంఎస్ఎంఈ రుణాలను రూ.5 కోట్ల నుండి రూ.10 కోట్లకు పెంచడంతోపాటు స్టార్టప్ లకు రూ.20 కోట్ల వరకు రుణాలిస్తామని బడ్జెట్లో పేర్కొనడం ద్వారా యువతకు ఎంతో ప్రయోజనం కలగబోతోంది. విద్యుత్ రంగంలో పెను మార్పులు తీసుకొచ్చి ప్రజలకు చౌక ధరకే కరెంట్ ను అందుబాటులోకి తెచ్చే విధంగా బడ్జెట్ ను రూపొందించడం గొప్ప విషయం. గ్రామాల్లో వలసలను నివారించేందుకు ప్రత్యేక ప్రణాళికలను బడ్జెట్ లో ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్ గారు పట్టణాలను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు బడ్జెట్ లో కేటాయింపులు చేయడం సంతోషంగా ఉంది. పట్టణాభివృద్ధికి నరేంద్రమోదీ ప్రభుత్వం చేస్తున్న క్రుషిలో తెలంగాణ ప్రభుత్వం భాగస్వామ్యం కావాలని కోరుతున్నా..మొత్తంగా నిర్మలా సీతారామన్ గారు ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ (2025-26) దేశ గతిని మర్చబోతుంది. దేశమంటే మట్టి కాదోయ్... దేశమంటే మనుషులోయ్ అన్నట్లుగా... ఈ దేశంలోని 90 శాతం పేద, మధ్య తరగతి ప్రజల ప్రయోజనాలను, అభివృద్ధిని కాంక్షిస్తూ రూపొందించిన బడ్జెట్ చరిత్రలో నిలిపోతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ జెడ్పిటిసి కుమ్మరి లచ్చమ్మ సారయ్య జిల్లా నాయకులు బండారి రవీందర్ పులి రత్నాకర్ రెడ్డి పులి వెంకటరెడ్డి వేముల రాజయ్య జిల్లాకౌన్సిల్ మెంబర్ పెండ్లి మల్లారెడ్డి బిజెపి మండల ప్రధాన కార్యదర్శి బండారి శ్రీనివాస్ అరికంతపు కృష్ణారెడ్డి బీజేవైఎం మండలాధ్యక్షుడు బత్తిని శ్రీధర్ భూత అధ్యక్షులు బండారి తిరుపతి రేపాల శ్రీనివాస్ పెంతల శ్యాంసుందర్ రెడ్డి యార రాజు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు

# బడ్జెట్‌పై కాంగ్రెస్ నిరసన దీక్ష హాస్యాస్పదం

- **వ్యక్తిగత పన్ను మినహాయింపు 12 లక్షలకు పెంచడం ఒక చరిత్రత్మాక నిర్ణయం**
- **చిన్న పరిశ్రమల కు ఆపన్నాహస్తం ఈ బడ్జెట్**
- **కేంద్రం బడ్జెట్ లో తెలంగాణ ఊసే లేదని మాట్లాడ్డం కాంగ్రెస్ నేతల అవగాహనా రహిత్యంకు నిదర్శనం**

**జగిత్యాల,ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** భారతీయ జనతా పార్టీ జగిత్యాల నియోజకవర్గం శాఖ ఆధ్వర్యంలో పేద మరియు మధ్యతరగతి వర్గాలను బలపరిచే విధంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా ఈరోజు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేక నిర్వహించి కృతజ్ఞతలు తెలియజేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్ బోగ శ్రావణి. ఈ సందర్భంగా డాక్టర్ బోగ శ్రావణి మాట్లాడుతూ. కేంద్ర బడ్జెట్ తో ప్రవేశపెట్టిన అన్ని పథకాల్లో తెలంగాణా భాగస్వామి అని మరిచి మాట్లాడ్డం వారి అవివేకం. అర్బన్ స్టేట్ గా ఉన్న తెలంగాణ లో 125 అర్బన్ లోకల్ బాడీస్ కి అమృత్ పథకం ద్వారా నిధులు రాబోతున్నాయి. స్వనిది పథకం



తో లక్షల మంది స్ట్రీట్ వెండర్స్ కి లబ్ది చేకూరుతుంది. జన్ ఆరోగ్య యోజన కింద ఆరోగ్య భీమా కల్పిస్తుంది. పేద, మధ్య తరగతి రైతు సంక్షేమం కు బాటలు వేసింది కేంద్ర బడ్జెట్. రాష్ట్రాల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ సమాఖ్య సహకార స్ఫూర్తిని గౌరవిస్తూ బడ్జెట్ ప్రవేశ పెట్టారు. కిసాన్ క్రెడిట్ కార్డుల పేరుతో రైతులకు రుణాలు కల్పిస్తుంది. అన్ని వర్గాల సంక్షేమ, అభివృద్ధి కి సమాతూకంగా బడ్జెట్ రూపాకల్పనా జరిగింది. నివేదిక ప్రకారం 10 సంవత్సరాల పాలనలో 2.9 కోట్ల ఉద్యోగాల సృష్టి జరిగితే, ఒక్క 2024 సంవత్సరంలోనే 4.9 కోట్ల ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. 2014 నుంచి 2024 వరకు మొత్తం 10 సంవత్సరాల మోదీ పాలనలో 17.6 కోట్ల ఉద్యోగాలు సృష్టించబడ్డాయి. వ్యవసాయ రంగంలో ఉపాధి కాంగ్రెస్ హయాంలో 16% తగ్గితే, మోదీ హయాంలో 19% అంటే 3% వరకు పెరిగింది. దేశం అంత బడ్జెట్ పై హర్షం వ్యక్తం చేస్తుంటే కేవలం ఓర్వలేని బీఆరెస్, కాంగ్రెస్ నేతలు విమర్శలు చేస్తున్నారు. వికసిత్ భారత్ నిర్మాణమే అంతిమ లక్ష్యం గా మోదీ నాయకత్వం లో ప్రభుత్వం ముందుకు సాగుతుంది.ఈ సందర్భంగా ప్రధాని మోదీ, ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామాన్, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్, ఎంపీ అర్వింద్ తో పాటు తెలంగాణ బిజెపి ఎంపిలకు కేంద్ర ప్రభుత్వం కు కృతజ్ఞతలు చెప్పారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నలువాల తిరుపతి, జగిత్యాల పట్టణ అధ్యక్షులు కొక్కు గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యనారాయణ, జిల్లా కార్యాలయ కార్యదర్శి జింబర్తి దివాకర్, జిల్లా కార్యదర్శి బొడ్డు పెద్ద గంగారం, జిల్లా కోశాధికారి దశరథ్ రెడ్డి, జగిత్యాల రూరల్ మండలం అధ్యక్షులు ఇట్నేని రమేష్, జగిత్యాల్ పట్టణ ప్రధాన కార్యదర్శి సిరికొండ రాజన్న,జున్ను రాజేందర్, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, ముద్దం రాము,సింగం పద్మ,పుష్ప రెడ్డి, మధురిమ, పిండేరు భానుప్రియ, మామిడాల కవిత, కడార్ల లావణ్య బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ విస్తీర్ణం ప్రక్రియ సవ్యంగా జరగలేదు

- **మాజీ శాసనసభ్యులు పెద్ది**

**నర్సంపేట, ఫిబ్రవరి 04(తెలంగాణ తెలుగు):** నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నర్సంపేటలో గ్రామాల విలీన ప్రక్రియ, మున్సిపాలిటీ విస్తీర్ణం ప్రక్రియ సవ్యంగా జరగలేదు నర్సంపేట రూరల్ మండలం ఎంపీటీసీల డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తిగా లోప భూయిష్టంగా ఉన్నది నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి కాంగ్రెస్ పార్టీ సూచనల మేరకు ఎమ్మెల్యే నిర్ణయం మేరకే అధికారులు ప్రవర్తిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యం గానీ, ప్రతిపక్ష పార్టీలతో నిర్వహించిన సమావేశంలో తీసుకున్నా నిర్ణయాలు బుట్టదాఖలు చేశారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళితే ప్రభుత్వ నిర్ణయం అని చెప్తున్నారు. గతంలో నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పాత ముగ్ధంపురం గ్రామ పంచాయతీ ప్రజల కోరిక మేరకే ప్రత్యేక గెజిట్ ద్వారా జీవో విడుదల చేసి చెన్నారావుపేట లో విలీనం చేయడం జరిగింది.ప్రజా పాలన అని చెప్పుకునే నాయకులు గతంలోనే చెన్నారావుపేటలో అంతర్లీనమైన పాత ముగ్ధంపురం గ్రామాన్ని చెన్నారావుపేట రూరల్ మండలానికి కలిపి గురజాల ఎంపీటీసీ పరిధిలోకి తీసుకురావడం అనేది ప్రజలకు పూర్తిగా అన్యాయం చేయడమే రాజుపేట గ్రామాన్ని కలుపుతున్నామంటూ మొదట గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేస్తారు. మళ్లీ తప్పుచేశమని చెంపలు వేసుకొని రాజుపేట గ్రామ



విలీనం రద్దు చేస్తున్నామంటూ మళ్లీ నోటిఫికేషన్ విడుదల చేసారు.రాజుపేట గ్రామ శివారు దాటి కిలోమీటర్ దూరంలో ముత్తోజిపేట గ్రామం ఉంటుంది. ముతోజిపేట గ్రామాన్ని విలీనం చేస్తున్నామంటూ నోటిఫికేషన్ విడుదల చేస్తూ మ్యాపింగ్ చేసారు.నర్సంపేట నుంచి ముతోజిపేటకు రవాణా మార్గం ఎట్లా ఉన్నదో స్థానిక ఎమ్మెల్యే చెప్పాలి.ప్రజల అభిప్రాయం స్వీకరించకుండా, గ్రామసభలు నిర్వహించకుండా. ప్రజలు రేషన్ షాప్ కు వెళ్లి పెట్టిన సంతకాలు సేకరించి. గ్రామ సభలు జరిగి ప్రజలు ఆమోదం పలికినట్లు రికార్డులు సృష్టించి ఈ విలీనానికి ప్రభుత్వం పాలుపడ్డది. నర్సంపేట మున్సిపాలిటీ విస్తరించాలని మున్సిపాలిటీ ప్రజలు ఎవరైనా అడిగారా.మున్సిపాలిటీలో విలీనమైన గ్రామ ప్రజలు స్థానిక ఎమ్మెల్యేను కలిసి మున్సిపాలిటీలో విలీనం చేయాలని కోరినారా.కేవలం ఉపాధి హామీ పథకం మీద దెబ్బ కొట్టే ప్రయత్నం చేశారు. గ్రామాలు విలీనంకావడం వల్ల నిధులు ఎక్కువగా వస్తాయి అని దుష్ప్రచారం చేశారు.పైన ముఖ్యమంత్రికి,ఇక్కడ ఉన్న ఎమ్మెల్యే కు అసలే పడదు. మరి నిధులు ఎలా వస్తాయో తెలియజేయలి. ఇది ప్రజా పాలనలా లేదు పిచ్చోళ్ళ పాలనల ఉంది.కేవలం విలీన గ్రామాల పరిధిలో ఉన్న వేలాది ఎకరాల అసైన్మెంట్ ఇతర భూముల పై ముఠాల కన్ను పడింది కాబట్టే ఈ గ్రామాల విలీనం.ఇంత పెద్ద ప్రక్రియ జరుగుతున్నప్పుడు ఒక్కసారైనా స్థానిక ఎమ్మెల్యే లేదా కాంగ్రెస్ ప్రభుత్వం గాని మున్సిపల్ అడ్మిషన్ అధికారులతో ,రెవెన్యూ అధికారులతో ,పంచాయతీరాజ్ అధికారుతో ముగ్గురు కలిసి సమీక్ష ఎప్పుడైనా జరిపిండ్లా.ఇలాంటి సమావేశాలు నిర్వహించకుండా తీసుకున్న నిర్ణయాల వల్లే ఈ గందరగోలాలన్నీ. నర్సంపేట మున్సిపాలిటీ విలీన ప్రక్రియ పట్ల ఏఏ గ్రామాలను ఎందుకు కలిపారు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.-రూరల్ మండలంలో ఏడు ఎంపీటీసీలను ఏ విధంగా ఏ ప్రతిపాదన కింద డీలిమిటేషన్ చేశారో జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులు బాధ్యత వహించి సమాధానం చెప్పాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తుంది అన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, మండలపార్టీ అధ్యక్షులు,బిఆర్టీయు జిల్లా అధ్యక్షుడు,మాజీ ఎంపీపీ,జడ్పీటీసీ,మండల ప్రధాన కార్యదర్శి,మాజీ కౌన్సిలర్స్,మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు,క్లస్టర్ బాధ్యులు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# అవినీతి వ్యతిరేక పోరాటం పేరుతో వంచించిన కేజ్రీవాల్ !



అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరి..ఆయనకు తానే ఏకలవ్య శిష్యుడిగా ప్రచారం చేసుకుని.. రాజకీయాల్లోకి వచ్చిన ఓ ఐఆర్ఎస్ అధికారి అరవింద్ కేజ్రీవాల్..అవినీతి మరకలతో ఇప్పుడు మరోమారు తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. అవినీతి చుట్టూ కేజ్రీవాల్ అల్లుకు పోయారు. అవినీతికి వ్యతిరేకంగా జన లోక్‌పాల్ బిల్లుకోసం అన్నాహజారే నేతృత్వంలో జరిగిన ఉద్యమమే ఆమ్ ఆద్మీ పార్టీ పుట్టుకకు దారితీసింది. ఢిల్లీ వీధుల్లో ఒకప్పుడు ఆప్ సంచలనంగా మారింది. ఆప్ టోపీలు ధరించి హమ్ ఆమ్ ఆద్మీ హూం.. అనేవారు. అవినీతిపై పోరాటాలు చేశారు. సామాజిక సమస్యలపై నృత్య రూపకాలు ప్రదర్శిస్తూ ప్రజలను ఆకట్టుకునేవారు. సామాన్య ప్రజలకోసం ఇంతగా ఆలోచించిన పార్టీ లేదని, అవినీతి అంతం ఆవాలంటే ఆప్ రావాలన్న పార్టీగా గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యమంత్రి అయిన కొత్తలో కేజ్రీవాల్ ప్రజా సమస్యలపై కేంద్రంపై పోరాడేందుకు నిరసన ప్రదర్శనలు నిర్వహించేవారు. దేశ వ్యాప్తంగా ఒకప్పుడు మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ సృష్టించిన సంచలనమే ఆప్ కూడా సృష్టించింది. కేజ్రీవాల్‌తో చేతులు కలిపేందుకు ఎందరో మేధావులు అనేక రాష్ట్రాల్లో ముందుకు వచ్చారు. వారిలో లోక్‌సత్తా జయప్రకాశ్ నారాయణ్ వంటి వారు ఉన్నారు. అలాంటి ఆప్ పూర్తిగా కనుమరుగు అయ్యే ప్రమాదం ఏర్పడింది. ఈ క్రమంలో తాజాగా ఢిల్లీ ఎన్నికల్లో గెలిస్తేనే.. కేజ్రీవాల్‌కు రాజకీయ భవితవ్యం ఉన్నట్లు. లేకుంటే ఆయనకు రాజకీయ సమాధి తప్పదు. అవినీతిపై పోరాటంలో కాంగ్రెస్‌పై యుద్ధం ప్రకటించిన కేజ్రీవాల్..అనతి కాలంలోనే దేశ ప్రజల మనసులు గెల్చుకున్నారు. ప్రజలు రాజకీయ నాయకుల అవినీతి పట్ల ఎంత అసహ్యంగా ఉన్నారనడానికి కేజ్రీవాల్ ఎదుగుదలే కారణం. కానీ అనతి కాలంలోనే కేజ్రీవాల్ నిజస్వరూపం బయటపడింది. ఆయన ముసుగు తొలగింది. అవినీతికి కేంద్రంగా కేజ్రీవాల్ రాజకీయాలు నడిచాయి. ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఇందుకు పరాకాష్ట. అలాగే తన ఇంటిని వందల కోట్లతో అద్భుతంగా..అంటే బిజెపి మాటల్లో శీష్‌మహల్‌గా మార్చుకున్న తీరు ఆయన ప్రతిష్టను బాగా దిగజార్చింది. కాంగ్రెస్ అవినీతిని వ్యతిరేకించిన కేజ్రీవాల్... కాంగ్రెస్ పంచనే చేరారు. ఇప్పుడు ఢిల్లీలో మాత్రం ఆయనకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడు తోంది. ఆయన మంత్రులు అంతా అవినీతిలో పట్టుబడ్డారు. నిప్పులేనిదే పొగరాదన్నట్లు ...కేంద్రం ఎంతగా కక్షకట్టి కేసులు పెట్టినా..అవినీతి లేనిదే ఇవి నిలవవు. లిక్కర్ కేసులో బిఆర్ఎస్ అధినేత కవిత దూరిందం టేనే అవినీతి ఉందని స్పష్టం అయ్యింది. ఈ క్రమంలో కేజ్రీవాల్ ఎంతగా ఇప్పుడు అరిచి గీపెట్టినా ప్రజలు నమ్ముతారని అనుకోవడానికి లేదు. గెలుపు కోసం అవినీతి వ్యతిరేక పోరాటాన్ని పక్కన పెట్టిన కేజ్రీవాల్, ఉచిత పథకాలతో ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నంలో రాజకీయాలు మొదలు పెట్టారు. అవినీతి వ్యతిరేక రాజకీయాలు పక్కన పోయాయి. కేవలం తన స్వార్థ రాజకీయాలు మొదలు పెట్టారు. అందుకే పదేళ్లుగా ఢిల్లీ పీఠం పట్టుకుని గట్టిగా అతుక్కు పోయిన కేజ్రీవాల్‌కు ఈ ఎన్నికలు అంతు సులువు కాదు. ఆయన పక్కన ఉన్న ఎమ్మెల్యేలు అంతా పార్టీని వీడుతున్నారు. కేజ్రీవాల్నిజస్వరూప తెలిసిన వారు బయట పడుతున్నారు. అందుకే ఢిల్లీలో 2013 నుంచీ ముఖ్యమంత్రిగా ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ భవిష్యత్ ఏమిటి అన్న విషయం గతంలో ఏనాడు లేని విధంగా చర్చ జరుగుతోంది. ఎందుకంటే అవినీతి అన్న వ్యవహారం నుంచి కేజ్రీవాల్ వైదొలిగారు. బిజెపిని ఢీకొంటాడన్న భ్రమలు తొలగిపోయాయి. పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజకయీంగా బీజేపీని ఒంటరిగా ఢీకొంటున్నారు. ఆ తరవాత అంతటి తెగువతొ అరవింద్ కేజ్రీవాల్ రాజకీయంగా బిజెపికి ఎదురొడ్డి నిలిచాలిచారు.. 2019లో జరిగిన సార్వత్రక ఎన్నికల్లో ఢిల్లీలో బీజేపీ మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు దక్కించుకున్నా, ఆరునెలల తర్వాత 2020లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి పూర్తి మెజారిటీ తెచ్చిపెట్టిందంటే అది కేజ్రీవాల్ పట్ల ప్రజలకున్న విశ్వాసంగా చూడాలి. తన పథకాల్లో ప్రజల్లో ఆదరణ లభించడంతో తనకు తిరుగులేదని భావించి ఒక దశలో ప్రధానమంత్రి పదవి కోసం కూడా కలలు కన్న కేజ్రీవాల్, ఆ దిశగా రాజకీయాలు నడిపారు. అదే కేజ్రీవాల్ ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నుంచి గట్టి పోటీ ఎదుర్కొంటున్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, అధునాతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలు, మహిళలు బస్సెక్కితే ఉచితంగా ప్రయాణించేందుకు గులాబీ రంగు టికెట్, మొహల్లా వైద్యశాలలు.. వీటన్నిటితో ఢిల్లీ ప్రజలు కేజ్రీవాల్ వైపే మొగ్గు చూపారు. ఈ క్రమంలో పథకాలతో ప్రజలను బురిడీ కొట్టించవచ్చని కేజ్రీవాల్‌కు అర్థం అయిపోయింది. అందుకే అవినీతి వ్యతిరేక ఉద్యమకాడిని వదిలేశారు. తానే అవినీతికి కేంద్రంగా మారారు. తన పార్టీవారు, మంత్రులు పలువురు ఇందులో కూరుకుపోయారు. చివరకు లిక్కర్ కేసులో కేజ్రీవాల్ జైలుకు వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో 2020లో వచ్చిన ఫలితాలు ఇప్పుడు పునరావృత మవుతాయని చెప్పలేని పరిస్థితి ఢిల్లీలో నెలకొంది. 2019లో మాదిరి 2024లో కూడా బీజేపీ మరోసారి మొత్తం ఏడు లోక్‌సభ సీట్లు సాధించింది. దీన్ని బట్టి ఢిల్లీ ప్రజలు జాతీయ స్థాయిలో నరేంద్రమోదీనే ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నారని రెండోసారి రుజువైంది. కాని అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి కేజ్రీవాల్‌ను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటారని ఖచ్చితంగా చెప్పేందుకు తగిన కారణాలు కానరావడం లేదు. ఎందుకంటే అవినీతి వ్యవహారంతో కేజ్రీవాల్ ప్రతిభ మసకబారింది. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా స్వయంగా తన ప్రతిష్ఠ దిగజారిపోయేలా చేసుకుంది. ఏ అవినీతి పునాదిగా ఆయన పార్టీ అవతరించిందో ఆ అవినీతే కాలనాగులా ఆయననే చుట్టుముట్టుకుంది. తనకంటూ విలాసవంతమైన భవంతిని నిర్మించుకోవడమే కాదు, ప్రభుత్వ పథకాల్లో కూడా వాటా కొట్టేయడం గురించి విజిలెన్స్ నివేదికల్లో బయటపడింది. మొహల్లా క్లినిక్‌లలో నకిలీ పేషంట్లను సృష్టించారని, జరగని వైద్య పరీక్షలను జరిగినట్లు చూపించారని, నాణ్యత లేని మందులు సరఫరా చేశారని ఈ నివేదికలు వెల్లడించాయి. ఒకప్పుడు ఎలాంటి మచ్చాలేని ఆమ్ ఆద్మీ పార్టీ అవినీతి పాఠాలు వంటబట్టించుకుంది. అణగారిన వర్గాల నుంచి అవతరించిన పార్టీలకు కూడా అవినీతి చెదలు పట్టడం రాజకీయంగా దురదృష్టం. తెలంగాణ సాధనలో కెసిఆర్ ఎంతగానో పోరాడినా అవినీతి ఇప్పుడు ఆయన పార్టీని కూడా మింగేసింది. జగన్ అవినీతి రాజకీయాలు కూడా ఎపిలో వైసిపిని ముంచాయి. అవినీతికి సంబంధించి మాట్లాడితే ప్రజలు ఛీత్కరించే పరిస్థితి వచ్చింది. దీంతో ఇప్పుడు కేజ్రీవాల్ పతనం కూడా ఆశ్చర్యానికి గురిచేయదనే చెప్పాలి.



# అక్రమ వలసదారులపై ఉక్కుపాదం

- వెతికి పట్టుకుని మరీ దేశందాటిస్తున్న ట్రంప్
- మిలిటరీ విమానంలో పలువురు భారతీయుల తరలింపు

**వాషింగ్టన్,ఫిబ్రవరి4:** అమెరికాలో అధికారం చేపట్టిన తర్వాత, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులను దేశం నుండి బహిష్కరించడానికి కఠినమైన చర్యలు తీసుకుంటున్నారు. నిన్న మొన్నటి వరకు కెనడా, మెక్సికో, కొలంబియా, బ్రెజిల్ దేశాలకు చెందిన వారిని గెంటేసిన ట్రంప్.. తాజాగా భారత్ వంతు వచ్చేసింది. అమెరికాలో నివసిస్తున్న అక్రమ భారతీయ వలసదారులను స్వదేశానికి తిప్పి పంపిస్తున్నారు. అమెరికా మిలటరీకి చెందిన సి -17 ప్రత్యేక విమానం బయలుదేరింది. అమెరికన్ అధికారి ఒకరు ఈ సమాచారం ఇచ్చారు. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన ఇమ్మిగ్రేషన్ ఎజెండాను నెరవేర్చడానికి సైన్యం సహాయం తీసుకుంటున్నారు. దీని కింద సైనిక విమానాల సహాయంతో ప్రజలను బహిష్కరించే పని ప్రారంభించారు. అమెరికాలో భారత్‌కు చెందిన దాదాపు 7లక్షల 25వేలకుపైగా మంది సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుండా ఉంటున్నట్టు సమాచారం. వీరిలో 18 వేల మందిని భారత్‌కు తరలించేందుకు జాబితా రూపొందించింది. ఈ విషయంలో భారత్ కూడా తమ స్పందనను తెలియజేసింది. అక్రమ వలసలకు తాము కూడా వ్యతిరేకమని స్పష్టం చేసింది. వీసా గడువు ముగిసినా సరైన పత్రాలు లేకుండా అమెరికా సహా ఎక్కడ ఉన్నా భారతీయులను వెనక్కి తీసుకొస్తామని తెలిపింది. కాగా, మెక్సికో, సాల్వెడార్ తర్వాత అమెరికాలో ఎక్కువగా ఉంటున్నది భారతీయులే అని లెక్కలు చెబుతున్నాయి. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోంది. దేశంలో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తిస్తున్న అధికారులు వారిని ఆయా దేశాలకు తరలిస్తున్నారు. అందులో భాగంగా భారత్‌కు ఓ విమానం బయలుదేరింది. సీ17 విమానంలో వీరిని తరలిస్తున్నారు. ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఇప్పటివరకు 8వేల మంది వరకు అక్రమ వలసదారులను అరెస్ట్ చేసినట్లు సమాచారం. అక్రమ వలసదారులను ఆయా దేశాలకు తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. అక్రమ వలసదారులను వెనక్కి పంపేందుకు ఒక్కో వ్యక్తిపై అమెరికా దాదాపు 4వేల 675 డాలర్లు ఖర్చు చేస్తోంది. ట్రంప్ ఆదేశాల మేరకు, అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దేశం నుండి బహిష్కరించాల్సిన 1.5 మిలియన్ల మంది వ్యక్తుల జాబితాను సిద్ధం చేసింది. డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారిగా, భారతీయ అక్రమ వలసదారులను భారతదేశానికి తిప్పి పంపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌లతో జరిగిన చర్చల సందర్భంగా ట్రంప్, విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో అమెరికాలో నివసిస్తున్న అక్రమ భారతీయుల గురించి ఆందోళన వ్యక్తం చేశారు. ఏ దేశంలోనైనా చట్టవిరుద్ధంగా నివసించడాన్ని భారత్ వ్యతిరేకిస్తుందని అన్నారు. మన పౌరుల్లో ఎవరైనా అమెరికాలో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లయితే, వారు భారతీయ పౌరులు అయితే, స్వదేశానికి చట్టబద్ధంగా తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు.

# ధూమపానం, గుట్కాలతో క్యాన్సర్





## వాటికి దూరంగా ఉండడమే మేలు

**హైదరాబాద్,ఫిబ్రవరి4:** ఈ మధ్య క్యాన్సర్ మరణలు పెరిగాయి. . పొగాకు, గుట్కా వంటి అలవాట్లతో పాటు, ఆహార పదార్థాల వల్ల కూడా క్యాన్సర్ వ్యాపిస్తోంది. క్యాన్సర్ ఆస్పత్రులు జనరల్ ఆస్పత్రులకన్నా కిటకిటాడుతున్నాయి. ఇది సోకిన వారు బతికి బట్టికట్టిన దాఖలాలు ఉండడం లేదు. ఏ స్టేజీలో ఉన్న మరణం తప్పడం లేదు. మంగళవారం నాడు ప్రపంచ కాన్సర్ దినోత్సవం. ఈ సందర్భంగా ..స్మోకర్స్ కు పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనర్థాల పై అవగాహన కలిగి ఉంటే మంచిది. ప్రధానంగా గుట్కా,ధూమపానం ప్రాణాలను హరించేస్తోంది. ఆరోగ్యవంతమైన జీవనాన్ని ఆస్వాదించాలంటే పొగాకు, గుట్కాలకు దూరంగా ఉండాలి. పొగ తాగడం వ్యసనంగా మారక ముందే ఫుల్ స్టాప్ పెట్టడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. పొగాకు, ధూమపానం అలవాట్లను మాన్పించడంలో సమాజంలో ప్రత ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. పొగాకు ఉత్పత్తులను ముందుగా అమ్మకుండా నిషేధించాలి. వాటిని తయారు చేయకుండా ఆంక్షలు విధించాలి. యువత సైతంచెడు స్నేహం వల్లో, సాంగత్య ప్రభావం వల్లనో పొగాకు ను అలవాటు చేసుకుంటున్నారు.అందుకే కాలేజీల కు వెళ్లే విద్యార్థులపై తల్లి దండ్రులు ఓ కన్నేసి ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సరదా గా మొదలయ్యే అలవాటు వల్ల జీవితం అవాంఛనీయ ఘటనలకు దారి తీయటం వాంఛనీయం కాదు. యోగా చేయడం,ఏదైనా ఇతర పనుల పై దృష్టి పెట్టడం ద్వారా కూడా దమ్ము కొట్టాలి అన్న ఆలోచన ను క్రమ,క్రమంగా దూరం చేసుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. .అధ్భుత ఫలితాన్ని సాధించవచ్చు అని చెప్పారు. పొగాకుతో క్యాన్సర్ ఎలా వస్తుంది అనే విషయం చెప్పటానికి,తెలుసుకోవటానికి వైద్యం చదవ వసరం లేదు. సిగరెట్, బీడీ తాగితే పొగాకు తో పెనవేసుకున్న రసాయనాలు శరీరం లోకి ప్రవేశించి కణాల డిఎన్ఏను నాశనం చేసే పనిలో పడతాయి. సిగరెట్ అలవాటు కు ముందు ,ఆ తర్వాత ఆరోగ్యం గురించి చెప్పొచ్చు. పొగతాగడం, గుట్కా తినం అంటే మృత్యువుకు 'దగ్గర' అయ్యే అవకాశాలే అధికంగా ఉన్నాయి. సిగరెట్ ,బీడీ కాల్చినపుడు వాటి నుంచే వెలువడే రసాయనాలు ఎంతటి ఉక్కు లాంటి కందరాల్ని ఐనా తుప్పు పట్టించే పనిలో ఉంటాయి. పటిష్ట మైన ఆరోగ్యం పునాదులను దారుణంగా దెబ్బ తీస్తాయి. కణాలుఅడ్డగోలుగా పెరిగేలా కారకం అవుతాయి తద్వారా కేన్సర్ కు దారి తీస్తాయి. ఆరోగ్యం గా ఉన్న కణాల డి ఎన్ ఏ ను దెబ్బ తీస్తాయి. అంటే శరీరం ఆకృతి ఇచ్చే కణాల పై ప్రభావం చూపుతాయి.



# భారత ఆటగాళ్లు ప్రతి వ్యూహంతో దాడి చేయాలి

**- భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్**



ఇటీవల ఇంగ్లాండ్ తో జరిగిన టీ20 సిరీస్ ను 4-1తో టీమిండియా గెలిచిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సిరీస్ ను విశ్లేషించిన భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్.. తనదైన శైలిలో వివరణ ఇచ్చాడు. భారత బ్యాటింగ్ ఆర్డర్లో కొన్ని తప్పులు దొర్లాయని వాటిని సరి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. ముఖ్యంగా కెప్టెన్ సూర్య కుమార్ యాదవ్, ఓపెనర్ సంజూ శాంసన్ పదే పదే విఫలం కావడంపై ఆందోళన వ్యక్తం చేశాడు. వీరిద్దరూ ఈ టోర్నీలో ఘోరంగా విఫలమయ్యారు. సంజూ కేవలం 51 పరుగులు మాత్రమే చేయగా, సూర్య కుమారు యాదవ్ 28 రన్స్ బాదాడు. ప్రత్యర్థులు వీరి వీక్నెస్ కనిపెట్టి ఔట్ చేస్తున్నారని, దీని నుంచి వీరు బయటపడాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించాడు. ఈ సిరీస్ లో శాంసన్ ను షార్ట్ బాల్ ద్వారా, సూర్యను లెగ్ స్టంప్ పై పికప్ షాట్ ద్వారా ఇంగ్లీష్ బౌలర్లు ఔట్ చేశారు. పదే పదే ఒకే తరహాలో ఔట్ అవుతూ అభిమానులకు కూడా చిరాకు తెచ్చారు. ఈ నేపథ్యంలో దీనిపై అశ్విన్ స్పందించాడు. ప్రత్యర్థులు కవ్వించే బంతులు విసురుతున్నప్పుడు, కాస్త సంయమనం పాటించాల్సిన అవసరం ఉందన్నాడు. అలాగే వాళ్లు మైండ్ గేమ్ ఆడుతున్నప్పుడు, మన బ్యాటర్లు కూడా ప్రతి వ్యూహంతో దాడి చేయాలని సూచించాడు. ఈ సిరీస్ లో ఈ ఇద్దరు బ్యాటర్లను చూసినప్పుడు తనకు రజనీ కాంత్ సినిమా గుర్తుకు వచ్చిందని సరదాగా వ్యాఖ్యానించాడు. తమిళ సినిమా తల్లు మల్లు అనే సినిమాలో హీరో వ్యవహరించిన మాదరిగానే వీళ్లు కూడా క్రికెట్ ఆడారని సరదాగా వ్యాఖ్యానించాడు. ఏదేమైనా ఇన్నాళ్లుగా పుల్ షాట్, పికప్ షాట్.. సంజూ, సూర్యల బలంగా ఉండేదని, దీనిని ఇప్పుడు బలహీనగా మార్చారని ఇంగ్లీష్ బౌలర్లని ప్రశంసించాడు. షార్ట్ బాల్ ను ఎదుర్కొనేందుకు సంజూ కఠినమైన ప్రాక్టీస్ చేశాడని అశ్విన్ చెప్పుకొచ్చాడు. తనకున్న సమాచారం ప్రకారం తను ప్లాస్టిక్ బంతితో ఆడటం, స్టాన్స్ మార్చుకుని మరీ సిద్ధమయ్యాడని, అయినా ఫలితం దక్కలేదని పేర్కొన్నాడు. ఏదేమైనా వీళ్లు ఈ వైఫల్యాల బాట నుంచి బయటకు రావాల్సిన అవసరం ఉండేదని పేర్కొన్నారు. మరోవైపు ఈ ఇద్దరి ఆటగాళ్లపై సోషల్ మీడియాలో భారత అభిమానులు జోకులు పేలుస్తున్నారు. భారత్ సిరీస్ గెలిచింది కాబట్టి సరిపోయిందని లేకపోతే వీరిద్దరి ప్లేస్ పై సందేహాలు వచ్చేవని ఫైరయ్యారు. చెత్త ఆటతీరుతో ఆరంభంలోనే వికెట్లు చేజార్చుకుంటున్నారని విమర్శించారు. ముఖ్యంగా గతేడాది కెప్టెన్ గా ఎంపికయ్యాక సూర్య.. ఒక గొప్ప ఇన్నింగ్స్ కూడా ఆడలేక పోయాడని, యువ ఆటగాళ్లు కష్టపడి కప్పులు సాధిస్తుంటే, తను కెప్టెన్ గా దాన్ని ఆస్వాదిస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు ఈ ఇద్దరు ఆటగాళ్లు కేవలం టీ20లకే పరిమితమవడంతో మళ్లీ వచ్చే అంతర్జాతీయ మ్యాచ్ ఆగస్టులో జరుగనుంది. బంగ్లాదేశ్ గడ్డపై భారత్ టీ20 సిరీస్ ఆడనుంది. అప్పటికల్లా బాగా ప్రాక్టీస్ చేసి గాడిలోకి రావాలని కోరుకుంటున్నారు.

# ఆటగాళ్లు చాలా కాలం నుంచి కలిసి క్రికెట్ ఆడుతున్నారు



**సవాళ్లను అధిగమించడానికి టీమిండియా సిద్ధంగా ఉంది**
**ఫలితాలు అనుకూలంగా మారితే పరిస్థితులు మారుతాయి**
**డ్రెస్సింగ్ రూమ్ రూమర్స్‌పై గంభీర్ కీలక వ్యాఖ్యలు**

బోర్డర్- గావస్కర్ ట్రోఫీలో టీమ్?ఇండియా డ్రెస్సింగ్ రూమ్?లో ఉద్రిక్త వాతావరణం నెలకొందని గతంలో వార్తలు వచ్చాయి. సెలక్షన్ కమిటీ, కెప్టెన్ రోహిత్ శర్మతో హెచ్ కోచ్ గంభీర్?కు విభేదాలు వచ్చినట్లు ఊహాగానాలు వెలువడ్డాయి. బోర్డర్-గావస్కర్ ట్రోఫీని టీమ్ ఇండియా ఓడిపోవడం వల్ల ఈ వార్తలకు మరింత బలం చేకూరినట్లైంది. అయితే ఇంగ్లాండ్?తో జరిగిన ఐదో టీ20లో టీమ్ ఇండియా గెలిచిన అనంతరం గంభీర్ ఈ విషయల గురించి క్లారిటీ ఇచ్చారు. "టీమ్?ఇండియా ఆటగాళ్లు చాలా కాలం నుంచి కలిసి క్రికెట్ ఆడుతున్నారు. నెల క్రితం టీమ్?ఇండియా గురించి రెండు పుకార్లు వచ్చాయి. భారత క్రికెట్ అంటే అదే. పరిస్థితులు బాగాలేనప్పుడు డ్రెస్సింగ్ రూమ్?లో జరిగే చాలా విషయాలు బయటకు వస్తాయి. ఫలితాలు అనుకూలంగా మారితే పరిస్థితులు మారుతాయి." అని గంభీర్ వ్యాఖ్యానించాడు. హై-రిస్క్, హై -రివార్డ్ విధానాన్ని అనుసరించి టీ20 మ్యాచ్ ల్లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడానికి తమ జట్టు సిద్ధంగా ఉందని టీమ్?ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వెల్లడించాడు. ప్రస్తుతం టీ20 ఫార్మాట్ లో క్రమం తప్పకుండా 250-260 రన్స్ సాధించడమే తమ లక్ష్యమని తెలిపాడు. ఈ ఆటలో తాము ఓడిపోతామని భయపడకూడదని అనుకుంటున్నామని పేర్కొన్నాడు. "మేం హై-రిస్క్, హై -రివార్డ్ క్రికెట్ ఆడాలనుకుంటున్నాం. మా టీమ్ లోని ప్లేయర్లు దీన్ని బాగా ఒంటపట్టించుకున్నారు. మేం క్రమం తప్పకుండా 250-260 రన్స్ చేయాలని భావిస్తున్నాము. అలా చేసే ప్రయత్నంలో మా జట్టు కొన్నిసార్లు 120-130 స్కోర్లకే ఆలౌట్ అయ్యే ప్రమాదం కూడా ఉంటుంది. టీ20 క్రికెట్ అంటే ఇదే. మనం అలాంటి హై-రిస్క్ క్రికెట్ ఆడకపోతే పెద్ద టోర్నీల్లో విజయాలు దక్కవు. " అని హెడ్ కోచ్ గంభీర్ వ్యాఖ్యానించాడు. మరోవైపు టీమ్?ఇండియా సరైన మార్గంలోనే ఉందని తాను అనుకుంటున్నానట్లు గంభీర్ తెలిపాడు. మెగా టోర్నీల్లోనూ ఇలాంటి నిర్భయమైన ఆటను కొనసాగించాలని అభిప్రాయపడ్డాడు. ఏదైనా కోల్పోతామని అస్సలు భయపడకూడదని వ్యాఖ్యానించాడు. అలాగే ఐదో టీ20 సెంచరీ బాదిన అభిషేక్ శర్మపై గౌతమ్ గంభీర్ ప్రసంసలు కురిపించాడు.

# విరాట్ వికెట్‌ను అలా తీయమని బస్సు డ్రైవర్ సలహా ఇచ్చారు



**రైల్వేస్? ప్లేయర్? హిమాన్ష్ సంఘ్వాన్**

గత కొంతకాలంగా పేలవ ఫామ్?తో కొనసాగుతోన్న టీమ్ఇండియా స్టార్? క్రికెటర్ విరాట్ కోహ్లీ మునపటిలా మారేందుకు రంజీ బాట పట్టాడు. దేశవాళీ టోర్నీల్లో జోరు అందుకునేందుకు సుమారు 12 ఏళ్ల తర్వాత బరిలోకి దిగాడు. అయితే తాజాగా రైల్వేస్‌తో జరిగిన మ్యాచ్‌లో దిల్లీ జట్టు ఇన్నింగ్స్ తేడాతో ఘన విజయాన్ని ఖాతాలో వేసుకుంది. అయితే ఒకే ఒక్క ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ మాత్రం ఆరు పరుగులకే ఔటయ్యాడు. రైల్వేస్ యంగ్? బౌలర్ హిమాన్ష్ సంఘ్వాన్ చేతిలో క్లీన్‌బౌల్డ్ అయ్యి పెవిలియన్ బాట పట్టాడు. ఇలా కోహ్లీ వికెట్ తీయడం వల్ల రైల్వేస్? ప్లేయర్? హిమాన్ష్ సంఘ్వాన్ ఒక్కసారిగా పాపులరైపోయాడు. తను అతడ్ని ఔట్? చేసిన తీరు గురించి క్రీడాభిమానులు నెట్టింట తెగ మాట్లాడుకుంటున్నారు. అయితే, విరాట్? వికెట్?ను ఎలా తీయాలన్న విషయాన్ని తమ జట్టు బస్సు డ్రైవర్ వివరించారని పేర్కొన్నాడు. అతడు 5వ స్టంప్‌లైన్‌లో బౌలింగ్ చేయాలని సూచించినట్లు పేర్కొన్నాడు. అయితే బస్సు డ్రైవర్ ఇలా చెప్పడం చూసి తను ఒక్కసారిగా షాకయ్యారని కోహ్లీ బలహీనతలపైనే కాకుండా తన బలాలపై దృష్టిపెట్టి బౌలింగ్ చేసినట్లు హిమాన్ష్ వివరించాడు. కోహ్లీ కొంతకాలంగా ఆఫ్‌సైడ్ ఆవల పడిన బంతులను ఆడటంలో ఇబ్బంది పడుతున్నాడనే విషయం తెలిసిందే. "ఈ మ్యాచ్‌కు ముందు దిల్లీ జట్టులో విరాట్? కోహ్లీ, రిషభ్ పంత్ ఆడుతున్నారని మాకు చెప్పారు. అయితే ఈ మ్యాచ్?లో పంత్ ఆడలేదు. అంతేకాకుండా మ్యాచ్? లైవ్? టెలికాస్ట్ అవుతోందని కూడా ఆ టైమ్?లో మాకు తెలీదు. తర్వాతనే మాకు అసలు విషయం తెలిసింది. రైల్వేస్ పేస్ టీమ్? బాధ్యతలు నేను తీసుకున్నాను. క్రమశిక్షణతో బౌలింగ్ చేయాలని మాకు కోచ్‌లు ఎప్పుడో సూచించారు. ఇక కోహ్లీ వికెట్?ను నేనే తీస్తానని టీమ్?లోని ప్రతిఒక్కరూ చెప్పారు. అయితే మా బస్సు డ్రైవర్ కూడా కోహ్లీకి నాలుగు లేదా ఐదో స్టంప్ లైన్‌లోనే బౌలింగ్ చేయాలని సూచించాడు. కానీ, నాపై నాకు పూర్తి నమ్మకం ఉంది. అవతలి వాళ్ల బలహీనతలపైన కాకుండా నా బలంపై నేను ఫోకస్? చేయాలనుకున్నాను. అలాగే బౌలింగ్ చేసి మరీ కోహ్లీని ఔట్ చేశాను" అని సంఘ్వాన్ పేర్కొన్నాడు. " నేను విరాట్?ను ఔట్ చేయడానికి స్పెషల్?గా ఏం ప్లాన్ చేయలేదు. ఇన్నింగ్స్ అయిపోయిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్తున్న టైమ్?లో కోహ్లీని కలిపి మాట్లాడాను. ఆయన నన్ను బాగా బౌలింగ్ చేశావని కోహ్లీ అభినందించారు. లంచ్ బ్రేక్‌లో ఫొటోలు దిగుతానని చెప్పాను. అందుకే తనను ఔట్ చేసిన బంతి తీసుకొని మరీ దిల్లీ డ్రెస్సింగ్ రూమ్‌లో కోహ్లీతో ఫొటో దిగాను" అని హిమాన్ష్ కోహ్లీ ఔట్? గురించి చెప్పుకొచ్చాడు.



# 9000 పరుగులు పూర్తి చేసిన ఆండ్రీ రస్సెల్



ప్రస్తుతం, టెస్ట్, వన్డేల కంటే ఎక్కువ టీ20 క్రికెట్ జరుగుతోంది. చాలా మంది అభిమానులు కూడా ఈ ఫార్మాట్ చూడటానికి ఇష్టపడుతున్నారు. అందుకే ఇప్పుడు చాలా దేశాలలో ప్రైవేట్ టీ20 టోర్నమెంట్లు జరుగుతున్నాయి. టీ20 క్రికెట్‌లో ఒకదాని తర్వాత ఒకటి భారీ రికార్డులు నమోదవడానికి ఇది కూడా ఒక పెద్ద కారణం. ఇటీవల కేకేఆర్ స్టార్ ఆటగాడు ఆండ్రీ రస్సెల్ తన పేరు మీద ఒక భారీ రికార్డును నమోదు చేసుకున్నాడు. నిజానికి, టీ20 క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో 9 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా రస్సెల్ నిలిచాడు. దుబాయ్‌లో జరుగుతున్న అంతర్జాతీయ టీ20 లీగ్‌లోని 27వ మ్యాచ్‌లో ఆడుతున్నప్పుడు అతను ఈ ఘనతను సాధించాడు. టీ20 క్రికెట్‌లో అతి తక్కువ బంతుల్లో 9 వేల పరుగులు పూర్తి చేసిన వారిలో ఆండ్రీ రస్సెల్ ముందంజలో ఉన్నాడు. ఈ మైలురాయిని సాధించడానికి ఈ తుఫాన్ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 5321 బంతులను ఎదుర్కొన్నాడు. రస్సెల్ ఇప్పటివరకు ఆడిన 538 టీ20 మ్యాచ్‌ల్లో 26 కంటే ఎక్కువ సగటుతో 9008 పరుగులు చేశాడు. ఇందులో అతను 2 సెంచరీలు, 21 అర్ధ సెంచరీలు చేశాడు. ఈ జాబితాలో ఆస్ట్రేలియా స్టార్ బ్యాట్స్‌మన్ గ్లెన్ మాక్స్‌వెల్ రెండవ స్థానంలో ఉన్నాడు. మాక్స్వెల్ టీ20 ఫార్మాట్‌లో అత్యంత ప్రమాదకరమైన బ్యాట్స్‌మెన్‌లలో ఒకడిగా పేరుగాంచాడు. అతను ప్రపంచవ్యాప్తంగా వివిధ టీ20 లీగ్‌లలో నిరంతరం ఆడుతున్నాడు. టీ20 క్రికెట్‌లో 9000 పరుగుల మైలురాయిని దాటడానికి మాక్స్‌వెల్ 5915 బంతులు తీసుకున్నాడు. మాక్స్వెల్ ఇప్పటివరకు ఆడిన 459 మ్యాచ్‌ల్లో 10 వేలకు పైగా పరుగులు సాధించాడు.

# జాక్వెస్ కల్లీస్ ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ క్రికెటర్

**- ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్**

ప్రపంచంలోనే అత్యుత్తమ క్రికెటర్ ఎవరా? అని ప్రశ్నిస్తే ఎక్కువ మంది టీమిండియా దిగ్గజం, క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్ పేరు చెబుతారు. ఇంకొందరు విరాట్ కోహ్లీ, వీవీ రిచర్డ్స్, గ్యారీ సోబర్స్, ముత్తయ్య మురళీధరన్ వంటి దిగ్గజాల పేర్లను సూచిస్తారు. కానీ, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ మాత్రం కొత్త పేరును సూచించాడు. సౌతాఫ్రికా దిగ్గజ ఆల్‌రౌండర్ జాక్వెస్ కల్లిస్ ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ క్రికెటర్ అని పేర్కొన్నాడు. 'జాక్వెస్ కల్లిస్ ఆల్‌టైమ్ గ్రేటెస్ట్ క్రికెటర్. మిగతా వారి గురించి నాకు తెలియదు. నా దృష్టిలో మాత్రం కల్లిస్ అత్యుత్తమ క్రికెటర్. టెస్ట్‌ల్లో 13 వేల పరుగులతో పాటు 45 సెంచరీలు, 300 వికెట్లు తీసాడు. మిగతా వారంతా తమ కెరీర్‌లో బ్యాటింగ్ లేదా బౌలింగ్‌లో మాత్రమే అత్యుత్తమ గణంకాలు నమోదు చేశారు. కానీ కల్లిస్‌లా అత్యుత్తమ ఆల్‌రౌండ్ ప్రదర్శన కనబర్చలేదు. కల్లిస్ ఫీల్డింగ్ కూడా అసాధారణం. స్లిప్స్‌లో అతను అసాధారణ ఫీల్డర్. కానీ అతనికి రావాల్సిన గుర్తింపు రాలేదు. ఎందుకంటే కల్లిస్ వ్యక్తితత్వం భిన్నంగా ఉంటుంది. అతను ఎక్కువగా మాట్లాడాడు. దాంతో అతన్ని మీడియా ఎక్కువగా హైలైట్ చేయలేదు.'అని రికీ పాంటింగ్ చెప్పుకొచ్చాడు. జాక్వస్ కల్లిస్ 19 ఏళ్ల తన సుదీర్ఘ కెరీర్‌లో సౌతాఫ్రికా తరఫున 166 టెస్ట్‌లు, 328 వన్డేలు ఆడాడు. టెస్ట్‌ల్లో 13289 పరుగులు చేశాడు. టెస్ట్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో సచిన్(15,291), రికీ పాంటింగ్(13,378) తర్వాతి స్థానంలో నిలిచాడు. వన్డేల్లోనూ 11,579 పరుగులు నమోదు చేశాడు. 519 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో 338 క్యాచ్‌లు అందుకున్నాడు.



తెలంగాణ తెలుగు జాతీయ దినపత్రిక
తెలుగు-వెలుగు
ప్రతిక్షణం ప్రజల పక్షం





# ఐటెం సాంగ్‌లో శ్రియ

యంగ్ హీరోల దగ్గర నుంచి సీనియర్ హీరోల వరకు అందరి సరసన సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది వయ్యారి భామ శ్రియ. ఈ ముద్దుగుమ్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా రాణించింది ఈ ముద్దుగుమ్మ. తెలుగులో స్టార్ హీరోలు కూడా ఈ అమ్మడి డేట్స్ కోసం ఎదురుచూసేవారు అప్పట్లో అంత బిజీగా గడిపింది శ్రియ. తెలుగులోనే కాదు తమిళ్ లోనూ సినిమాలు చేసి మెప్పించింది. నటనతో పాటు అందంలోనూ ఈ అమ్మడు అదరగొట్టింది. ఇక ఇప్పుడు నాలుగు పదుల వయసులోనూ శ్రియ తన అందాలతో ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం శ్రియ సినిమాలకు గ్యాప్ ఇచ్చింది. అడపదడపా సినిమాల్లో నటిస్తుంది. మొన్నామధ్య ఆర్ఆర్ఆర్ సినిమాలో చిన్న రోల్ లో కనిపించింది. ఇక ఇప్పుడు భర్త కూతురితో సమయాన్ని గడుపుతుంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. హాట్ హాట్ ఫొటోలతో కుర్రాళ్లను కవ్విస్తుంది ఈ చిన్నది. ఇక ఇప్పుడు అంతగా అవకాశాలు లేక ఫ్యామిలీతో విదేశాల్లో గడుపుతోంది. ఇదిలా ఉంటే శ్రియ ఫామ్‌లో ఉన్నప్పుడు హీరోయిన్ గా చేస్తూనే స్పెషల్ సాంగ్స్ లోనూ మెరిసింది. ఇదిలా ఉంటే ఇప్పుడు మరోసారి శ్రియ స్పెషల్ సాంగ్ లో కనిపించనుంది. ఓ స్టార్ హీరో సినిమాలో ఐటెం సాంగ్ లో శ్రియ నటిస్తుందని తెలుస్తుంది. ఆ హీరో ఎవరో కాదు తమిళ్ టాప్ హీరో సూర్య. సూర్య ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో రెట్రో అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమా యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతుంది. ఈ సినిమాలో స్పెషల్ సాంగ్ లో శ్రియ నటిస్తుందని తెలుస్తుంది. ప్రేమికుల రోజు సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల చేయనున్నారని తెలుస్తుంది. త్వరలోనే దీని పై క్లారిటీ రానుంది. సంతోష్ నారాయణన్ సంగీతాన్ని అందిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది సమ్మర్ లో విడుదల కానుంది. మే నెలలో ఈ సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# రెండు సినిమాల నటనతోనే యమ క్రేజీ



ప్రస్తుతం ఈ క్రేజీ హీరోయిన్ పేరు టాలీవుడ్‌లో బాగా వినిపిస్తోంది. అలాగనీ ఈ ముద్దుగుమ్మ పెద్దగా సినిమాల్లో నటించలేదు. ఇప్పటివరకు కేవలం రెండంటే రెండు సినిమాల్లో హీరోయిన్ గా యాక్ట్ చేసింది. అందులో ఒకటి యావరేజ్ కాగా మరొకటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ మూవీ. దీంతో ఈ అమ్మడికి సినిమా అవకాశాలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా మరో తెలుగు సినిమాలో ఈ అందాల తారకు అవకాశం దక్కించి. క సినిమాతో బ్లాక్ బస్టర్ కొట్టిన కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం కే ర్యాంప్ లో ఈ ముద్దుగుమ్మకు కథానాయికగా అవకాశం లభించింది. దీంతో ఈ బ్యూటీ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రస్తుతం టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్లలో ఒకరిగా గుర్తింపు తెచ్చుకుంటోన్న ఆమె మరెవరో కాదు యుక్తి తరేజా. నాగ శౌర్య నటించిన రంగబలి మూవీతో తెలుగు సినిమాకు పరిచయమైన ఈ ముద్దుగుమ్మ మార్కో సినిమాతో పాన్ ఇండియా ఫేమస్ అయ్యింది. ఇందులో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఇప్పుడు కిరణ్ అబ్బవరం సినిమాలోనూ కథానాయికగా అవకాశం దక్కించుకుంది. దీంతో పాటు ఓ కన్నడ సినిమాలోనూ ఈ ముద్దుగుమ్మకు హీరోయిన్ గా ఛాన్స్ దొరికింది. హరియాణాలోని ఓ మధ్య తరగతి కుటుంబంలో పుట్టింది యుక్తి తరేజా. చిన్న వయసులోనే మోడలింగ్ రంగంలోకి అడుగు పెట్టింది. 2017లో ఢిల్లీ టైమ్స్ ఫ్రెష్ ఫేస్ అందాల పోటీల్లో విజేతగా నిలిచింది. డిగ్రీ ఆఖరి సంవత్సరంలో ఎమ్ టీవీ సూపర్ మోడల్ కాంటెస్ట్ లో పాల్గొనే అవకాశం దక్కించుకుంది యుక్తి. ఎలాగైనా ఈ ప్రతిష్ఠాత్మక టైటిల్ గెలవాలనుకున్న ఈ ముద్దుగుమ్మ డిగ్రీ పరీక్షలు ఎగ్గొట్టి కాంపిటీషన్ లో పాల్గొంది. విజేతగా నిలవకపోయినా నాలుగో స్థానంలో నిలిచి అందరి దృష్టిని ఆకర్షించింది. సినిమాల్లోకి రాక ముందు పలు టీవీషోస్, రియాలిటీ షోస్, మ్యూజిక్ వీడియోల్లో నటించింది యుక్తి తరేజా. ఆ తర్వాత రంగబలి తో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. మార్కో సినిమాతో పాన్ ఇండియా రేంజ్ లో గుర్తింపు తెచ్చుకుంది. ఇక సోషల్ మీడియాలోనూ ఈ ముద్దుగుమ్మకు ఓ రేంజ్ లో ఫాలోయింగ్ ఉంది. తను షేర్ చేసే గ్లామర్ ఫొటోస్, వీడియోలకు నెటిజన్ల నుంచి మంచి స్పందన వస్తుంటుంది.

# దూసుకుపోతున్న మినాక్షి చౌదరి

ఇండస్ట్రీలో చాలా మంది ఓవర్ నైట్ లో స్టార్స్ గా మారిపోయారు. కొంతమంది స్టార్ డమ్ కోసం ప్రయత్నిస్తున్నారు. బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో దూసుకుపోతున్నారు. కొంతమంది కొన్ని సినిమాలతోనే కనిపించకుండా పోయారు. ఇక మరికొంతమంది వరుస సినిమాలు చేస్తున్నారు. అయితే చాలా మంది భామలు వరుసగా సినిమాలు చేస్తున్నప్పటికీ అదృష్టం కలిసి రాక హిట్స్ అందుకోలేకపోతున్నారు. మరికొంతమంది మాత్రం హిట్స్ తో దూసుకుపోతున్నారు. పై ఫొటోలో కనిపిస్తున్న బ్యూటీ 4 నెలల్లో 3 హిట్లు అందుకుంది. అంతే కాదు ఆ సినిమాలు 850 కోట్ల కలెక్షన్స్ రాబట్టాయి ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? ఇప్పుడు స్టార్ హీరోలు కూడా ఆమె డేట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఇంతకూ ఆ బ్యూటీ ఎవరో తెలుసా.? ఆమె ఎవరో కాదు ఇప్పుడు టాలీవుడ్ లో ఎక్కడ చూసినా ఆమె పేరే వినిపిస్తుంది. ఆ భామ ఎవరో కాదు లేటెస్ట్ సెన్సేషన్ మీనాక్షి చౌదరి. మీనాక్షి చౌదరి ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ.. బిజీగా మారింది. అక్కినేని హీరో సుశాంత్ హీరోగా నటించిన ఇచ్చట వాహనములు నిలుపరాదు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది మీనాక్షి చౌదరి. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. రవితేజ హీరోగా నటించిన ఖిలాడి సినిమాలో తన అందంతో ఆకట్టుకుంది. ఇక బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసింది. తెలుగుతో పాటు తమిళ్ లోనూ సినిమాలు చేస్తుంది ఈ అమ్మడు. తమిళ్ లో రీసెంట్ గా విజయ్ గోట్ సినిమాలో నటించింది. తెలుగులో వరుస హిట్స్ అందుకుంది. 4 నెలల్లో 3 హిట్లు అందుకుంది ఈ చిన్నది. గత నాలుగు నెలల్లో మూడు హిట్స్ అందుకుంది ఈ చిన్నది. విజయ్ హీరోగా వెంకట్ ప్రభు దర్శకత్వం వహించిన ఈసినిమా 450 కోట్లకు వసూల్ చేసింది. ఈ సినిమాలో మీనాక్షి హీరోయిన్ గా చేసింది. మీనాక్షి హిట్ లిస్ట్‌లో చేరిన చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది.బాక్సాఫీస్ దగ్గర రూ.100 కోట్ల వరకు రాబట్టింది. సంక్రాంతి కానుకగా బ్లాక్ బస్టర్ హిట్ కొట్టింది మీనాక్షి సంక్రాంతికి వస్తున్నాం సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ సినిమా ఏకంగా రూ. 300కోట్లకు పైగా వసూల్ చేసింది. ఇలా గత నాలుగు నెలల్లో మూడు హిట్స్ అందుకుంది ఈ చిన్నది.





# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైనప్ చేసి బిజీగా ఉన్నాడు. రీసెంట్ డేస్ లో వరుస హిట్స్ తో దూసుకుపోతున్నాడు. దాదాపు ఆరేళ్ళ తర్వాత సలార్ సినిమాతో సూపర్ హిట్ ఆ అందుకున్నాడు ప్రభాస్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఈ సినిమా యాక్షన్ ఎంటర్టైనర్ గా తెరకెక్కింది. ఈ సినిమాలో మరో హీరోగా మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ నటించాడు. ఈ సినిమా తర్వాత ప్రభాస్ కల్కి సినిమాతో మరో హిట్ అందుకున్నాడు. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన కల్కి సినిమా ఏకంగా వెయ్యికోట్లకు పైగా వసూల్ చేసింది. ఇక ఇప్పుడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు లైనప్ చేశారు. ఇక ప్రభాస్ లైనప్ చేసిన సినిమాల్లో సలార్ 2, కల్కి 2, రాజా సాబ్, ఫౌజీ, స్పిరిట్ సినిమాలను లైనప్ చేశారు. ఇదిలా ఉంటే ప్రభాస్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సెలబ్రెటీలందరూ ప్రభాస్ ను తెగ పొగిడేస్తుంటారు. ప్రభాస్ మంచితనం గురించి.. ప్రభాస్ పంపించే ఫుడ్ గురించి ఎప్పుడు మాట్లాడుతూ ఉంటారు. తాజాగా నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రభాస్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ ప్రభాస్ పై ప్రశంసలు కురిపించారు. అలాగే పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ.. ప్రభాస్ చాలా మంచి వ్యక్తి. అతనికి చిన్న చిన్న ఆనందాలు ఎక్కువ ఇష్టం. స్టార్ డమ్ గురించి అస్సలు పట్టించుకోడు. సోషల్ మీడియాకు చాలా దూరంగా ఉంటాడు. ఇన్ స్టా గ్రామ్ లో ప్రభాస్ అకౌంట్ నుంచి షేర్ అయ్యే పోస్ట్ లు కూడా ప్రభాస్ షేర్ చేసేవి కాదు. ఈ మాట చెప్పి మీ అందరినీ నిరాశ పరిచినందుకు క్షమించండి అని అన్నారు పృథ్వీరాజ్. ప్రభాస్ ఎక్కువగా ఫామ్‌హౌస్‌లో సంతోషంగా ఉంటాడు. ఎక్కడైనా మొబైల్ పనిచేయని ప్రాంతానికి వెళ్దాం అని ఎప్పుడూ అడుగుతుంటాడు. అంత పెద్ద స్టార్ అయ్యుండి చిన్న చిన్న ఆనందాలను ఇష్టపడటం చూస్తుంటే ఆశ్చర్యంగా అనిపిస్తుంది అని అన్నారు. అలాగే సలార్ 2 త్వరలోనే ఈ సినిమా రానుందని అన్నారు. పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వస్తున్న లూసిఫర్2: ఎంపురాన్ కూడా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందని అన్నారు.

# కుష్బూకు గాయం

ప్రముఖ సీనియర్ నటి, రాజకీయ నాయకురాలు ఖుష్బూ తాజాగా గాయాలపాలైంది. ఆమె చేతికి కట్టుతో ఉన్న ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో, అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆమె ఫోటోని షేర్ చేసిన క్షణాల్లోనే, ఏమైందంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఖుష్బూ తన చేతికి గాయం అయిందన్న విషయాన్ని స్వయంగా సోషల్ మీడియాలో పోస్ట్ ద్వారా వెల్లడించింది. అయితే ఆ పోస్టులో గాయం ఎలా అయ్యింది? ఎప్పుడు జరిగింది? అసలేం జరిగింది? అనే విషయాన్ని మాత్రం ఆమె వెల్లడించకపోవడంతో అభిమానులు టెన్షన్ పడుతున్నారు. కానీ అదే పోస్ట్ లో ఫోటోతో పాటు "అనుకోని గాయాలు మన ప్రయాణాన్ని ఆపాలని చూస్తాయి. కానీ మనం మాత్రం ఆగిపోవద్దు... చిరునవ్వుతో ముందుకు సాగాలి" అంటూ పాజిటివ్ గా రాసుకొచ్చింది. ఖుష్బూ చేసిన ఆ పోస్టులో ఆమె చేతికి కట్టు కట్టి ఉన్నట్టుగా కనిపిస్తోంది. అయితే ఇంతటి గాయమైనప్పటికీ ఖుష్బూ ఏమాత్రం టెన్షన్ పడకుండా, చెదరని చిరునవ్వుతో ధైర్యంగా కనిపిస్తుండడం విశేషం. అయితే ఆమెకు ఈ గాయం ఎలా అయింది ? అన్న విషయం మాత్రం ఇంకా సస్పెన్స్ గా మారింది.



# పెళ్లి పీటలెక్కనున్న పార్వతి నాయర్

మలయాళ ప్రముఖ హీరోయిన్ పార్వతి నాయర్ త్వరలోనే పెళ్లిపీటలెక్కనుంది. ఓ వ్యాపార వేత్తతో కలిసి ఆమె ఏడడుగులు నడవనుంది. చెన్నైకి చెందిన వ్యాపారవేత్త ఆశ్రిత్ అశోక్ తో ప్రేమలో ఉన్న ఆమె త్వరలోనే ఏడడుగులు వేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అంతేకాదు తమ నిశ్చితార్థం జరిగినట్లు సోషల్ మీడియాలో ఫొటోలను కూడా షేర్ చేసింది. దీంతో కొద్ది క్షణాల్లోనే ఈ ఫొటోలు వైరల్ గా మారాయి. కుటుంబ సభ్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు, నెటిజన్లు పార్వతి నాయర్– అశోక్ లకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 'మైసూర్ శాండల్' సోప్ బ్రాండ్ అంబాసిడర్‌గా పార్వతి నాయర్ పేరు మార్మోగిపోయింది. ఇప్పటి వరకు సుమారు 30కి పైగా చిత్రాల్లో నటించిందీ అందాల తార. తెలుగులో న్యాచురల్ స్టార్ నాని నటించిన జెండాపై కపిరాజు సినిమాలో పార్వతి నాయర్ పాత్రలో మెప్పించింది. గతేడాది విజయ్ నటించిన ది గోట్ చిత్రంలోనూ ఓ కీలక పాత్రలో మెరిసిందీ అందాల తార.



Editer : Gunnala Anil Reddy, Address : Krushi Nagar, Sharelingampalli Mandalam, Ranga Reddy(Dist) Telangana Cell : 9705043131,8096660656